www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 248 | మంగళవారం | 27 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

మార్కెట్ కమిటీ చైర్మన్ల జీతాలు పెంపు

మన తెలంగాణ/ హైదరాబాద్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల జీతాలను రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచింది. ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు 16 ఏళ్ల తరువాత మార్కెట్ కమిటీ చైర్మన్ల జీతాలు పెంచడం గమనార్హం. సెలెక్షన్ గ్రేడ్ మార్కెట్ చైర్మన్ నెల జీతం రూ.2 వేల నుంచి రూ. 25 వేలకు, తరువాయి 6లో

రైతు కాల్ సెంటర్

- రాష్ట్ర సమితికి అనుబంధంగా టోల్ ఫ్రీ నెంబర్ 2



రైతుకు బీమా

రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం

ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది

అన్నదాతలు కేంద్రంపై తిరగబడే పరిస్థితి వస్తుంది

కరీంనగర్ ప్రాంతీయ రైతు అవగాహన సదస్సులో సిఎం కెసిఆర్

మన తెలంగాణ/ కరీంనగర్ : రాష్ట్రంలోని రైతులందరికీ వర్తించేలా రూ.5 లక్షల బీమా పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. బీమాకు సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారని ఆయన తెలిపారు. కరీంనగర్‌లో స్థానిక అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో సోమవారం ఉత్తర తెలంగాణ రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ పాడి, పంట సమృద్ధిగా ఉన్నప్పుడే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. దేశ వ్యాప్తంగా రైతుల విషయంలో ఇప్పటి వరకు ఉన్న స్తబ్దతను ఇకపై కొనసాగనివ్వబోమన్నారు. రైతులకు అమలుచేయ తలపెట్టిన బీమా విషయంలో రైతు సమన్వయ సమితులు జాగురతతో వ్యవహారించాలని, ఏ ఒక్క



రైతు తప్పిపోకుండా అందరికీ బీమా చేయించాలని సూచించారు. రాష్ట్రంలో చేపట్టిన కాళేశ్వరం, సీతారామ, దేవాదుల, పాలేరు, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టుల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. కాళేశ్వరం పూర్తయితే రైతులు ఆకాశం వైపు ఎదురు చూసే వీలుండదన్నారు. రాష్ట్రంలో కోటికి పైగా ఎకరాలు రెండు పంటలు పండించే బంగారు భూమి ఉందని, రైతుల స్థితిగతుల దృష్ట్యా దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి పంటకు ఎకరాకు ఏడాదికి రూ. 8వేల చొప్పున పెట్టుబడి అందించనున్నట్లు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. ఈ విషయంపై కేంద్రాన్ని కోరినప్పటికీ స్పందన లేదని, కేంద్ర ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంటే దేశంలోని రైతులు తిరుగుబాటు చేసే పరిస్థితి వస్తుందన్నారు. దేశ రైతాంగానికి తెలంగాణ తరువాయి 6లో



బ్రిటన్‌లో భారీ పేలుడు

నలుగురు దుర్మరణం

లిసెస్టర్‌షైర్‌లోని భవనంలో ఘటన

ఉగ్రచర్య కాదని పోలీసుల ప్రకటన

లండన్: లిసెస్టర్‌షైర్ నగరంలో మూడంతస్థుల భవనం ఒకదానిలో సోమవారం ఉదయం పేలుడు, అనంతరం వ్యాపించిన మంటలలో నలుగురు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. వీరిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తలించామని, అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, ఈ పేలుడు ఉగ్రవాద చర్య కాదని పోలీసులు తెలిపారు. లిచెస్టర్‌షైర్‌లోని వ్యాపార, నివాస భవనాలు అధికంగా గల హింక్లీ రోడ్లో సంభవించిన ఈ పేలుడు 'అత్యంత తీవ్ర ఘటన' గా పోలీసులు పేర్కొన్నారు. ఇది లండన్‌కు 143 కి.మీ.ల దూరంలో గుజరాతీ సంతతి అధికంగా గల ప్రాంతం. ఈ భవనం వున్న రహదారి వాణిజ్య, నివాస సముదాయాలు కలిగిన ప్రాంతంగా ప్రసిద్ధి గాంచింది. ఈ భవంతిలో గ్రౌండ్ లెవెల్‌లో దుకాణం, పైన రెండంతస్థులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పొగ, దుమ్ము, ధూళి ఆవరించి వుందని, ప్రమాదం జరిగినప్పుడు భూకంపం వచ్చినట్టుగా పెద్ద పెట్టున ప్రకంపనలతో భారీ శబ్దం వచ్చిందని స్థానికుడొకరు తెలిపారు. పేలుడు సంభవించిన భవనం శిథిలాల కింద అత్యవసర సిబ్బంది గాలింపు ఇంకా కొనసాగుతున్నందున మృతుల సంఖ్య బాగా పెరిగే అవకాశముందని పోలీసు సూపరింటెండెంట్ తరువాయి 6లో

శ్రీదేవి-బోనీ కాల్‌డేటాపై ఆరా

పలు ప్రశ్నలు



హోటల్ బాత్‌రూమ్‌లోని స్నానాల తొట్టెలో ప్రమాదవశాత్తు మునిగి మరణించినట్లు ఫోరెన్సిక్ నివేదిక, కేసు దర్యాప్తు ప్రాసిక్యూషన్‌కు అప్పగింత

బోనీని మూడు గంటల పాటు ప్రశ్నించిన పోలీసులు

భౌతిక కాయం నేడు ముంబయికి పంపించే అవకాశం

దుబాయ్/ముంబయి : అందాల నటి శ్రీదేవి దుబాయ్ హోటల్ బాత్‌రూమ్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఆమె మరణం వెనుక ఏ విధమైన నేరపూరిత కుట్ర కోణం లేదని తెలిపారు. అత్యంత అనూహ్య స్థితిలో ఆకస్మికంగా శ్రీదేవి మృతి చెందడం కోట్లాది మంది అభిమానులను కలవరపర్చింది. దాదాపు 36 గంటలకు తరవాత శ్రీదేవి మృతికి సంబంధించి ఫోరెన్సిక్ నివేదికను యుఎఇ ఆరోగ్యశాఖ విడుదల చేసింది. ఈ నివేదికలో పేర్కొన్న అంశాలు పలు ప్రశ్నలకు అంతుపట్టని మలుపులకు దారితీస్తున్నాయి. ఇప్పుడు దుబాయ్ పోలీసులు ఈ మృతి కేసును దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ విచారణకు అప్పగించడంతో శ్రీదేవి మరణంలో ఏ కోణం ఉందనేది మరింతగా బిగుసుకుంది. పూర్తిస్థాయి పోస్టుమార్టం తరువాత శ్రీదేవి మృతి నిర్ధారణ నివేదికను దుబాయ్ పోలీసు ప్రధాన కార్యాలయం వారు వెలువరించిన విషయాన్ని దుబాయ్ ప్రభుత్వ మీడియా కార్యాలయం వారు ట్విట్టర్‌లో తెలిపారు. నివేదిక మేరకు శ్రీదేవి స్పృహలేని స్థితిలో బాత్‌టబ్‌లో పడి చనిపోయినట్లుగా వెల్లడైంది. అయితే 54 ఏళ్ల తరువాయి 6లో



ఆన్‌లైన్ ద్వారా ఎంసెట్

- మే 2,3న మెడిసిన్, అగ్రికల్చర్
- ఇంజినీరింగ్ 4,5,7 తేదీల్లో 6
- ఎస్‌సి, ఎస్‌టిలకు ఫీజు రూ.400

నేడు నోటిఫికేషన్


సర్పంచ్‌లకు విద్యార్హతలపై అధికారుల పరిశీలన

- హర్యానా, రాజస్థాన్ నమూనాల అధ్యయనం 3

ప్రతి జిల్లాలో పౌర సరఫరాల కమాండ్ కంట్రోల్ 3

- 28న సిద్దిపేటలో ఏర్పాటు

కుంచెపోటు



ఇదయినా భద్రంగా ఉంచుతారా స్కాముల బారిన పడకుండా..!

రాష్ట్ర మీ-సేవ ప్రాజెక్టుకు రజత పతకం 3


- నేడు ఢిల్లీలో పురస్కార ప్రదానం

పంజాబ్ సిఎం అల్లుడిపై బ్యాంక్ చీటింగ్ కేసు 10

పంచాయతీలకు రూ.3వేల కోట్లు?

బడ్జెట్‌లో కేటాయించే సూచన

మన తెలంగాణ / హైదరాబాద్ : గ్రామ పంచాయతీల వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని, నిధుల లేమితో అభివృద్ధి కుంటుపడిందని అభిప్రాయపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో సుమారు మూడు వేల కోట్ల రూపాయల మేరకు కేటాయింపులు చేయనున్నట్లు తెలిసింది. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా జనాభా ప్రాతిపదికన గ్రామ పంచాయతీలకు ఈ నిధులను కేటాయించనున్నట్లు సమాచారం. ఏ అభివృద్ధి పనికి ప్రాధాన్యతనివ్వాలి, దేనికెంత కేటాయించాలి తదితరాలన్నింటినీ రాష్ట్ర ఆర్థిక సంఘమే పరిశీలించి విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని తెలిసింది. కేంద్రం ఆర్థిక సంఘం నుంచి నేరుగా పంచాయతీలకు అందుతున్న నిధులకు తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆర్థికంగా సాయం చేయాలని భావిస్తోంది. జనాభాను బట్టి గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు ఇవ్వనున్నట్లు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రానున్న బడ్జెట్‌లోనే స్పష్టమైన తరువాయి 6లో



యువతి కిడ్నాప్.. గ్యాంగ్ రేప్

తల్లికి నగ్న చిత్రాల విడియోకాల్

హైదరాబాద్ చాంద్రాయణగుట్టలో దారుణం



మన తెలంగాణ/ హైదరాబాద్ : హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో నలుగురు యువకులు అదే బస్తీకి చెందిన ఓ యువతి (18)ని మూడు రోజుల క్రితం కిడ్నాప్ చేసి నగర శివార్లలోని ఓ ఫాంహౌస్‌లో నిర్బంధించి గ్యాంగ్ రేప్‌కు పాల్పడడమేకాక వివస్త్రను చేసి ఆ దృశ్యాలను యువతి తల్లికి విడియోకాల్ ద్వారా చూపించిన అమానవీయ ఘటన సోమవారం చోటు చేసుకుంది. కిడ్నాప్ కేసు, గ్యాంగ్‌రేప్ కేసు పెడితే నగ్న దృశ్యాలను తరువాయి 6లో

నాంపల్లి దర్గాలో ఉత్తమ్ ప్రత్యేక ప్రార్థనలు



మన తెలంగాణ/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ 'ప్రజా చైతన్య బస్సుయాత్ర' ప్రారంభానికి ముందు టిపిసిసి అధ్యక్షులు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్.సి.కుంటియాతో పాటు పలువురు సీనియర్ నేతలు సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి అజారుద్దీన్, శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష నేత మహ్మద్ షబ్బీర్ అలీ, కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రులు దానం నాగేందర్, మాజీ కేంద్ర మంత్రి బలరామ్ నాయక్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, మల్లు రవి, గూడూరు నారాయణరెడ్డి తదితరులతో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌తో పాటు ఆయన అనుచరులు పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు నాంపల్లికి చేరుకున్న నేతలకు కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బాణసంచా పేల్చి సంతోషం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి చేవెళ్లకు బయల్దేరిన ఉత్తమ్‌కుమార్ రెడ్డికి దారిపొడవునా కాంగ్రెస్ నేతలు నీరాజనం పలికారు. మహేశ్వరం నియోజకర్గం వద్ద మాజీ ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి, నేతలు దేప భాస్కర్ రెడ్డి స్వాగతం పలికారు.

కిసాన్ కాల్ సెంటర్!

- రైతు సమన్వయ సమితికి అనుబంధంగా ఏర్పాటు చేసే యోచన
- టోల్ ఫ్రీ నెంబర్ కేటాయింపుపై ఆలోచన చేస్తున్న ప్రభుత్వం
- రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులకు పరిష్కారం చూపడమే లక్ష్యం
- రాష్ట్ర సమితిలో చోటుకు తీవ్రస్థాయిలో లాబీయింగ్



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితికి అనుబంధంగా కిసాన్ (రైతు) కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. దీనికి 108, 100, సంచార పశువైద్య వాహనాల కోసం 1962 ఉన్నట్లు మూడు లేదా నాలుగు అంకెల టోల్ ఫ్రీ నెంబర్‌ను కేటాయించనున్నట్లు తెలిసింది. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను, సమస్యలను తెలుసుకుని పరిష్కారం చూపడమే లక్ష్యంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ అభిప్రాయపడుతోంది. కిసాన్ కాల్ సెంటర్‌పై సిఎం కెసిఆర్ కూడా సానుకూలంగా ఉన్నారని అందులో భాగంగానే రైతు సమన్వయ సమితి ప్రాంతీయ అవగాహన సదస్సుల్లో ఈ ప్రస్తావన తెచ్చినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.


కల్తీ విత్తనాలు, ఎరువులు రైతు సమితుల సభ్యులకు పట్టుబడినపుడు, మార్కెట్‌లో మద్దతు ధర రానపుడు రైతులు ఈ కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని అధికారులు చెబుతున్నారు. 'తెలంగాణ రైతు సమన్వయ సమితి కార్పొరేషన్'ను కంపెనీల చట్టం కింద రిజిస్ట్ర్ చేసే ప్రక్రియ తుది దశకు చేరుకుందని పేర్కొన్నారు. రైతులను సంఘటితం చేసి, పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు పెట్టుబడి పథకం అమలులో, వ్యవసాయ యాంత్రీకరణలో పాలుపంచుకోన్నున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. రాష్ట్ర రైతు సమన్వయ సమితిలో 42 మంది ఉంటారు. సిఎం కెసిఆర్ కేవలం అధ్యక్షులు (ఛైర్మన్)గా ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డిని ప్రకటించారు. ఇంకా సభ్యులను ప్రకటించలేదు. ఈ విషయంలో తీవ్ర స్థాయిలోనే మంతనాలు సాగుతున్నట్లు తెలిసింది. కెసిఆర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నందున వీటిలో చోటుకు అధికార పార్టీ నేతలు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నారు.

గుత్తా వర్గానికి దక్కని నల్లగొండ జిల్లా కో ఆర్డినేటర్

రాష్ట్ర రైతు సమన్వయ సమితికి అధ్యక్షుడిగా ప్రకటించబడిన గుత్తా సుఖేందర్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. నల్లగొండ జిల్లా రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్‌గా ఆయన తన వర్గానికి చెందిన ఇద్దరి పేర్లను సూచిస్తూ వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఈ నెల 17వతేదీన ఒక లేఖ రాశారు. ఇందులో తిప్పర్తి మండల ఎంపిపి పాశం రాంరెడ్డి, మాజీ డిసిసిబి ఛైర్మన్ యడవెల్లి విజేందర్‌రెడ్డి ఉన్నారు.దీనిని సిఎం కెసిఆర్‌కు పంపాలని లేఖపై పోచారం రాసినప్పటికీ అది చేరలేదని తెలిసింది. మంత్రి ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేశారని ఆరోపణలు కూడా వస్తున్నాయి. నల్లగొండ జిల్లా సమితి కో ఆర్డినేటర్‌గా ఇ. రాంచందర్ నాయక్‌ని నియమించారు. దీంతో సొంత జిల్లా విషయంలోనే గుత్తా అధిపత్యం సాధించలేకపోయారనే ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు.

'సులా వైన్ యార్డ్'ను సందర్శించిన దేవిప్రసాద్

మన తెలంగాణ/ హైదరాబాద్ : నాసిక్‌లోని ప్రముఖ బీరు కంపెనీ 'సులా వైన్ యార్డ్'ను తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవిప్రసాద్‌రావు సోమవారం సందర్శించారు. అక్కడి అధికారులతో కలిసి కంపెనీలో బీరు తయారవుతున్న తీరును పరిశీలించారు. రోజుకు ఎంత బీరు తయారువుతుంది, మార్కెట్‌లోకి ఎంత సరఫరా చేస్తున్నారు తదితర విషయాలను ఆయన అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సదరు కంపెనీ కార్మికులతో కూడా ఆయన ముచ్చటించారు. బీరు కంపెనీ ఆవరణలోనే పండిస్తున్న ద్రాక్ష తోటను కూడా ఆయన పరిశీలించారు.



'ఆర్డర్ టు సర్వ్' ఉద్యోగులకు శుభవార్త

బదిలీలకు ఆమోదం తెలిపిన సిఎం

మన తెలంగాణ/ హైదరాబాద్ : జిల్లాల పునర్వవస్థీకరణంలో భాగంగా 'ఆర్డర్ టూ సర్వ్' విధానంలో ఇతర జి ల్లాలో పనిచేస్తున్న పోలీసు సి బ్బందికి ప్రభుత్వం శుభవార్త వినిపించనుంది. ఒక జిల్లా లో జీతం తీసుకుంటూ 'ఆర్డ ర్ టూ సర్వ్' కింద మరొక జిల్లాలో విధులు నిర్వహిస్తు న్న పోలీసు సిబ్బంది బదిలీలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు సోమవా రం జిఒ నెం.24 ద్వారా గ్రీ న్ సిగ్నల్ ఇచ్చారు. పోలీసు ఉద్యోగులే కాక 'ఆర్డర్ టూ సర్వ్' కింద పనిచేస్తున్న వివి ధ విభాగాలకు చెందిన ప్రభు త్వ ఉద్యోగుకు దీన్ని వర్తింపజేయనున్నారు. ఇలాంటి వారిని వారు పనిచేస్తున్న జిల్లాలకే బదిలీ చేయాలని డిజిపి ఎం.మహేందర్‌రెడ్డి పలుమార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సిఎం ఈ మేర కు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలను ఏ ప్రాతిపాదికన చేపట్టాలనే విషయాలను కూ డా ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మేరకు డిజిపి నుంచి ఉత్తర్వులు వెలుగువడిన వెంటనే బదిలీల ప్రక్రియ సాగుతుంది. సిబ్బంది సంక్షేమంపట్ల ఎనలేని ఆసక్తిని కలిగిన ముఖ్యమంత్రి, డిజిపి, హోంమంత్రికి పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు వై.గోపిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

వికలాంగులకు రూ. 5వేల పెన్షన్

మన తెలంగాణ / హైదరాబాద్ : వికలాంగుల పెన్షన్లను ప్రతి నెలా 5వ తేదీలోగా చెల్లించాలని, పెన్షన్‌ను రూ. 5 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పెండింగ్ పెన్షన్లను వెంటనే చెల్లించాలని, దరఖాస్తు చేసుకున్న వికలాంగులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటి విజ్ఞప్తి చేసింది. వేదిక రాష్ట్ర అధ్యక్షులు జి.నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య నేతృత్వంలో వికలాంగులు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ రాష్ట్ర కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. అనంతరం సెర్ప్ పెన్షన్ అండ్ ఫైనాన్స్ అధికారి ప్రవీణకు మెమొరండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ల సమస్యలను సత్వరం పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్స్‌ను వెంటనే మంజూరు చేయాలని, అంగ వైకల్యాన్ని ధృవీకరించే 'సదరం' క్యాంపుల్లో సిబ్బంది సంఖ్యను పెంచాలని, వికలాంగులకు సౌకర్యాలు కల్పించాలని, సదరం సర్టిఫికెట్లు పొంది దరఖాస్తు చేసుకున్న విక లాంగులందరికి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 10.45 లక్షల మందికి పెన్షన్లు మంజూరయ్యాయని, మరో రెండు లక్షల మంది 40 శాతం వైకల్య ధృవీకరణ పత్రం కలిగి ఉన్నారని వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని వారు కోరారు.

47ఎమ్‌ఎల్‌ఏ క్యాంపు ఆఫీసులు రెడీ!

- వచ్చే నెలకల్లా పూర్తి చేసేలా అధికార యంత్రాంగం యత్నం
- రూ. 1341 కోట్లతో రోడ్లు భవనాల శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు

మన తెలంగాణ/హైదరాబాద్ : కొత్త జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలు, కొత్త మండలాల్లో తసీల్దార్ కార్యాలయాలు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్‌ఎల్‌ఏ క్యాంపు కార్యాలయాలు... ఇలా అనేక నూతన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు అప్పగించడంతో రానున్న బడ్జెట్‌లో రూ. 1341 కోట్ల మేరకు కేటాయింపులు చేయాలని ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపింది. గతేడాది రూ. 1108 కోట్ల మేరకు ప్రతిపాదనలు పంపినా చాలా వరకు నిధులు ఖర్చు కాకుండా మిగిలిపోయాయి. రానున్న కాలంలో లక్ష్యాలు ఎక్కువగా ఉన్నందున గతేడాది కంటే అదనంగా రూ. 233 కోట్లను కేటాయించాల్సిందిగా ప్రతిపాదించింది. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయం సముదాయాలు, ట్రెజరీ కార్యాలయాలు, సిబ్బంది నివాసాల నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం రూ.962 కోట్ల మేరకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినందున ఆ పనుల్ని వీలైనంత తొందర్లో పూర్తిచేయాలని భావిస్తున్న అధికారులు రానున్న బడ్జెట్‌లో రూ. 700 కోట్లను కేటాయించాలని ప్రతిపాదించారు. ఇక ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్‌ఎల్‌ఏ నివాసంతో పాటు క్యాంపు కార్యాలయాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నందున ఇందు కోసం రూ. 119 కోట్లు ఖర్చుకానుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని రోడ్లు భవనాల విభాగం రానున్న ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ప్రతిపాదించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎమ్‌ఎల్‌ఏ క్యాంపు కార్యాలయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తలా కోటి రూపాయల చొప్పున కేటాయింపులు చేయగా హైదరాబాద్ మినహా మొత్తం 104 భవనాలను నిర్మించాలని ఆర్ అండ్ బి విభాగం ప్రణాళిక సిద్ధం చేసింది. హైదరాబాద్ పరిధిలో ఉన్న 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు క్యాంపు కార్యాలయాల అవసరం లేదని ఎమ్‌ఎల్‌ఏల నుంచి వచ్చిన అభిప్రాయం మేరకు కేవలం 104 క్యాంపు కార్యాలయాల నిర్మాణ బాధ్యతలను మాత్రమే ప్రభుత్వం ఆర్ అండ్ బి కి అప్పగించింది. ఇప్పటి వరకు 16 భవనాల నిర్మాణం పూర్తికాగా వచ్చే నెల చివరి నాటికి మరో 31 భవనాల నిర్మాణం పూర్తవుతుందని, జూన్ చివరి నాటికి మిగిలిన భవనాలు సిద్ధమవుతాయని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 23 రెవిన్యూ డివిజన్లలో రెండు కోట్ల రూపాయల చొప్పున కార్యాలయాలను, కొత్తగా ఏర్పాటైన 125 మండలాల్లో ఒకటిన్నర కోటి రూపాయల చొప్పున తాసీల్దార్ కార్యాలయాలను కూడా నిర్మించడానికి డిజైన్లను సిద్ధం చేసిన ఆర్ అండ్ బి రానున్న బడ్జెట్‌లో ఇందు కోసం రూ. 234 కోట్లను ఖర్చు చేసే ప్రతిపాదనలను సమర్పించింది. ఇక తెలంగాణ కళాభారతి నిర్మాణానికి రూ. 31 కోట్లు, తెలంగాణ అమరవీరుల స్థూప నిర్మాణానికి రూ. 80 కోట్లు.. ఇలా మరికొన్ని పనులకు కలిపి మొత్తం రానున్న బడ్జెట్‌లో రూ. 1341 కోట్లను కేటాయించాలని ప్రతిపాదనలను సిద్ధం చేయడంతో ఆర్థిక శాఖతో సంప్రదింపుల అనంతరం ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



తక్కువ సమయంలో ఎక్కువ సేవలు


- కేంద్ర వాణిజ్య, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి సిఆర్.చౌదరి

మన తెలంగాణ/హైదరాబాద్: 'ఈ గవర్నెన్స్' విధానం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ సేవలను అందిస్తోందని కేంద్ర వాణిజ్య, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి సి.ఆర్.చౌదరి అన్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బిజెపి జాతీయ నాయకులు ఇంద్రసేనారెడ్డితో పాటు పలువురు కేంద్ర మంత్రిని సన్మానించారు. అనంతరం చౌదరి మీడియాతో మాట్లాడుతూ అర్హులైన వారికే ప్రభుత్వ ఫలాలు అందాలని, అందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటుందన్నారు. 2019 సంవత్సరం నాటికి విద్యుత్ లేని గ్రామాలు ఉండకూడదని, 2022 సంవత్సరం నాటికి అందరికీ సొంత ఇంటి కల నెరవేరాలనేదే ప్రధాని మోడి లక్ష్యమని చెప్పారు. ఆ తర్వాత ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ అబద్దాలు మాట్లాడడంలో సిఎం కెసిఆర్‌ను మించినవారే లేరన్నారు. దేశం కోసం త్యాగం చేసిన శ్యాంప్రసాద్ ముఖర్జీని సిఎం కెసిఆర్ అవమానించారన్నారు. కోల్డ్ స్టోరేజి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు.గిడ్డంగులు మూడపడుతున్నప్పటికీ రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుల సంక్షేమం విషయంలో కెసిఆర్‌కు స్పష్టత లేదని, పంటల దిగుబడి మార్కెటింగ్‌పై సరైన అంచనా లేదని పేర్కొన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే రైతు శిక్షణ కేంద్రాన్ని మూసివేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ప్రకాష్‌రెడ్డి, సుభాష్, సుధాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.



ఐపిఎస్‌ల బదిలీలెప్పుడు?

- ఇంకా కసరత్తు చేస్తున్న వైనం
- భారీ స్థాయిలో బదీలుంటాయంటూ ఊహాగానాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఐపిఎస్ అధికారుల బదిలీపై నెల రోజుల నుంచి జరుగుతున్న కసరత్తు ఇంకా కొలిక్కి రాలేదు. ఐఏఎస్‌ల బదిలీల పర్వం తర్వాత ఐపిఎస్‌ల బదిలీలు భారీ స్థాయిలోనే ఉంటాయని నెల రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. బదిలీలకు సంబంధించి పోలీసు శాఖలో ఒక మేరకు కసరత్తు కూడా ప్రారంభమైంది. ఐజీల మొదలు ఎస్పీల వరకు ఎక్కువ సంఖ్యలోనే బదిలీలు ఉంటాయన్న భావన ఏర్పడింది. రాష్ట్ర డిజిపిగా మహేందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సహజంగానే బదిలీ ఉంటాయని చాలా మంది పోలీసు అధికారులు భావించారు. ఇదే సమయంలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కూడా ఐపీఎస్‌ల బదిలీలపై దృష్టి పెట్టినట్లు వార్తలు వచ్చాయి. నిజానికి డిజిపిగా బాధ్యతలు తీసుకుని మూడున్నర నెలలు కావస్తున్నా మహేందర్‌రెడ్డి ఇంకా తన టీంను ఏర్పాటు చేసుకోలేదని పోలీసు అధికారులే గుసగుసలాడుకుంటున్నారు. డిజిపిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన తొలుత 'ఫ్రెండ్లీ పోలీసింగ్'ను అమలు చేయడంలో భాగంగా జిల్లాల్లో పర్యటించి స్వయంగా పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలతో, బాధితులతో పోలీసులు వ్యవహరించాల్సిన తీరుపై ఆయన స్పష్టమైన మార్గదర్శకాలనే తయారుచేశారు. మూడేళ్లకుపైగా ఒకే చోట పనిచేస్తున్న ఐపిఎస్‌లు సుమారు 35 మంది వరకు ఉన్నారని ఐపిఎస్‌ల బదిలీల జాబితాను సిద్ధం చేసే పని ప్రారంభమైందని పోలీసు వర్గాలు తెలిపాయి. పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా ఉన్న సివి ఆనంద్ కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సిఐఎస్‌ఎఫ్), పోలీసు ట్రైనింగ్ ఐజిగా ఉన్న చారు సిన్హా కేంద్ర సాయుధ దళం (సిఆర్‌పిఎఫ్)కు బదిలీ అయ్యారు. వచ్చే నెల మొదటి వారంలో ఐపిఎస్‌ల బదిలీలు పెద్ద ఎత్తున ఉండవచ్చని సమాచారం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలో వివిధ పోస్టుల్లో ఉన్న ఐపిఎస్‌లతో పాటు జిల్లాల ఎస్పీలు కూడా పెద్దయెత్తున బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. సమర్ధవంతమైన ఐపిఎస్‌లకు కీలక బాధ్యతలు నిర్వహించే పోస్టులు లభిస్తాయని, ఛాలెంజ్‌గా చేసుకుని ప్రజలకు పోలీసు సేవలు సమర్ధవంతంగా అందించే దిశగా పనిచేసే వారికే బదిలీలలో ప్రముఖ స్థానం ఉంటుందని అధికారులు అంటున్నారు.



లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. అభివృద్ధి కనిపించదేమి : ఎల్. రమణ

మన తెలంగాణ/హైదరాబాద్ : అధికారంలో వచ్చిన నాటి నుంచి రూ.4.80 లక్షల కోట్లు ఖర్చు చేశామని టిఆర్ఎస్ ప్రభుత్వం చెబుతోందని, అభివృద్ధి మాత్రం కనబడటం లేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ వ్యాఖ్యానించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో సోమవారం ప్రారంభమైన 6వ బ్యాచ్ శిక్షణ తరగతుల సందర్భంగా సినీ నటి శ్రీదేవి మృతిపట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. అనంతరం రమణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 119 నియోజకవర్గంలో ఎక్కడా కూడా ప్రభుత్వం ఖర్చు చేశామని చెబుతున్న ఆనవాళ్ళు లేదా అభివృద్ధి పనులు కనిపించడం లేదన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి నాయకులుగా ఎదిగి పదవులను అనుభవించి ఇతర పార్టీలలోకి వెళ్లి ఇప్పుడు టిడిపి ఎక్కడ ఉందని మాట్లాడుతున్న వారికి రాబోయే ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

రేపు టిడిపి నేతలతో చంద్రబాబు సమావేశం : తెలంగాణ టిడిపి నేతలతో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు బుధవారం ఎన్‌టిఆర్ భవన్‌లో సమావేశం కానున్నారు. ప్రస్తుత రాజకీయాలు, పల్లెపల్లెకు టిడిపి వంటి కార్యక్రమాలపై భేటీలో చర్చించనున్నారు. పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల, జిల్లా అధ్యక్షులు హాజరుకానున్నట్లు ఒక ప్రకటనలో ప్రధాన కార్యదర్శి జి. బుచ్చిలింగం తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన స్కూల్ అసిస్టెంట్ల పరీక్ష

మన తెలంగాణ/ హైదరాబాద్ : స్కూల్ అసిస్టెంట్ పోస్టుల రాత పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసినట్లు టిఎస్‌పిఎస్‌సి ప్రకటించింది. ఉదయం పది నుంచి పన్నెండున్నర గంటల వరకు ఇంగ్లీష్, మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గణితం, సోషల్ స్టడీస్ పాఠ్యాంశాలకు సంబంధించిన పరీక్షలను నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంగ్లీష్ పాఠ్యాంశానికి 6,808 మంది దరఖాస్తు చేసుకోగా 4,557 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. గణితం, సోషల్ స్టడీస్‌కు సంబంధించి 4,552 మంది దరఖాస్తు చేసుకోగా 3,225 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు. ఇంగ్లీష్‌లో 66.9, గణితం, సోషల్ స్టడీస్‌లో 70.8 అభ్యర్థుల శాతం నమోదైందన్నారు. ఇంగ్లీష్ పాఠ్యాంశానికి సంబంధించి పది సెంటర్లు, గణిత, సోషల్ స్టడీస్‌కు సంబందించి ఐదు సెంటర్లను హెచ్‌ఎండిఎ పరిధిలో ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. మంగళవారం స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌తో పాటు లాంగ్వేజి పండిట్లకు సంబంధించి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. లాంగ్వేజి పండిట్లలో హిందీ, మరాఠీ, ఉర్దూకు సంబంధించిన పాఠ్యాంశాలుంటాయన్నారు. ఫిజికల్ సైన్స్‌కు సంబంధించి 6,723 మంది, లాంగ్వేజి పండిట్లకు సంబంధించి 6,247 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఫిజికల్ సైన్స్ పరీక్షను ఉదయం పది నుంచి పన్నెండున్నర గంటల వరకు లాంగ్వేజి పండిట్లకు మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగనున్నాయని అధికారులు తెలిపారు. అభ్యర్థుల కోసం హెచ్‌ఎండిఎ పరిధిలో ఏడు చొప్పున సెంటర్లను ఏర్పాటు చేసినట్లు టిఎస్‌పిఎస్‌సి అధికారులు వివరించారు.

మెడికల్ కౌన్సిల్ బిల్లు వద్దు

మన తెలంగాణ/హైదరాబాద్ : మెడికల్ కౌన్సిల్ బిల్లును తీసుకురావడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు డాక్టర్లంతా సమాయత్తం కావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రవి వాంఖేద్కర్ పిలుపునిచ్చారు. ఇందుకోసం సమిష్టిగా ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. బిల్లుకు వ్యతిరేకంగా ఇప్పటికే అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత యాత్రను చేపట్టినట్లు చెప్పారు. యాత్రలో భాగంగా సోమవారం కోఠిలోని ఐఎంఎ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో రవి వాంఖేద్కర్ మాట్లాడుతూ ఈ బిల్లు వల్ల వైద్య రంగంలో అవినీతి విపరీతంగా పెరుగుతుందని, ఇది అప్రజాస్వామిక స్వభావంతో కూడుకునర్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతుడడంతో కేంద్రం దీన్ని స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసిందని, వచ్చే నెల నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల రెండవ విడతలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం క్రుటలు చేస్తోందని మండిపడ్డారు. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా కేంద్రం ఒత్తిడిని పెంచేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని 40 ప్రాంతాల నుంచి యాత్రలను చేపట్టినట్లు చెప్పారు. ఈ యాత్రలు నెల రోజుల పాటు కొనసాగుతాయన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లోని వైద్యులు ఈ యాత్రలను చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగానే ఐఎంఎ హాలు నుంచి సోమవారం యాత్రను ప్రారంభించారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు నరసింగారెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, డీఎంఈ రమేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి వెబ్‌సైట్ హ్యాకింగ్



మన తెలంగాణ/హైదరాబాద్ : బిజెపి శాసనసభాపక్ష నాయకులు జి.కిషన్‌రెడ్డి వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురికావడంతో పాకిస్థాన్‌కు చెం దిన వ్యక్తులు లేదా దేశద్రోహులే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని ఆరోపిస్తూ ఆయన సోమవారం రాష్ట్ర డిజిపి ఎం.మహేందర్‌రెడ్డికి ఫిర్యా దు చేశారు. kishanreddy.com అనే తన వెబ్‌సైట్ ద్వారా న్యూస్‌తో పాటు పార్టీ వివరాలు, కార్యక్రమాలు, దినచర్యను పొందుపరుస్తున్నామని, ప్రతి రోజు మాదిరిగానే సోమవారం ఉదయం పార్టీ కార్యాలయ ఉద్యోగి తన వెబ్‌సైట్‌లో న్యూస్ సెక్షన్‌ను అప్‌డేట్ చేసేందుకు ప్రయత్నించగా హ్యాకింగ్‌కు గురైనట్లు తేలిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హ్యాకింగ్ గురైన తీరును పరిశీలిస్తే పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులే ఈ చర్యకు పాల్పడి ఉంటారనే అనుమానాలు కలుగుతున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తన వెబ్‌సైట్‌ను హ్యాకింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. డిజిపి సలహా మేరకు ఆయన హైదరాబాద్ సిసిఎస్ విభాగంలోని సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : కాలుష్య నియంత్రణ మండలిలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, గతేడాది రాష్ట్ర స్థఆయిలో 'టీఎస్ ఐ పాస్' అవార్డు వచ్చినట్లుగానే ఈ సంవత్సరం కూడా మండలి ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు రావాలని మండలి సభ్య కార్యదర్శి పి.సత్యనారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు తమ నైపుణ్యతను పెంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండలి కార్యాలయంలో సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పని తీరు వల్ల సంస్థ ముఖ చిత్రం మారుతుందని, వారి పనితీరు సంస్థ పురోగతిలో చాలా కీలకమన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ శిక్షణ తరగతులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని బోర్డు ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బోర్డు సీఈఈ విశ్వనాథం, జాయింట్ చీఫ్ ఎన్వీరాన్‌మెంటల్ సైంటిస్టు వీరన్న, సైంటిఫిక్ ఆఫీసర్లు ప్రసాద్, మురళీమోహన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్ భవన్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ ముదిరాజ్ కమ్యూనిటీ భవన్ నిర్మాణానికి బిసి సంక్షేమ శాఖ రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి. వెంకటేశం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట గ్రామ పరిధిలో 5 ఎకరాల్లో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఇందుకు రెవెన్యూ శాఖ 5 ఎకరాల భూమిని కేటాయిస్తే ఈ నిధులతో ముదిరాజ్ భవనాన్ని నిర్మించడానికి నిధులు మంజూరు చేశారు.

యోగధ్యాయన పరిషత్‌కు: తెలంగాణ యోగధ్యాయన పరిషత్‌కు ప్రభుత్వం రూ. 2.18 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. గత బడ్జెట్‌కు సంబంధించి యోగధ్యాయన పరిషత్ పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించడంతో ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.శాంతికుమారి సోమవారం ఉత్తర్వుల ను జారీ చేశారు. వేర్వేరు జీవోల ద్వారా ఈ నిధులను విడుదల చేశారు.

'ఇ-గవర్నెన్స్'తో పని సులభతరం

- పారదర్శకత పెరుగుతుంది
- అవినీతి తగ్గుముఖం పడుతుంది
- సదస్సులో కేంద్రమంత్రి చౌదరి



మన తెలంగాణ/హైదరాబాద్: 'ఇ–గవర్నెన్స్'తో పని సులభతరమవుతుందని, పారదర్శకత పెరుగుతుందని కేంద్ర ఐటి శాఖ సహాయ మంత్రి సిఆర్ చౌదరి అన్నారు. హెచ్‌ఐసిసిలో బుధవారం ఈ గవర్నెన్స్‌పై 21వ జాతీయ సదస్సును రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కె.తారకరామారావుతో కలిసి ప్రారంభించి నాలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చౌదరి ప్రసంగిస్తూ, 'ఈ పరిపాలన'ను సమర్థంగా తీర్చిదిద్ది ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు రావాలంటే, ముందుగా ప్రజల ఆలోచనా సరళిలో మార్పురావాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఎలక్ట్రానిక్ పాలనతో పారదర్శకత పెరగుతుందని, అవినీతి తగ్గుతుందని, సేవలు సకాలంలో అందుతాయన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో దేశవ్యాప్తంగా ఆధార్ వివరాలను అనుసంధానించడం ద్వారా సుమారు 3 కోట్ల నకిలీ రేషన్‌కార్డులను తొలగించగలిగామని, ఫలితంగా రూ.17 వేల కోట్ల మేర ప్రజాధనం ఆదా అయిందని వివరించారు. 'ఇ గవర్నెన్స్'తో వ్యాపార నిర్వహణ సులభమై, విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు దారితీస్తుందన్నారు. దేశంలోని లక్ష పది వేల గ్రామపంచాయతీలను ఫైబర్ గ్రామ పంచాయతీలుగా మార్చామన్నారు. అభివృద్ధి కోసం టెక్నాలజీని వాడుకోవాలని, ఇందుకోసం కొత్తకొత్త ఆలోచనలతో ముందుకు రావాలని యువతకు, రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. 110 కోట్ల మొబైల్ కనెక్షన్లు దేశంలో ఉన్నాయని, రానున్నదియువభారతమేనని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

డిజిటల్‌తో సామాన్యులకు ఫలాలు :కెటిఆర్

డిజిటల్ ప్రజాస్వామ్యానికి డిజిటల్ విప్లవం దారి చూపాలని, పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ఫలాలు సామాన్య మానవునికి లబ్ధిచేకూరేలా ఉండాలని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కె.తారక రామారావు వ్యాఖ్యానించారు. రాష్ట్రం ఏర్పడి కేవలం మూడున్నరేళ్లే అయిందని, అయినా ప్రణాళికా బద్ధంగా, ప్రాధాన్యతలను బట్టి ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటున్నట్లు తెలిపారు. ఆర్‌టిఎ మొబైల్ వ్యాలెట్ ద్వారా వాహనదారుల ఇబ్బందులను తీర్చామని, కేవలం మూడు నెలల వ్యవధిలోనే 30 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో 4,500 'మీ సేవ' కేంద్రాల్లో సగటున రోజుకు 1.5 లక్షల చొప్పున 10 కోట్ల లావాదేవీలు జరిగాయని వివరించారు.

180 ప్రభుత్వ సేవలు ఇమిడేలా 'మీ సేవ 2.0' యాప్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నామని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పెట్టుబడుల ఆకర్షణకు సిఎం ప్రత్యేకంగా టిఎస్ ఐపాస్ పాలసీని ప్రకటించారని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే కేవలం 15 రోజుల్లోనే అనుమతులు వస్తాయని, రాకపోతే 16వ రోజు అనుమతినిచ్చినట్లుగానే భావించాలన్నారు. ఫలితంగా ఇప్పటి వరకు 6 వేల అనుమతులు ఇచ్చామని, రూ.1, 20,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయిని, 3 లక్షల మం దికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని, విద్యారంగంలో టిఎస్ క్లాసెస్, టిసాట్ అమలు చేస్తున్నామన్నారు. భూ రికార్డుల శుద్ధీకరణను చేశామని, ప్రతి గ్రామపంచాయతీకి కేంద్రం భారత్ ఫైబర్ నెట్ ఇవ్వాలని చూస్తుంటే, తాము ఇంటింటికీ ఇంటర్‌నెట్ ఇచ్చే ప్రక్రియను ప్రారంభించామని వివరించారు. పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడానికి వీలుగా డిపిఎంఎస్‌ను అమలు చేస్తున్నామని, దరఖాస్తు చేసిన 3 వారాల్లో అనుమతి ఇవ్వాలని నిబంధన విధించారు. కేంద్ర పరిపాలనా సంస్కరణల శాఖ కార్యదర్శి కెవి ఈపన్, ఐటి శాఖ కార్యదర్శి అజయ్ ప్రకాష్ సాహ్నే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, జిఎస్‌టిఎన్ చైర్మన్, 'ఆధార్' సిఇవో అజయ్ భూషణ్ పాండే, కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా తదితరులు పాల్గొని ప్రసంగించారు.



కాంగ్రెస్‌ది బస్సు యాత్ర కాదు, అంతిమయాత్ర

మన తెలంగాణ/హైదరాబాద్: కాంగ్రెస్ చేపడుతున్నది బస్సుయాత్ర కాదని, అంతిమయాత్ర అని, తెలంగాణకు మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీ శత్రువేనని, ఒక ద్రోహిగానే వ్యవహరించిందని విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. మాజీ కేంద్ర మంత్రి జైరాంరమేష్ చేసిన వ్యాఖ్యాలపై కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పందించాలని, తెలంగాణ పట్ల కాంగ్రెస్ అధిష్టాన విధానాన్ని ప్రకటించాలని, ఆ తర్వాతనే బస్సుయాత్రను చేపట్టాలని డిమాండ్‌చేశారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు ద్రోహం చేసేందుకు కాంగ్రెస్, బిజెపిలు పోటీపడుతున్నాయని, ఈ రాష్ట్రానికి సహాయం చేయాలనే చిత్తశుద్ధి ఆ రెండు పార్టీలకూ లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రలో పట్టిన గతే తెలంగాణలో పడుతుందని, అసెంబ్లీలో కేవలం టిఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు మాత్రమే ఉంటారని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర మాజీ మంత్రి జైరాంరమేష్ తెలంగాణ ప్రాంతం ఒకటి ఉన్నదనే విషయాన్ని గుర్తించడం లేదని, ఇక్కడ కాంగ్రెస్ కమిటీ, నేతలు ఉన్నారనే విషయాన్ని ఆ పార్టీ అధిష్టానం కూడా గుర్తించడం లేదని వ్యాఖ్యానించారు. జైరాంరమేష్ చేసిన వాఖ్యలపై స్పష్టత ఇవ్వకపోతే ప్రజలే కాంగ్రెస్‌ను నిలదీస్తారని హెచ్చరించారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఆ భయంతోనే ఉత్తమ్‌కుమార్ రెడ్డి బస్సు యాత్ర చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో అధికారంలోనికి వస్తామని కలలు కంటున్న కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రానికి ఏం చేస్తారో ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. బిజెపి నేతలు తెలంగాణలో అధికారంలోనికి రాలేమని తెలిసే తాము గెలిస్తే రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఇస్తామని హామీ నిస్తున్నారని, రైతులపై ప్రేమ ఉంటే ముందుగా కేంద్రం ప్రభుత్వం నుంచి రూ.50వేల రుణమాఫీని చెల్లించేలా ప్రయత్నించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక మునిగిపోయే పడవ అని, కోదండరామ్ ఏర్పాటు చేసే పార్టీ ఒక కాగితపు పడవ అని మంత్రి వ్యాఖ్యానించారు.

ప్రతి జిల్లాలో కమాండ్ కంట్రోల్ సెంటర్

- 28న సిద్దిపేటలో ప్రారంభం
- పౌరసరఫరాల కమిషనర్ సివి ఆనంద్



మన తెలంగాణ/హైదరాబాద్: పౌరసరఫరాల భవన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ అత్యుత్తమ ఫలితాలనిస్తుండడంతో క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. అందు లో భాగంగా ప్రతీ జిల్లాలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఆ శాఖ కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. ఈ నెల 28న సిద్దిపేటలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని మంత్రి హరీష్ రావు ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు.

మార్చినెలలో నిజామాబాద్, వనపర్తి, గద్వాల్, కరీంనగర్ తదితర జిల్లాల్లోనూ ఈ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లోనూ కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేసి హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. సంస్థకు చెందిన 171 గోదాముల్లో 1700 సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రక్రియ పది రోజుల్లో పూర్తి కానుందని తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్, గోదాం ప్రధాన ద్వారం, వేబ్రిడ్జి, ఫ్లాట్ ఫాం, గోదాముల్లో కదలికలను గుర్తించేలా ఒక్కో గోదాం వద్ద 10 కెమెరాల చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు గోదాముల పరిధిలో ఏం జరుగుతుందో ప్రత్యక్షంగా వీక్షించడానికి, వాహనాల కదలికలను వీడియో వాల్‌పై వీక్షించే విధంగా ఈ కెమెరాలను జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాలకు అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. 30 రోజుల పాటు కెమెరాల రికార్డింగ్ బ్యాకప్ ఉంటుందని కమిషనర్ తెలిపారు.

ఇజ్రాయిల్ ఉద్యోగాలంటూ... రూ. 30 లక్షలు టోకరా

- మోసపోయిన జగిత్యాలకు చెందిన 8మంది

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాలంటూ జగిత్యాలకు చెందిన నిరుద్యోగ యువకులను మోసం చేసిన ముగ్గురు నిందితులను రాచకొండ మల్కాజిగిరి జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ. 2 లక్షల నగదు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోడుప్పల్‌లోని ఆకృతి అపార్ట్‌మెంట్‌లో ఉండే ఆదం రాజు(55), జగిత్యాల్‌లోని జమ్మిగడ్డకు చెందిన కందుకూరి నారాయణ(45), ఈసిఐఎల్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డిలు ముగ్గురు పరిచయస్థులు. కాగా తనకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పించే స్నేహితులున్నారని నారాయణ అనే వ్యక్తి జగిత్యాల్‌కు చెందిన నిరుద్యోగ యువకులకు తెలిపాడు. దీంతో అతని మాటలకు ఆకర్షితులైన యువకులు కొందరు నారాయణ ద్వారా రాజు, శ్రీనివాస్‌రెడ్డిలకు పరిచయమయ్యారు. విదేశీ ఉద్యోగాలు పొందాలనే ఆసక్తి ఉన్న 8 మం ది నారాయణను కలిసి రూ. 30 లక్షలను 2016 లో అందజేశారు. అందులో నుండి రాజు, శ్రీనివాస్‌రెడ్డిలకు రూ. 20 లక్షలు అందజేశాడు నారాయణ. రూ.10లక్షలనుండి మరికొంత శ్రీనివాస్‌రెడ్డికి అందించాడు. కానీ, ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాల వీసా ఎంతకీ రాకపోవడంతో బాధితులు నారాయణ, రాజు, శ్రీనివాస్‌రెడ్డిలను నిలదీశారు. నిందితులు ఫోన్‌లో అందుబాటులో ఉండరు. నేరుగా కలిసే అవకాశాలివ్వడంలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు జగిత్యాల వాసులు. కేసు నమోదు చేసుకుని రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుండి నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.




'మీ సేవ'కు కేంద్ర అవార్డు

మనతెలంగాణ/హైదరాబాద్: 'మీ సేవ 2.0' ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ ప్రశంసలతో పాటు అవార్డు కూడా లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అందిస్తున్న సేవల్లో వినూత్న విధానాన్ని అనుసరిస్తున్నందుకుగాను 'మీ సేవ 2.0' ప్రాజెక్టును రజత పతకానికి ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇదే విభాగంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వ విద్యా శాఖ పోర్టల్‌కు స్వర్ణపతకం లభించింది. 8 విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరచిన ప్రాజెక్టులకు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు డిఓపిటి (సిబ్బంది శిక్షణ వ్యవహారాల మంత్రిత్వశాఖ) పతకాలు ప్రకటించింది. ఈ గవర్నెన్స్‌పై 21వ జాతీయ సదస్సు ముగింపు రోజైన మంగళవారం కేంద్ర మంత్రి చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం జరగనుంది. ప్రభుత్వ రీఇంజనీరింగ్ విధానం 'ఐనామ్ ప్రో'లో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి స్వర్ణ పతకం లభించగా, పశ్చిమబెంగాల్ అమలుచేస్తున్న 'ఈ అబ్గరి' విధానానికి రజతం లభించింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం విద్యారంగానికి అమలుచేస్తున్న పోర్టల్‌కు 'ఇన్నోవేషన్స్' విభాగంలో స్వర్ణం లభించగా, తెలంగాణ అమలు చేస్తున్న 'మీ సేవ 2.0' విధానానికి రజతం లభించింది. స్పేషియల్ టెక్నాలజీ, జిఐఎస్, 'ఈ ఆఫీస్', రిమోట్‌మ్యాపింగ్, విపత్తుల నిర్వహణ, శానిటేషన్, ఆరోగ్య యోజన, రెవిన్యూ అడ్మినిస్ట్రేషన్ తదితర పలు విభాగాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందుకు పలు రాష్ట్రాలకు ప్రకటించిన స్వర్ణ, రజత పతకాలను కూడా ముగింపు వేడుకల సందర్భంగా కేంద్ర మంత్రి ప్రదానం చేయనున్నారు.

సర్పంచ్ విద్యార్హతలపై మల్లగుల్లాలు

- ఇతర రాష్ట్రాల పరిస్థితులపై అధ్యయనం




మన తెలంగాణ/హైదరాబాద్ : సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థి కనీస విద్యార్హతను తప్పనిసరి చేయాలని గతంలో సుప్రీంకోర్టు చేసిన సూచనలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కనీస విద్యార్హతను తప్పనిసరి చేయాలని సుప్రీంకోర్టు గతంలో చేసిన సూచనల ప్రకారం హర్యానా, రాజస్థాన్‌లు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస విద్యార్హతను ఆ రాష్ట్రాల పంచాయతీరాజ్ చట్టాల్లో సవరణలు చేసి 2014 నుంచి అమలు చేస్తున్నాయి. హర్యానా ప్రభుత్వం సర్పంచి పదవికి పోటీ చేసే వారికి జనరల్ పురుషులకు పదవ తరగతి, మహిళలకు ఎనిమిదవ తరగతి, ఎస్సి,ఎస్టీలకు అయిదవ తరగతిని తప్పనిసరి చేసింది. దీనితో పాటు పోటీచేసే అభ్యర్థి ఇంట్లో తప్పనిసరిగా మరుగుదొడ్డి ఉండాలన్న నిబంధన కూడా విధించింది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఈ రాష్ట్రాల్లో అమలవుతున్న తీరును, ఎదురవుతున్న ఇబ్బందులను అధ్యయనం చేయాలని భావిస్తోంది. వీలైతే క్షేత్రస్థాయి పర్యటన చేసి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయాలనుకుంటోంది. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని సిద్ధం చేస్తున్నందున అభ్యర్థుల కనీస విద్యార్హత విషయంలో ఏర్పడే సాధకబాధకాలను ఆలోచిస్తోంది. రాష్ట్రంలోని పరిస్థితుల దృష్ట్యా కనీస విద్యార్హతను తప్పనిసరి చేయడంలో కొన్ని ఇబ్బందులున్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తండాలను కూడా పంచాయతీలు చేయాలని భావిస్తున్నందున గిరిజన తెగల్లో ఉండే కనీస విద్యార్హతను పరిగణనలోకి తీసుకుంటే అక్షరాస్యులు తక్కువ సంఖ్యలోనే ఉంటారన్న అభిప్రాయాన్ని పలువురు అధికారులు వ్యక్తం చేశారు. ప్రస్తుతం షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న 717 గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యులు, సర్పంచిలుగా కొనసాగుతున్నవారి విద్యార్హతల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. రాష్ట్రం మొత్తంమీద పంచాయతీ సర్పంచ్‌ల రిజర్వేషన్లను పరిశీలిస్తే ఎస్టీ పురుషులు 374, మహిళలు 375, ఎస్సీ పురుషులు 732, మహిళలు 733, బిసిలకు మొత్తం 2931, అన్ రిజర్వ్‌డ్(జనరల్)2916 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి అయిన పంచాయతి కార్యదర్శికి నిధుల వినియోగం, చెక్‌పవర్, కార్యనిర్వహణాధికారాలుంటే ఇకపైన సర్పంచికి కట్టబెట్టాలని ప్రభు త్వం భావిస్తుండంతో విద్యార్హత చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం లో లోతైన అధ్యయనం చేసి ఓ నిర్ణయానికి రావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్ కలెక్టర్‌కు కేంద్ర సత్కారం

మన తెలంగాణ/హైదరాబాద్: 'బేటీ బచావో..బేటీ పడావో' కార్యక్రమం అమలులో ప్రత్యేక చొరవ తీసుకున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా. యోగి తా రాణాను ప్రత్యేకంగా సత్కరించనున్నట్లు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డిప్యూటి సెక్రెటరి అశోక్ కుమార్ యాదవ్ తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో బాలికల విద్యకు జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలను కేంద్ర ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. బేటీ బచావో.. బేటి పడావో పథకాన్ని ప్రవేశపెట్టి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజస్తాన్‌లోని జుంజునులో మార్చి 8న నిర్వహించే వేడుకల్లో ఈ సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సత్కారానికి హాజరు కావాలని ఆ లేఖలో కోరారు.

ప్రజా భవిష్యనిధిలో ప్రవాసులకు చోటు!

న్యూఢిల్లీ : ప్రజా భవిష్యనిధిలో పొదుపు చేసిన ప్రవాస భారతీయుల ఖాతాను కొనసాగించేందుకు వీలు కల్పిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ప్రజా భవిష్యనిధిలో ఖాతా తెరిచిన వ్యక్తులు ప్రవాస భారతీయులుగా మారితే ఆ రోజు నుంచే వారి ఖాతాను రద్దు చేయాలని ఆర్థిక వ్యవహారాల శాఖ ఆదేశాలిచ్చింది. అయితే ఆ నిబంధనను సవరిస్తూ తాజాగా ఫిబ్రవరి 23న మరో ప్రకటన విడుదల చేసింది. భారతీయులెవరైనా ప్రజాభవిష్యనిధిలో 15ఏళ్ల పాటు పెట్టుబడి పెట్టి కాలపరిమితి ముగిసిన తరువాత కూడా మరో ఐదేళ్లు అందులోనే ఉంచి వడ్డీని పొందే వీలుంది. కానీ, ఏ భారతీయ పౌరుడైనా దేశం వదిలి వెళ్లి ప్రవాస భారతీయుడిగా గుర్తింపు పొందిన రోజు నుంచే ఆ వ్యక్తికి సంబంధించిన ప్రజా భవిష్యనిధి ఖాతా రద్దయ్యేది. ప్రస్తుతం విడుదలైన ఆదేశాల ప్రకారం ప్రవాస భారతీయులైనా కూడా ప్రజా భవిష్యనిధిలో వారి ఖాతాను కొనసాగించి నిర్ణయించిన వడ్డీరేటును పొందవచ్చు.



"ఒక పనిని బాగా చేయడమే కాకుండా, మరింత బాగా చేయగలననే అదనపు కోరికను కలిగి ఉండడమే సామర్థ్యం. – హెచ్.గిల్బర్ట్"

'సమన్వయం'తో రైతుకు మేలు



సంపాదకీయం

''పెద్దగా ఆలోచించు'' అన్న నానుడి మన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు అక్షరాలా వర్తిస్తుంది. కోటి ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా 'మిషన్ భగీరథ', నాలుగేళ్లలో చెరువులన్నీ పూడిక తీసేందుకు 'మిషన్ కాకతీయ', పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, వ్యవసాయానికి 24 గంటలు కరెంట్, ఎకరానికి రూ.4వేల వ్యవసాయ పెట్టుబడి వగైరా బృహత్ కార్యక్రమాలకు తాజాగా మరొకటి జత అయింది. అదే రైతు సమన్వయ సమితి. గ్రామ, మండల, జిల్లా సమితుల నుంచి రాష్ట్రస్థాయి వరకు ఇదొక 'రైతు మిత్ర' వ్యవస్థ. ఇది దేశంలోనే ప్రప్రథమం. దీని అమలు ఫలితాలనుబట్టి ఇది దేశవ్యాప్త ప్రభావం చూపుతుంది. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనే గంభీర ప్రకటనలు తప్ప అందుకవసరమైన ఏ చర్యలు తీసుకోని నరేంద్రమోడీ ప్రభుత్వం తెలంగాణ పథకాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సి వస్తుంది. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలపై రైతుల ఒత్తిడి పెరుగుతుంది. పారిశ్రామికవేత్తలకు ఏటా లక్షలకోట్ల రూపాయల రాయితీలిస్తున్న, బ్యాంకు రుణాలు రద్దు చేస్తున్న మోడీ ప్రభుత్వం వ్యవసాయరంగం పట్ల చూపుతున్న చిన్నచూపే నేటి రైతు దుస్థితికి మూలం. ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెడుతున్న రైతు కుటుంబాలు, వారిపై ఆధారపడిన శ్రమజీవులు – మొత్తంగా గ్రామీణులు సంతోషంగా ఉండాలంటే కావలసింది అరకొర చర్యలు, కడుపునింపని వాగ్దానాలు కావు, నిర్దుష్టమైన కార్యాచరణ పథకం, పకడ్బందీగా దాని అమలు.

తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన రైతు సమన్వయ సమితుల పథకం ఒక వ్యవస్థాగత చట్రం. అదొక కార్పొరేషన్‌గా రిజిష్టర్ అవుతుంది. ప్రభుత్వం రూ. 200 కోట్ల ఆరంభ పెట్టుబడి ఇవ్వటంతోపాటు బ్యాంకులనుంచి రూ.6–7వేలకోట్లు రుణం పొందేందుకు హామీదారుగా ఉంటుంది. ఇది పంచాయతీరాజ్ సంస్థలకు, సహకార బ్యాంకులకు, మార్కెట్ కమిటీలకు పోటీగాని,ప్రత్యామ్నాయంగానీ కాదు. రైతులకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలను ప్రచారం చేయటం, వ్యవసాయ పెట్టుబడి సాయం అందిందో లేదో పర్యవేక్షించటం, మేలైన విత్తనాలు, ఎరువులు తదితర ఉపకరణలు రైతులకు అందేటట్లు సహాయపడటం, ఒక్కో గ్రామంలో ఏ పంటలు ఎన్ని ఎకరాల్లో వేశారో సమాచార సేకరణ, వేయాలో నిర్ధారణ, ఉత్పత్తులను ఒక క్రమపద్ధతిలో మార్కెటింగ్ కేంద్రాలకు పంపటం, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు వ్యవసాయోత్పత్తులు కొనేటట్లు చూడటం, దళారులు ధర కోతపెడితే సమితి కొనుగోలు చేయటం వంటివి నిర్దేశిత కార్యక్రమాలు. దక్షిణ తెలంగాణలో 13 జిల్లాల మండల రైతు సమన్వయ సమితుల సమావేశంలో ముఖ్యమంత్రి కెసిఆర్ చెప్పినట్లు అన్నీ సక్రమంగా అమలు జరిగితే అది రైతు ఇంట పండగే.

రానున్న వానాకాలం పంటలతో మొదలుపెట్టి వానాకాలం, యాసంగిలో సాగుభూములకు ఎకరాకు రూ.4వేల చొప్పున పెట్టుబడి సహాయం ప్రభుత్వం అందిస్తుందని ముఖ్యమంత్రి కొన్ని నెలల క్రితమే ప్రకటించారు. ఆ పని పక్కాగా జరిగే నిమిత్తం ముందుగా భూమి రికార్డుల ప్రక్షాళనకు చర్యలు తీసుకున్నారు. కొత్త పాస్‌పుస్తకాలు సెక్యూరిటీ ఫీచర్స్‌తో ముద్రిస్తున్నారు. రాష్ట్రంలో 1కోటి 42లక్షల రైత్వారీ సాగుభూమితోపాటు 20లక్షల ఎకరాల అసైన్డ్ భూమికి పెట్టుబడి సాయం అందించనున్నారు. ఇందుకుగాను రూ.12వేలకోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

అంతవరకు బాగానే ఉంది. అయితే గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఈ సమితుల్లో మొత్తం 1,61,000మంది టిఆర్‌ఎస్ సభ్యులనే నియమించటం ఆక్షేపణీయం, అప్రజాస్వామికం. గ్రామాలన్నీ ఆ పార్టీ కంచుకోటలు కావు. కనీసం ఆ స్థాయిలోనైనా గ్రామంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాలకు ప్రాతినిధ్యం కల్పించి ఉంటే నిష్పక్షపాతంగా ఉండేది. కష్టపడి సైనికుల్లా పనిచేస్తే మున్ముందు ఉపకారవేతనం కూడా చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనివల్ల రైతు సమన్వయ సమితులను టిఆర్‌ఎస్ కార్యకర్తల ఉపాధి కేంద్రాలుగా మార్చారనే నింద మోయక తప్పదు. ఒకప్పుడు పసుపు చొక్కాలవారు రేషన్ బియ్యం భోంచేసి భ్రష్టుపట్టారు. తర్వాత రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఆదర్శరైతులంటూ కాంగ్రెస్ కార్యకర్తలతో నింపి అభాసుపాలైంది. టిఆర్‌ఎస్ కూడా రాజకీయ పక్షపాతంతో అదే బాటలో నడవటం శోచనీయం.

మేఘాలయలో మళ్లీ 'హస్తం'?

చూపు


కాంగ్రెస్ ముఖ్యమంత్రి సారథ్యంలో ఉన్న ఏకైక ఈశాన్య రాష్ట్రం మేఘాలయలో మంగళవారం జరగనున్న ఎన్నికలలో అదే ఏకైక పెద్ద పార్టీగా వచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంటున్నారు. 2013 ఎన్నికలలో 60మంది సభ్యుల అసెంబ్లీలో కాంగ్రెస్ 29 సీట్లు గెలిచింది. యునైటెడ్ డెమొక్రాటిక్ పార్టీ (యుడిపి) కి చెందిన 8 మంది శాసన సభ్యులను కలుపుకొని అది ముకుల్ సంగ్మా సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

అప్పటినుంచి ఇప్పటికి మేఘాలయలో రాజకీయాలు చాలా మారిపోయాయి. కాంగ్రెస్ కూటమిని దింపి తాను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఈసారి బిజెపికి తహతహగా ఉంది. కొన్ని ప్రాంతీయ పార్టీలను కలుపుకొని అధికారంలోకి రావాలని దాని ఆశ. అయితే ఈ ఎన్నికల్లో బిజెపి చెప్పుకోదగ్గ స్థాయిలో గెలుపు సాధించే అవకాశాలు లేవని పరిశీలకులు అంటున్నారు. రెండు విస్తృత జోన్లుగా రాష్ట్రం చీలిపోయి ఉంది. ఒక జోన్ ఖసియాలు, జైంతియాల ఆధిక్యంలో ఉండగా, రెండవది గారో తెగ పట్టులో ఉంది. బిజెపికి 10 సీట్లకు మించి రావని పరిశీలకులు అంటున్నారు. కాంగ్రెస్ 20 సీట్లలో మాత్రమే గెలుస్తుందని వారి అంచనా. ఏకైక పెద్ద పార్టీగా వచ్చే కాంగ్రెస్‌కు హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ అనే మరో పార్టీతో పొత్తు ఉన్నా ఆ కూటమికి మొదటి జోన్‌లోనే పలుకుబడి ఉంది. 3న ఫలితాల వెల్లడైన తరువాత నిజమైన రాజకీయ ఆట మొదలవుతుంది. కొత్తగా ఏర్పడే సభలో బలాబలాలబట్టి ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారో తెలుస్తుంది. రెండు రకాల అవకాశాలున్నాయి. ఒకటి కాంగ్రెస్ సారథ్యంలోని కూటమి కాగా, రెండవది బిజెపి సారథ్యంలోని బలహీన కూటమి. చివరకు కాంగ్రెస్–యుడిపి కూటమికే అధికారం మళ్లీ దక్కే అవకాశాలు ఎక్కువ.

సంగ్మా పార్టీకి గారోలలో ప్రాచుర్యం

నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) మేఘాలయకే పరిమితమైన పార్టీ. పూర్వపు లోక్‌సభ స్పీకర్ పుర్నో సంగ్మా స్థాపించిన పార్టీ అది. గారో ప్రాంతంలో ఆ పార్టీకి పట్టు ఉంది. ఆయన కుమారుడు, లోక్ సభ సభ్యుడు కొనార్డ్ ఆ పార్టీ నేత. పుర్నో సంగ్మా మరో కుమారుడు, ఆయన కుమార్తె – యుపిఎ ప్రభుత్వంలో సహాయమంత్రిగా చేసిన అగథా కూడా అసెంబ్లీ బరిలో నిలిచారు. గత ఎన్నికలలో ఎన్‌పిపి కేవలం రెండు సీట్లే గెలిచింది. కాని అప్పటినుంచి ఈ పదేళ్లలో ఆ పార్టీ ఎంతో ఎదిగింది. ప్రస్తుతం బిజెపితో ఆ పార్టీ మణిపూర్, రాజస్థాన్‌లో పొత్తు కుదుర్చుకొంది. బిజెపి సిద్ధాంతాలపట్ల ఎన్‌పిపికి మక్కువ లేదు కాబట్టి తన డిమాండ్ల విషయం ఇంకా తేల్చడం లేదు. ఈ ఎన్నికల రోజుల్లో బిజెపికి మోహం చెల్లని పరిస్థితి ఎదురైంది.

బెంగాల్‌కు చెందిన మనాస్ చౌధురి కాంగ్రెస్‌ను వీడి గత ఏడాది బిజెపిలో చేరారు. ఆయన బెంగాల్ మాజీ మంత్రి, ఓ పత్రిక మాజీ ఎడిటర్ కూడా. అయితే ఆయనకు బిజెపి టికెట్ ఇవ్వకపోవడంతో తిరిగి కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఆయన షిల్లాంగ్‌కు చెందిన రాజవంశీకుడు. వెంటనే కాంగ్రెస్ ఆయనకు టికెట్ ఇచ్చింది. మేఘాలయలో గెలుపుకు బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ ఎంతో ప్రాధాన్యమిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో ఈ సరికే ప్రధాని మోడీ, బిజెపి అధ్యక్షులు అమిత్ షా భారీ ఎత్తున ప్రచారం చేశారు. ఆఖరి రోజున కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ప్రచారం చేశారు. ఆయన పర్యటనతో కాంగ్రెస్‌కు అనుకూలంగా గాలి తిరిగిందని చెప్పలేము గాని రాష్ట్రంలో క్రింది స్థాయి నుంచి కాంగ్రెస్ కార్యకర్తలలో ఉత్సాహం రేకెత్తించారు.



సుమారు 20 సీట్లను కాంగ్రెస్ గెలిస్తే ప్రభుత్వం ఏర్పాటులో దానికే అవకాశం మెండు. బిజెపి భయపడుతున్నది కూడా అదే. ఆ రాష్ట్రంలో తన పరిమితులు తనకు తెలుసు. కాని కాంగ్రెస్ సారథ్యంలో మళ్లీ ప్రభుత్వం ఏర్పడకూడదని బలంగా కోరుకొంటూ అందుకు శాయశక్తులా బిజెపి ప్రయత్నిస్తోంది. గిరిజనుల అధిక్యతలో ఉండే మేఘాలయలో క్రైస్తవులు అధికంగా ఉండడం బిజెపికి కలిసిరాని మరో అంశం. ఆ పార్టీ కరుడుకట్టిన హిందుత్వ సిద్ధాంతం అక్కడ చెల్లదు. పైగా ఆ రాష్ట్రంలో గొడ్డు మాంసం తినేవారు కూడా అధికం. గోమాంస భక్షణను వ్యతిరేకించే బిజెపి వాదన అక్కడ ప్రజలకు అసలు మింగుడుపడదు.

బిజెపి కాళ్లకు బంధం గొడ్డు మాంసం వివాదం


తమ పార్టీ అధికారంలోకి వస్తే గొడ్డు మాంసం ధర తగ్గిస్తుందని అందుకే బిజెపి స్థానిక నాయకుడు బెర్నార్డ్ మారక్ గత ఏడాది హామీనిచ్చారు. ఆ అంశానికి అక్కడితో తెర పడలేదు. బెర్నార్డ్ మారక్, మరి ఇద్దరు పార్టీ నేతలు బాచూ మారక్, విల్వర్ గ్రహం బిజెపి నుంచి వైదొలగారు. వారి రాజీనామాలకు గొడ్డు మాంసం వివాదమే కారణం. ఆ తరువాత వారు గారో ప్రాంతంలో గొడ్డు మాంసం ఉత్సవాన్ని నిర్వహించారు.'ఆహారంపై ప్రపంచంలో ఎక్కడా ఆంక్షలు విధించడం చెల్లదని ప్రపంచానికి చాటడానికే అలా గొడ్డు మాంస ఉత్సవం జరిపాము' అని పశ్చిమ గారో హిల్స్ జిల్లా బిజెపి అధ్యక్షునిగా కూడా పనిచేసిన బెర్నార్డ్ ప్రకటించారు. జీవన విధానంలో భాగమైన ఆహార అలవాట్ల జోలికి ప్రభుత్వాలు వెళ్లడం తప్పని ఆయన బిజెపి గొడ్డుమాంసం వ్యతిరేక ప్రచారాన్ని గట్టిగా నిరసిస్తూ ప్రకటన చేశారు.

ఈశాన్య రాష్ట్రాలు అంతటా గొడ్డుమాంసం తినడం గిరిజన సంస్కృతిలో భాగంగా ఉంది. వారిలో గిరిజన ఆచారాలకే ప్రాముఖ్యం తప్ప హిందూత్వ ప్రచారాలకు తావు లేదు. గొడ్డు మాంసం తినే అలవాటును వారి చేత మానిపించడానికి ఎటువంటి బలవంతాలకు పాల్పడినా పరిస్థితి ఎదురు తిరగడం ఖాయం. అతిగా వ్యవహరిస్తున్న గోరక్షకుల వల్ల గిరిజనులు బిజెపికి దూరం కాక తప్పదు. ఈశాన్య రాష్ట్రాలలో హిందూ మతానికీ, హిందూ దేవుళ్లకు అంతగా ప్రాచుర్యం లేదు. వారు కొలిచే గిరిజన దేవతలు వేరు. నిజంగా అక్కడ బిజెపి ప్రచారాలు జనంలోకి వెళ్లవు. అందుకే స్థానికంగా పొత్తులు కుదుర్చుకొని నెగ్గుకురావాలని బిజెపి చూస్తుంది.

క్రైస్తవ, తదితర మైనారిటీ గ్రూపుల వ్యతిరేక భావజాలం బిజెపికి ఈశాన్య రాష్ట్రాలలో ముందరకాళ్లకు బంధం అయ్యే అంశం. మేఘాలయలో ఏ పార్టీకీ సంపూర్ణ మెజారిటీ రాకపోవడం ఎన్నికల ఆనవాయితీగా వస్తోంది. గతసారి బిజెపి ఇండిపెండెంట్ల మద్దతుపై ఆధారపడింది. ఈ సారి కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి, అధికారం తిరిగి అందుకొనే అవకాశానికి దగ్గరగా ఉంది. సంకీర్ణ ప్రభుత్వాలకు పేరుబడిన మేఘాలయలో ఈ సారి తమకు పూర్తి మెజారిటీ వస్తుందని, సంకీర్ణ ఆనవాయితీ నుంచి రాష్ట్రాన్ని తప్పిస్తామని బిజెపి ఆశతో ఉంది.

*** వరుణ్ దాస్ గుప్తా**

బొగ్గుగనుల ప్రైవేటు సబబేనా?



ఉజ్జిని రత్నాకర్‌రావు
ప్రధానకార్యదర్శి,
ఎఐటియుసి రాష్ట్ర సమితి

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బొగ్గు గనులను ప్రైవేటుపరం చేయాలని కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా పేరుతో సరళీకరణ, ప్రైవేటీకరణ సంస్కరణలను వేగవంతం చేస్తున్నది. ఇందులో భాగంగానే ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకే కేంద్రం కంకణం కట్టుకొన్నదని, ఇటీవల కాలంలో కేంద్రం తీసుకుంటున్న చర్యలు రుజువు చేస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థలలోని వాటాలను అమ్మివేయటం, ప్రైవేటీకరించటం, విమాన, రైల్వే, రక్షణ రంగాలలో 100శాతం ఎఫ్.డి.ఏలు ఆమోదించటం జరిగింది. ఇలా మూకుమ్మడి ప్రైవేటీకరణలతో దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నది.

స్వాతంత్య్రం పొందిన తరువాత విదేశీ, స్వదేశీ ప్రైవేటు పెట్టుబడిదారుల చేతులలో ఉన్న ప్రకృతి సంపద అయిన నల్ల బంగారాన్ని జాతీయకరణ చేయాలని దేశవ్యాపితంగా ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు నిర్వహించిన ఆందోళనల నేపథ్యంలో 1973లో ఆనాటి ప్రభుత్వం బొగ్గు గనులను జాతీయకరణ చేయటం జరిగింది. గత 45 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వేల కోట్ల ఆదాయాన్ని బొగ్గు గనుల ద్వారా కేంద్రప్రభుత్వం పొందుతున్నది. అండర్ గ్రౌండ్ మైనింగ్‌లో భూమిలోనికి లోతుకువెళ్ళే కొద్దీ ఖర్చు బాగా పెరుగుతుంది. కాని ఓపెన్ మైనింగులు లాభాలతో నడుస్తున్నాయి. మొత్తంగా గత 20ఏళ్ళుగా కోల్ ఇండియా లాభాల్లో ఉన్నది. డివిడెండ్ల రూపంలో 20 నుండి 30 శాతం వరకు పన్నులు రాయల్టీల పేరిట ఏటా రూ.12 వేల కోట్ల నుండి రూ.15 వేలకోట్ల వరకు కేంద్రం తీసుకుంటున్నది. క్లీన్ ఎనర్జీ సెస్ కింద టన్ను బొగ్గుకు రూ.400చొప్పున తీసుకోవటం జరుగుతుంది.

1991లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల నేపథ్యంలో మొదటి దశకం తరువాత రెండవ దశకం 2001 నుండి ఆనాటి ఎన్‌డిఏ, ఆ తరువాత వచ్చిన యుపిఏ ప్రభుత్వం, నేడు అధికారంలో ఉన్న మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియాతో సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలను మరింత వేగంగా ముందుకు తీసుకు వెళ్ళుతున్నాయి. 2015–16లో ప్రభుత్వరంగ సంస్థల వాటాలను అమ్మటం ద్వారా 48వేల కోట్లు, 2016–17లో 68.5 వేల కోట్లు, ఈ సంవత్సరం బడ్జెట్‌లో 80 వేల కోట్లను సమకూర్చుకోవాలని నిర్ణయించటం జరిగింది.

లాభాలతో నడుస్తున్న వెస్టన్ కోల్ లిమిటెడ్ (డబ్ల్యూసిఎల్), నార్త్‌కోల్ లిమిటెడ్ (ఎన్‌సిఎల్), ఈస్టన్ కోల్ లిమిటెడ్ లలో 20 శాతం పెట్టుబడులను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉపసంహరించుకున్నది. గత 20సంవత్సరాలుగా బొగ్గు సంస్థలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నయాపైసా కూడా కేటాయింపులు చేయలేదు. ఈ సంవత్సరం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా కోల్ ఇండియాకు మొండిచేయి చూపించారు. కార్మికుల కృషితో గత మూడు దశాబ్దాలుగా కోల్ ఇండియాకు వస్తున్న లాభాలలో పన్నులు, రాయల్టీల రూపేణా ప్రభుత్వాలకు చెల్లిస్తూ కొత్తగా ప్రాజెక్టులను నిర్మించుకోవటం జరుగుతుంది. ఒకప్పుడు 6 లక్షలకు పైగా ఉన్న కార్మికుల సంఖ్యను 3 లక్షలకు తగ్గింది. ప్రతి సంవత్సరం వేలసంఖ్యలో రిటైర్డ్ అవుతున్నారు, కొత్త నియామకాలు లేవు. 3.5లక్షల బొగ్గుగనుల కార్మికుల వేతనాల నుండి ప్రతి సంవత్సరం 3 వేల 500 కోట్లకు పైగా ఆదాయం రూపేణా కేంద్రానికి చెల్లిస్తున్నారు. కనీసం ఇన్‌కం టాక్స్ అయినా తగ్గించాలని కార్మిక సంఘాలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటంలేదు. బొగ్గు ద్వారానే దేశవ్యాపితంగా 70శాతం థర్మల్ పవర్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి.

2020 నాటికి దేశం మొత్తంలో కనీసం 600 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడానికి విదేశాల నుంచి దిగుమతి అవుతున్న 200 మిలియన్ టన్నుల వరకు బొగ్గు దిగుమతిని నియంత్రించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కార్మికుల సంఖ్య తగ్గుతున్నా, లక్ష్యాలు 20 సంవత్సరాల కాలంలో రెండింతలు అయ్యాయి, యాంత్రీకరణ పెరిగింది, ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో మరింతగా పెట్టుబడిదారులకు దోచిపెట్టడం కోసం కేంద్రం బొగ్గు విక్రయాలలోకి కార్పోరేట్లను ప్రవేశ పెడుతున్నది.

1993నుంచి ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన 214 బొగ్గుగనులను బిజెపి ప్రభుత్వం 2014లో రద్దుచేసింది. కేటాయింపులలో పారదర్శకత జవాబుదారీతనం కొరవడటాన్ని నివారించడానికి కోల్ మైన్స్ స్పెషల్ ప్రొవిజెన్స్ బిల్లు 2015కు పార్లమెంటు ఆమోదం తెల్పింది. 2015లో ఇది చట్టంగా మారింది. బొగ్గు విక్రయానికి అనుమతిస్తూ, గనులను వేలం ద్వారా కట్టబెట్టేటందుకు ఈ చట్టం అనుమతిస్తుంది. దీని ఆధారంగా దేశంలోని 9రాష్ట్రాలలో కోల్ ఇండియా లిమిటెడ్ ఆధీనంలోని మొత్తం గనుల ప్రైవేటీకరణకు తెరలేపింది. అయితే ఇప్పుడు మెగా గనులతోపాటు చిన్న, మధ్యతరహా బొగ్గుగనులను సైతం ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేయమన్నారు.

కేంద్ర క్యాబినెట్ కోల్ ఇండియాను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించటంతో గత 40సంవత్సరాలుగా ఉన్న కోల్ ఇండియా గుత్తాధిపత్యానికి తెరపడుతుంది. అటుపైన బొగ్గు ఉత్పత్తి పూర్తిగా ప్రైవేటురంగం చేతిలోకి వెళ్లి వాణిజ్య పరంగా త్రవ్వకాలకు రంగం సిద్ధమౌతుంది. కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ప్రైవేటీకరణ ప్రతిపాదనను కేంద్ర రైల్వే బొగ్గుశాఖా మంత్రి పీయూష్ గోయల్ బొగ్గు రంగంలో అత్యంత ప్రతిష్టాత్మక సంస్కరణగా అభివర్ణించారు. ప్రస్తుతం ప్రయివేటు సంస్థల స్వంత అవసరాల కోసం బొగ్గు త్రవ్వకానికి అనుమతులిస్తున్నట్లు ప్రకటించినందున ప్రైవేటీకరణ సంస్కరణల ద్వారా సిఐఎల్ గుత్తాధిపత్యశకం ముగిసి పోటీతత్వానికి బీజం ఏర్పడుతుందని మంత్రి చెప్పాడంటే కేంద్రప్రభుత్వం బహుళజాతి కార్పొరేటు పెట్టుబడిదారులకు దాసోహం అంటూ, వారి దయా దాక్షిణ్యాలకు వారు చెప్పిన విధంగా బొగ్గు రేటు నిర్ణయానికి తలవంచాల్సిన పరిస్థితి రాబోతుందని తెలుసుకోవాలి.

1928 నాటి నుండి హైదరాబాద్ సంస్థానంలో ఉన్న సింగరేణి నిజాం ఆధీనంలో ఉండేది. సంస్థాన విలీనంతో సింగరేణి పూర్తిగా ప్రభుత్వ సంస్థగా కొనసాగుతున్నది. 51 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా, 49శాతం కేంద్రప్రభుత్వ వాటాతో నడుస్తున్నది. 1994వరకు ఒక లక్షా 16వేల కార్మికులతో లాభాలతో నడుస్తున్న సంస్థ, రానురాను నష్టాల ఊబిలో కూరుకొనిపోయింది. ఆ మధ్య కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఆర్‌ఎస్, విఆర్‌ఎస్ క్రింద అనారోగ్యంతో రిటైర్‌మెంటు ద్వారా కార్మికులు వెళ్ళిపోగా ప్రస్తుతం సింగరేణిలో 52వేల మంది పర్మినెంటు కార్మికులు పనిచేస్తున్నారు. సింగరేణిలో 34 అండర్‌గ్రౌండ్ మైన్స్, 16 ఓపెన్‌కాస్ట్ మైన్స్‌లలో పూర్తిగా త్రవ్వకాలు జరుగుతున్నాయి. ఓపెన్‌కాస్ట్ మైన్స్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో 25 వేల వరకు కార్మికులు అతి తక్కువ వేతనాలతో 10 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు. గత 18 సంవత్సరాలుగా లాభాలతోను నడుస్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 15 శాతం చొప్పున పన్నులు, రాయల్టీల రూపంలో చెల్లిస్తున్నారు. ఈ సంవత్సరంలో కూడా 71/2 శాతం చొప్పున కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి లాభాలలో వాటాలు చెల్లించారు. క్లీన్ ఎనర్జీ సెస్ కింద టన్ను బొగ్గుకు రూ.400 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లిస్తున్నారు. అదనం గా కొత్త ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నాడు. మంచిర్యాల జిల్లాలోని జైపూర్ వద్ద నిర్మించిన 1200మె.గా వాట్స్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి రూ.8వేల 700 కోట్లు వ్యయం లో 6 వేల కోట్లు అప్పులు తీసుకుని నిర్మించారు. రాష్ట్రప్రభుత్వం సింగరేణికి ఒక పైసా కూడా ఇవ్వకపోగా ప్రతి సంవత్సరం 2 వేల కోట్ల పన్నులు రాయితీల ద్వారా తీసుకుంటున్నది.

కేంద్రం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం : కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సింగరేణిలోని జాతీయ కార్మిక సంఘాలు నిరసిస్తున్నాయి. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు ఏరియాలో కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో ప్రైవేటీకరణకు బీజం పడింది. స్పస్‌మైనర్ యంత్రాలతో బొగ్గు త్రవ్వకాలకు ప్రైవేటువారికి అనుమతులు ఇచ్చారు. తాడిచర్ల బొగ్గుబావిని ప్రైవేటుకు అప్పజెప్పడానికి టెండర్లను పిలవడంతో పెద్దఎత్తున కార్మిక, ప్రజా సంఘాలు ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలతో రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. 4 ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌లలో జర్మనీ, ఆస్ట్రేలియా ప్రయివేటు కంపెనీలతో ఒప్పందం చేసుకొని ఉపరితలబొగ్గును తీయడానికి కాంట్రాక్టు ఇవ్వటం జరిగింది. కేంద్రం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా సింగరేణిని ఓపెన్‌కాస్ట్ కొత్తగనుల పేరుతో ప్రైవేటు కంపనీలకు ద్వారాలు తెరుస్తున్నది. దీనివలన సింగరేణి కంపెనీలు నిర్వీర్యం కానున్నాయి. కార్పొరేట్ కంపెనీలు తొలుత బొగ్గు ధరను తగ్గించి అమ్ముతాయి. తక్కువ జీతాలకు కార్మికులను, ఉద్యోగులను తీసుకొంటాయి. ప్రభుత్వరంగంలోని బొగ్గు బావులు ఈ పోటీని ఎదుర్కొలేక నష్టాలలోకి వెళ్ళతాయి. అనంతరం మళ్లీ కార్పొరేట్లు బొగ్గుధరలను పెంచేస్తాయి. కేంద్రం తాజా నిర్ణయం ఫలితంగా ఇదే జరగబోతుంది. ఈరోజు ప్రభుత్వ రంగంలో అద్భుతమైన లాభాలు సాధిస్తున్న బొగ్గు సంస్థలను నిర్వీర్యం చేసి ఆ తర్వాత ఉన్న ఇతర కంపెనీలను కూడా ప్రవేట్ పరంచేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయి.

ఆదివాసీల ఆత్మబంధువు జనార్ధనరావు



పూసె రామకృష్ణ దొర
9866073866

ఆదివాసీ ఉద్యమ స్ఫూర్తి ఒక వైపు, బోధన పరిశోధన మరో వైపు. ఈ రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్ళిన ఆదివాసీ ఆత్మబంధువు జనార్ధన్‌రావు. జీవితానికి సమాజానికి ఉన్న సంబంధాన్ని ఎప్పుడూ వేరుచేయలేదు. ఆ విధంగా ప్రకృతికీ, ఆదివాసుల జీవన విధానానికీ ఎప్పుడూ బాసటగానే నిలబడ్డారు. జనార్దన్ అంటే జననాడి, ప్రజల మనిషి, ఆదివాసుల గుండెచప్పుడు.

ఆదివాసీల ఆత్మబంధువుగా మలిదశ తెలంగాణ పోరాటానికి మార్గదర్శిగా నిలిచిన ప్రొఫెసర్ జనార్దన్‌రావు ఆదివాసీ అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేశారు. బియ్యాల జనార్దన్‌రావు తొలి అనుబంధం ఆదివాసులతో. మలి అనుబంధం తెలంగాణ స్వరాష్ట్రం కోసం మాత్రమే. వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామంలో కిషన్‌రావు, అంజమ్మలకు 1955 అక్టోబర్ 12న జనార్దన్‌రావు జన్మించారు. చిన్ననాటి నుంచి తనకు ఏజెన్సీ గూడేల ఆదివాసులతో ఏర్పడిన అనుబంధంతో వారి సాంప్రదాయ వారసత్వం, జీవన విధానంపై ఆకళింపు, ఆసక్తి కలిగింది. జనార్దన్ అంటే జననాడి, ప్రజల మనిషి, ఆదివాసుల గుండె చప్పుడు. శక్తిమంతమైన ఉపన్యాస పటిమగల వ్యక్తి. వరంగల్ జిల్లాలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించి విద్యావేత్తగా, పరిశోధకుడిగా విలక్షణమైన సామాజిక శాస్త్రవేత్తగా, సాహితీవేత్తగా, ఒక సామాజిక కార్యకర్తగా అన్నిటికన్నా ముఖ్యంగా ఆదివాసీ ఉద్యమ మేధావిగా, ఆదివాసీల ఆత్మబంధువుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయారు.

మరోపక్క ఏజెన్సీ భూములు, అటవీ వనరులు, ఆదివాసీల రాజ్యాంగ రక్షణలు, ఆదివాసీల హక్కుల విధ్వంసం జరుగుతుంటే ఆవేదనతో ఆదివాసీల భూ సమస్యలు, స్వయంపాలన ఉద్యమాలపై పరిశోధనలు చేసి వారి సంక్షేమం కోసం, హక్కుల కోసం విశేషంగా కృషి చేశారు. తెలంగాణ సాహిత్యం విషయంలో తనదైన శైలిలో ఉద్యమ నిర్మాణాన్ని సామాజిక అంతరంగాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తూ ఆదివాసుల అస్తిత్వాన్ని కూలంకషంగా వివరించే ప్రయత్నం చేశారు. 1983లో కాకతీయ యూనివర్సిటీలో చదువు పూర్తి చేసి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పార్ట్ టైం అధ్యాపకుడిగా చేరారు. ఆ కాలంలోనే ఆదివాసులకు జరుగుతున్న అన్యాయాన్ని తన కలం ద్వారా ఎత్తిపట్టారు. ఆదివాసుల భూములు పరాయీకరణ అనే అంశంపై 1985లో పిహెచ్‌డి పట్టా పొందిన తొలి ఆదివాసేతర వ్యక్తి (గిరిజనేతరుడు) డాక్టర్ బియ్యాల జనార్దన్‌రావు. 1970–80 కాలంలో ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్ చుట్టుపక్కల ఉన్న ఇతర మండలాల్లో కొనసాగించిన పరిశోధన విధానానికి అదనంగా చారిత్రక కోణంలో అధ్యయనం ద్వారా ఆదివాసీల జీవన విధానం ధ్వంసమవుతున్న తీరును ముందే వివరణాత్మకంగా ఆదివాసీ సమాజానికి అందించారు. ఆ కాలంలోనే కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగపు ప్రధానాచార్యులుగా పనిచేశారు.

ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావుకు ఆదివాసీ సమాజంపై, బూర్జువా సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై స్పష్టమైన అవగాహన ఉంది. అంతేకాక భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక కూడా ఉండేది. 1993–2000 సంవత్సరాల కాలంలో ఆదివాసీ ఉద్యమాలు, 1/70 చట్టం, పెసా చట్టం, గ్రామీణ సమస్యలపై దృష్టి సారించారు. అమెరికా, జర్మనీ, స్వీడన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో జరిగిన 11 అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని 62 పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆదివాసుల స్వయం పాలనపై అనేక వ్యాసాలు రాశారు. మానవ హక్కుల కార్యకర్తగా, ఆదివాసుల హక్కుల పరిరక్షణకు జరిగిన అనేక ఉద్యమాల్లో భాగస్వామి అయ్యారు. ఆదివాసీ సంఘాలకూ, ఆదివాసీలకూ ఆరాధ్యుడిగా మిగిలిపోయారు. 1993–95మధ్య ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ న్యూఢిల్లీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా ఎంపికయ్యారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తొలి సిద్ధాంతకర్తగా కీలక భూమిక పోషించారు. తెలంగాణపై వివక్ష, అణచివేత గురించి అనేక రచనలు చేశారు. అదే కాలంలో ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి అమెరికాలో జరిగిన 'తానా' సభలో పాల్గొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి అసమానతలు, ప్రాంతీయ అసమానతలపై ప్రసంగించి మలిదశ తెలంగాణ పోరుకు అంతర్జాతీయ మద్దతును కూడగట్టారు.

కాళోజీ, జయశంకర్‌లతో సమ ఉజ్జీగా నిలిచి వారితో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. 2001లోనే తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్) పార్టీ ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించారు. జీవితానికీ, సమాజానికి ఉన్న సంబంధాన్ని ఎప్పుడూ వేరు చేయలేదు. ఆ విధంగా ప్రకృతికీ, ఆదివాసుల జీవన విధానానికీ ఎప్పుడూ బాసటగానే నిలబడ్డారు. పోలవరం ప్రాజెక్టు దాని పర్యవసానాలు ఆదివాసుల సంస్కృతి జీవన విధ్వంసం, ఎన్నో ఉద్యమ అకడమిక్ వేదికల మీద లోతైన అవగాహనతో, మూల కారణాలు, ప్రాథమిక అంశాలపై చర్చించి నిర్దిష్ట ప్రామాణిక వ్యాఖ్యానాలు నిర్మించి, వాటి ఆధారంగా ఆదివాసుల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు కృషి చేశారు. ఆంధ్రప్రాంతాన్ని అన్న పూర్ణగా చేసి తెలంగాణను కరువు భూమిగా మార్చిన కపట రాజకీయాలనూ లెక్కలతో సహా కక్కించడానికి జయశంకర్ సార్‌తో ఎన్నో రాత్రులు, పగలు శ్రమించి సమాచారాన్ని క్రోడీకరించారు. ఉసిళ్ళ పుట్టలై ఊరిన మన పనిపాటల్ని కమ్మేస్తున్న టివి చానళ్ళను ఊడబెరికి మన జానపదాల్ని కాపాడుకుందాం అంటూ పిలుపునిచ్చిన అసలు సిసలు తెలంగాణ ఆదివాసీ మట్టి బిడ్డ జనార్దన్‌రావు. తన ఊపిరి ఉన్నంత వరకూ ఆదివాసులపై జరుగుతున్న దోపిడీని కలం ద్వారా, గళం ద్వారా ఎండగట్టారు. అనారోగ్య కారణాలతో 2002 ఫిబ్రవరి 27న ప్రకృతి ఒడిలోకి జారిపోయారు. నేటి ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ మేధావులు జనార్దన్‌రావు సార్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసుల సమస్యలనూ, పోరాటాలనూ తాత్వికంగా, శాస్త్రీయంగా విశ్లేషించి ఆదివాసీ ఆత్మగౌరవ పోరాటాలను ముందుకు తీసుకువెళ్ళాలి. ఆదివాసీల హక్కులు అమలు చేసినపుడే, స్వయం పాలన వచ్చిన నాడే జనార్దన్‌రావు సార్‌కు మనం నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుంది. ఆదివాసులు రాజ్యాధికారంలో భాగస్వాములు అయినపుడే ఆయన కలలు నెరవేరుతాయి.



మార్పు సహజం...తరాలతోబాటు యువతరం అంతరంగాలు కూడా విభిన్నంగా ఉండటం సాధారణం. ఒకప్పుడు కొన్ని టాపిక్స్ ఊసెత్తాలంటేనే భయపడే యువత ..ఇప్పుడు అలాంటి అడ్డుగోడల్ని అధిగమించింది. ఎలాంటి విషయమైనా సరే కుండబద్దలు కొట్టినట్లు కచ్చితమైన అభిప్రాయాల్ని తెలియజేయడంలో వెనుకాడటం లేదు. సిగ్గు, బిడియం లాంటి మాటల్ని పక్కన పడేశారు.. ఆధునికంగా ఉంటూనే సంప్రదాయాలకూ విలువనిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఉంటూ సమాజానికి ఉపయోగపడే మంచి పనులను కూడా చేస్తూ మిగతావారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కెరీర్ విషయంలో స్పష్టత కలిగి ..చెప్పిందే చేస్తాం...చేసేదే చెప్తామంటున్న యువత మనోభావాలను తెలుసుకుందాం...

మాకేం కావాలో తెల్సు...



ఏడెనిమిది ఏళ్ల క్రితం ఇటువంటి పరిస్థితిలేదు. రాజకీయం, సహజీవనం, హోమోసెక్స్‌లాంటి విషయాలను మాట్లాడటానికి యువత అంతగా ఇష్టపడేవారు కాదు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. టాపిక్ ఏదైనా సరే... స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారనే విషయాన్ని దేశవ్యాప్తంగా చేపట్టిన ఓ సర్వేలో తెలిసింది. నగరాల్లో పుట్టి పెరిగినా పెద్దల మాటకు విలువ ఇచ్చేవాళ్లున్నారు. పాశ్చాత్య పోకడలు పోయే పల్లెటూరు యువత లేకపోలేదు. సంప్రదాయం, ఆధునికతల గురించి పక్కన పెడితే పల్లె, పట్నం తేడాలేకుండా ఈ తరానికి వారికేం కావాలో, ఎలా కావాలో అనే విషయాలు స్పష్టంగా తెలుసునన్న విషయం సర్వేలో స్పష్టమైంది. సామాజిక మాధ్యమాలు, మీడియా, సమాజంపై అవగాహన పెరగడం, పుట్టిపెరిగిన వాతావరణం ఇలాంటివన్నీ ఈ మార్పునకు కారణాలు కావొచ్చు.

సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) అనే ఢిల్లీ సంస్థ, జర్మనీకి చెందిన కొన్నాడ్ అడెన్యూర్ స్టిఫ్టంగ్‌తో కలిసి 19 రాష్ట్రాల్లో యువత అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఓ అధ్యయనం చేపట్టింది. ఇందుకోసం పల్లెలు, పట్టణాలు, నగరాల్లోని 19 నుంచి 34 ఏళ్ల లోపు వయస్సున్న 6,122 మందిని 80 ప్రశ్నలడిగి సమాధానాలు సేకరించింది. 'యువత ఆలోచనలు.. ఆశయాలు.. ఆందోళనలు' అనే పేరుతో నివేదిక వివరాల్ని తెలిపింది. ఇందులో 38 శాతం యువత ఇండియాలో పూర్తిగా స్వేచ్ఛాయుత ఆధునిక సమాజం రావాలని కోరుతుండగా ..37 శాతం మంది భారతీయ సంప్రదాయానికే ఓటేశారు. మిగతావారు ఎటూ తేల్చుకోలేకపోయారు.

ఈ సర్వేలో మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిసాయి. యువత ప్రేమ, పెళ్లి, సరదాలే కాకుండా రిజర్వేషన్ల ఎత్తివేత గురించి, ఇతర మతాల మనోభావాల్ని దెబ్బతీసే సినిమాలపై నిషేధం, గోవధ, కులాంతర వివాహాలు.. ఇలాంటి వివాదాస్పదమైన అంశాలపై కూడా నిర్భయంగా కచ్చితమైన అభిప్రాయాలను వెల్లడించారు. సెక్స్, సహజీవనాలపై ఏమాత్రం సంకోచం లేకుండా సూటిగా వారి అభిప్రాయాలను చెప్పారు.

ఒకప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండే యువత ఇప్పుడు మాత్రం బాగానే ఒంటపట్టించుకుంటున్నారు. పట్టణ, నగర ప్రాంతాలలో రాజకీయాలపై అవగాహన ఏర్పరుచుకుంటున్నారు. రాజకీయ వ్యవస్థ అవినీతిమయమైందని చెబుతూనే మార్పు వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. ఈ సర్వేలో 51 శాతం మంది తాము దేశరాష్ట్ర రాజకీయాల్ని బాగా గమనిస్తున్నట్లు చెప్పారు. గతం కన్నా 16 శాతం ఎక్కువ మంది శృంగారం, హోమో సెక్సువాలిటీ, మత్తుపదార్థాలవాడకంపై నిస్సంకోచంగా మాట కలిపారు. తమకూ భక్తి ఉందని గుళ్లూ గోపురాలకు వెళ్లేటప్పుడు సంప్రదాయ దుస్తులతో వెళ్తామంటే... మరికొందరేమో సంప్రదాయం,స్వేచ్ఛలో కొంత పట్టువిడుపులున్నాయన్నారు. గతంలో పోల్చితే మాత్రం చాలా విషయాల్లో యువతకు మరింత క్లారిటీ వచ్చినట్లు తెలుస్తోంది.

యువత వెల్లడించిన మరికొన్ని అభిప్రాయాలు

❖పెళ్లయ్యాక అమ్మాయి వంటింటికే పరిమితమవ్వాలా అన్న ప్రశ్నకు 41 శాతం ఔననగా, 49 శాతం మంది కాదన్నారు. మిగతా 10శాతం మంది ఏమీ చెప్పలేమన్నారు.

❖అమ్మాయిలకు ఉన్నత విద్య అవసరమా అంటే 37 శాతం అవునంటే, 57 శాతం అవసరం లేదన్నారు. 11శాతం మంది మౌనాన్ని ఆశ్రయించారు.

❖అమ్మాయిలు జీన్స్‌లాంటి ఆధునిక వస్త్రాలు ధరించొచ్చా అంటే..38శాతం తప్పేముంది అంటే.. 51 శాతం మంది ఫర్వాలేదన్నారు. మిగతా 11శాతం ఏమీ చెప్పలేదు.

❖65శాతం మంది అమ్మానాన్నలతో కల్సి ఉండటం ఇష్టమంటే, 31 శాతం మంది జీవిత భాగస్వామి అని, 4శాతం మంది స్నేహితులు, హాస్టళ్లలో అని అభిప్రాయాన్ని తెలిపారు.

❖కాస్మటిక్స్ వాడే విషయంలో కూడా భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చారు. 39శాతం వాడతామంటే, 21శాతం అప్పుడప్పుడని, 38 శాతం వాడమని కచ్చితంగా చెప్పేశారు.

❖యువత అభిప్రాయంలో సరదాలంటే 33 శాతానికి సినిమాలని, 30 శాతం మందికి హోటల్ రెస్టారెంట్‌లకు వెళ్లడమని, 28 షాపింగ్ చేయడమని అర్థమైంది.

❖సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నవారిలో...వాట్సాప్ 30శాతం, ఫేస్‌బుక్ 25, యూట్యూబ్ 11, ట్విట్టర్ 7 శాతంమంది ఉన్నారు.

❖క్రమం తప్పకుండా పూజ, నమాజ్, ప్రార్థనలు చేసేవారు 38శాతం మంది ఉండగా, పండుగలప్పుడు 54 శాతం పూజలు చేస్తామని, 8 శాతం మందికి అయితే అసలు అలాంటి అలవాటే లేదన్నారు.



> భారత జనాభాలో ముప్పావు శాతం యువత ఉన్నట్లు ఓ అంచనా. ఆధునికంగా ఉంటూనే సంప్రదాయానికి కూడా విలువిస్తున్నట్లు సర్వేలో తెలిసింది.

❖ఉపవాసాలు, పుణ్యక్షేత్రాల సందర్శన విషయాల్లోనూ భిన్నాభిప్రాయాలున్నాయి. 17 శాతం మంది క్రమం తప్పకుండా, 44 శాతం మంది అప్పుడప్పుడూ, 18ప్రత్యేక సందర్భాల్లో అంటూ సమాధానాలు చెప్పారు.

❖ ప్రేమ పెళ్లి విషయంలో 6 శాతం మంది అనుకూలంగా ఉన్నారు. 4 శాతం మంది ప్రేమించి పెద్దల ఆమోదంతో పెళ్లంటే, 84 శాతం మంది పెద్దలు కుదిర్చిన పెళ్లికే తమ ఓటు వేశారు.

❖కులమతాంతర వివాహాలు తప్పా అని అంటే 56 శాతం మంది తప్పులేదన్నారు. 36 శాతం మంది ఆమోదించలేదు. 8 శాతం మంది మేమేం చెప్పలేమన్నారు.

❖సహజీవనం గురించి 25 శాతం మంది తప్పుకాదంటే, 67 శాతం మంది అది మన సంప్రదాయం కాదన్నారు. 8 శాతం మంది అది వారి వ్యక్తిగతమన్నారు.

❖హోమోసెక్సువాలిటీని 61శాతం మంది అంగీకరించలేదు, 11 తప్పులేదన్నారు. 28 ఎటూ చెప్పలేం అన్నారు.

❖ భార్యలు భర్తల మాట వినాలా అంటే 27 శాతం మంది వినాలని, 24 మంది అప్పుడప్పుడూ, 17 అస్తమాటూ వినక్కర్లేదని, 23 అసలు వినాల్సిన అవసరం లేదంటే, మిగతా 9 శాతం మంది మౌనం వహించారు.

భారత జనాభాలో ముప్పావు శాతం యువత ఉన్నట్లు ఓ అంచనా. వీరిలో చాలా మంది ఆధునికతతో పాటు సంప్రదాయాన్ని కూడా పాటిస్తున్నరని సిఎస్‌డిఎస్ డైరెక్టర్ సంజయ్‌కుమార్ చెబుతున్నారు. ఎక్కువశాతం యువతీ యువకులు ప్రతి రోజు ఫేస్‌బుక్‌ను చెక్ చేస్తుంటారు. కానీ ఫ్రెండ్స్ లిస్ట్ విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండరని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

అలసిన పాదాలకు...



ఎక్కువ సేపు నించున్నా, సరిగ్గా తినకపోయినా, డైట్ పాటిస్తూ తక్కువ తింటున్నా, ఎక్కువ దూరం నడిచినా.. రాత్రవ్వగానే కాళ్లు లాగటం మొదలవుతుంది. ఇలాంటప్పుడు నిద్ర రావడం కూడా కష్టమే. ఈ సమస్యలను తొలగించేందుకు మార్కెట్ లోకి ఓ కొత్త పరికరం వచ్చింది. అదే ఎయిర్ కంప్రెషన్ లెగ్ మసాజర్. మరొకరి సాయం లేకుండా పాదాలకు మసాజ్ చేసుకునేందుకు తయారైందీ గాడ్జెట్. రిమోట్ సాయంతో ఎంతసేపు కావాలో ఎంత మోతాదులో కావాలో సెట్ చేసుకోవచ్చు. ఇంట్లోనే మనంతట మనమే మసాజ్ చేసుకోవచ్చు.



స్మార్ట్ సైకిల్ హెల్మెట్

ప్రపంచంలోనే తొలి స్మార్ట్ హెల్మెట్ "లుమస్ స్మార్ట్ బైక్ హెల్మెట్". సైక్లింగ్ చేసే వారి కోసం ఇది చాలా ముఖ్యం. ఈ స్మార్ట్ హెల్మెంట్‌ని48 లెడ్ లైట్లతో తయారుచేసారు. ముందు భాగంలో 10 వెలిగితే, వెనక 38 వెలుగుతాయి... రాత్రి సమయంలో రైడింగ్ చేస్తున్నప్పుడు వాహనదారులు సులువుగా గుర్తిస్తారు. పగటిపూట కూడా లైట్లు వెలుగుతుంటాయి. కారు బ్రేకు వేస్తే ఎరుపు రంగు లైట్లు వెనక ఎలా వెగులుతాయో... సైకిల్ వేగం తగ్గి ఆగితే హెల్మెట్ వెనక ఎరుపు రంగులో 'వార్నింగ్' లెడ్ లైట్లు వెలుగుతాయి. సిగ్నల్ లైట్స్‌ని ఆపరేట్ చేసేందుకు అనువుగా రిమోట్‌ని సైకిల్ హ్యాండిల్‌కి అమర్చుకోవచ్చు. యూఎస్‌బీ పోర్ట్‌తో రెండు గంటల్లో ఛార్జ్ చేయవచ్చు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 6 గంటలు పని చేస్తుంది. దీనికి ప్రత్యేక ఆప్‌తో మొబైల్ నుంచే హెల్మెట్ సెట్టింగ్స్ ఉంటాయి.

నెయిల్ పాలిష్‌తో హంగులు!



నెయిల్ పాలిష్... గోళ్ల అందానికి మాత్రమే కాకుండా అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. పాత వస్తువులను కొత్త వస్తువులుగా మార్చడానికి, ఇంటికి సరికొత్త అందాలను తేవడానికి కూడా సాయం చేస్తుంది. కార్‌పై గీతలు పడడంల్లాంటివి సాధారణంగా జరుగుతుంటాయి. ఆ గీతల వల్ల కారు అందవికారంగా కనిపిస్తుంది. కారు కలర్ నెయిల్ పాలిష్ కొని గీతల మీద వేసేయండి. ఇప్పుడు ఎన్నో రంగుల్లో గోళ్ల రంగులు దొరుకుతున్నాయి కాబట్టి గీతల్ని చక్కగా కవర్ చేసే నెయిల్ పాలిష్‌ను కొనండి. ఇంట్లో తాళం చెవులు ఎక్కువగా ఉంటే... ఏ తాళం చెవి దేనిదో తెలియక తికమక పడతాం. అలాంటప్పుడు... ఒక్కో తాళం చెవి చివరకు ఒక్కో రంగు నెయిల్ పాలిష్ వేస్తే సరి. సూదిలో దారం ఎక్కించడానికి కష్టపడుతుంటాం. దారం చివర నెయిల్ పాలిష్ పూసి కాసేపు ఎండాక... దారాన్ని ఎక్కిస్తే సులువుగా ఎక్కుతుంది. ఉంగరాలు ఎక్కువకాలం పెట్టుకుంటే... ఒక్కోసారి ఉంగరం కింద చర్మం ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అలా కాకుండా ఉండాలంటే ఉంగరం కింద వైపుకు నెయిల్ పాలిష్ పూసి ఎండి పోయాక పెట్టుకోవాలి. గాజు గ్లాసులకు మరింత అందాలను తేవాలంటే.. దాని అడుగు భాగానికి నచ్చిన నెయిల్ పాలిష్ కలర్ ని వేయండి. నెయిల్ పాలిష్ తో డిజైన్లు వేయండి. ఫోన్ల ఛార్జర్ ను కూడా నెయిల్ పాలిష్ తో ఆకర్షణీయంగా మార్చుకోవచ్చు. ఎన్వలప్ అతికించనికి నెయిల్ పాలిష్‌ను ఉపయోగించవచ్చు. దోమలు కరుస్తుంటే... శరీరంపై నెయిల్ పాలిష్ అక్కడక్కడ రాస్తే సరి. ఆ వాసనకు దోమలు దరిచేరవు. జడలకి నల్లటి పిన్నులను వాడడం సహజం. వాటికి నచ్చిన గ్లిట్టర్స్ నెయిల్ పాలిష్ ను వేసి జడల్లో పెట్టుకుంటే... ఫ్యాషన్‌గా ఉంటుంది.

సాదా బైనామాల క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోయినా తెల్లకాగితం మీద జరిగిన ఒప్పందాలకు కూడా చట్టబద్ధత కల్పించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సాదా బై నామాల క్రమబద్ధీకరణకు సిఎం కెసిఆర్ ఆమోదం తెలపడంతో రెవిన్యూశాఖ ప్రధాన ప్రత్యేక కార్యదర్శి రాజేశ్వర్ తివారీ సోమవారం మెమో (నెం. 16282/అసైన్‌మెంట్ 1(3)/2015 2) రూపంలో ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రికార్డ్ ఇన్ పట్టాదార్ పాస్‌బుక్ రూల్స్ 1989లోని 5(ఏ) సెక్షన్‌లోని 22(2) నిబంధనను అనుసరించి ఇలాంటి తెల్లకాగితం దరఖాస్తులను క్రమబద్ధీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన తాజా ఆర్డినెన్సులో సైతం ప్రభుత్వం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. రెండేళ్ళ క్రితం కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చింది. గరిష్టంగా ఐదెకరాల వరకు సాదా బైనామాల కింద ఉచితంగా క్రమబద్ధీకరించేలా 2016 డిసెంబరు 19న జిఓ నెం. 294లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం జూన్ 2, 2014ను కటాఫ్ తేదీగా పేర్కొంది. ఈ ప్రకారంగా 11.19 లక్షల దరఖాస్తులు ప్రభుత్వానికి అందగా, వీటిలో 6.18 లక్షల దరఖాస్తులకు చెందిన 2.68 లక్షల ఎకరాల భూములను క్రమబద్ధీకరించింది. సుమారు 4.19 లక్షల దరఖాస్తులను ప్రభుత్వం తిరస్కరించింది. గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు వంద రోజుల పాటు జరిగిన భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం సందర్భంగా సాదా బైనామాల క్రమబద్ధీకరణ కోరుతూ సుమారు 2.45 లక్షల దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి.

15న 'ఛలో అసెంబ్లీ'

మన తెలంగాణ/హైదరాబాద్ : పాతబస్తీలో హైదరాబాద్ మెట్రో రైల్ నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మార్చి15న చార్మినార్ నుంచి 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాతనగర మెట్రో రైల్ జెఎసి నాయకులు తెలిపారు. మెట్రో రైల్ నాయకులు ఇ.టి. నర్సింహ, ఆలె భాస్కర్, రషీద్ షరీఫ్, రూప్‌రాజ్, ఉస్మాన్ అల్హాద్రి, షాజిద్ షరీఫ్ తదితరులు హైదరాబాద్‌లో మీరాలంమండిలో సమావేశమయ్యారు. మెట్రో రైల్ నిర్మాణ పనుల ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భవిష్యత్ కార్యాచరణపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. మెట్రో రైల్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ హైదరాబాద్ నగర ఎంఎల్ఎలుకు వినతిపత్రాలను అందజేయాలని జెఎసి నేతలు నిర్ణయించారు. ఈ మేరకు ఇ.టి. నరసింహ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెట్రో రైల్ నిర్మాణం చేయకుండా పాతబస్తీ అభివృద్ధి చెందడం అసాధ్యమని జెఎసి నాయకులు అన్నారు. పాతబస్తీలో 40 ఏళ్ల నుంచి ఆధిపత్యం చెలాయిస్తున్న ఒక రాజకీయ పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గిన ప్రభుత్వం మెట్రో రైలు నిర్మాణ పనులను చేపట్టడం లేదని ఆరోపించారు. పాతబస్తీ అభివృద్ధి చెందకుండా హైదరాబాద్ విశ్వనగరం ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించిన మెట్రో పనులను ప్రారంభించాలని, లేకపోతే తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు సలీం, జి.హరినాథ్‌గౌడ్, మహమ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పిజి ఈ సెట్ షెడ్యూల్ విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణలో ఎంసెంట్‌తో పాటు పీజీ ఈ సెట్, ఈ సెట్ షెడ్యూల్‌ను కూడా ఉన్నత విద్యామండలి సోమవారం విడుదల చేసింది. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండలి ఛైర్మన్ పాపిరెడ్డి షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. ఈ పరీక్షలకు సంబంధించి మార్చి 12వ తేనదీన నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. ఉస్మానియా యూనివర్శిటీ నిర్వహించే 'పీజీ ఈ సెట్' పరీక్షలు మే 28 నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముంటుందన్నారు. వెయ్యి రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజుతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఐదు వందల రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలన్నారు. రెండు వేల రూపాయల అపరాధ రుసుంతో మే 14వ తేనదీ వరకు, పదివేల రూపాయల అపరాధ రుసుంతో మే 22వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలు, 2 గంటలు, 4 గంటలకు మూడు పేపర్లుగా పరీక్షలు ఉంటాయన్నారు. 120 ప్రశ్నలుండే ప్రశ్నాపత్రానికి రెండు గంటల కాల వ్యవధి ఉంటుందని వివరించారు. ఇందులో ఎంఇ, ఎంటెక్, ఎం ఆర్కిటెక్, ఎం ఫార్మసీ ప్రవేశాల కోసం ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జూన్ 15వ తేదీన ఫలితాలను విడుదల చేయనున్నట్లు పాపిరెడ్డి వెల్లడించారు. దీంతో పాటు 'ఈ సెట్' షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. ఈ సెట్‌కు సంబంధించి రీజినల్ కేంద్రాలను వెల్లడించారు. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నార్త్, సౌత్, ఈస్టు, వెస్టు, సెంట్రల్ జోన్లతో పాటు కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో నార్త్ జోన్‌లో మెడ్చెల్, గండి మైసమ్మ, సౌత్ జోన్‌లో ఎల్బీనగర్, హయతనగర్, పెద్ద అంబర్‌పేట, ఇబ్రహీంపట్నం, ఈస్ట్ జోన్‌లో ఘట్కేసర్, కీసర, వెస్ట్ జోన్‌లో కూకట్‌పల్లి, పటాన్‌చెరువు, గండిపేట, మొయినాబాద్, సెంట్రల్ జోన్ అబిడ్స్, తార్నాక పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంతో పాటు కర్నూలులో సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పాపిరెడ్డి వివరించారు.

రైతుకు బీమా

(మొదటిపేజీ తరువాయి)

రైతు సమన్వయ సమితులే నాయకత్వం వహించే పరిస్థితి రావాలన్నారు. రైతు సమన్వయ సమితుల పనులను ఒక యజ్ఞంలా ముందుకు తీసుకువెళ్లాలని, పట్టుపట్టి, జట్టుకట్టి విజయాలు సాధించాలని సమితి సభ్యులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 5 వేల ఎకరాలకు ఒకరి చొప్పున 2638 మంది వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించి వారికి శిక్షణ ఇప్పించి ఐప్యాడ్‌లు అందించడం జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములే ఉండేవని, నూతన రాష్ట్రం ఏర్పడిన తరువాత 23 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బిజెపిలతో ప్రజలకు ఒరిగిందేమి లేదని పునరుద్ఘాటించారు. గత పాలకుల తప్పిదాల వల్లే రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో 17జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌లు, ఎంఎల్‌సిలు ఇతర జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు,మండల, జిల్లా రైతు సమన్వయ సమితుల సభ్యులు పాల్గొన్నారు.

రూ.3వేల కోట్లు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన ఉండవచ్చని పంచాయతీరాజ్ విభాగం అధికారుల సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 8684 పంచాయతీలకు తోడు కొత్తగా నాలుగు వేల పంచాయతీలు ఉనికిలోకి వస్తున్నందువల్ల కనీస సౌకర్యాల కల్పనతో పాటు అభివృద్ధి పనులు చేయడానికి రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ. 3000 ఇస్తున్నందున పుష్కలంగా నిధులు సమకూరుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిధుల్ని జనాభా ప్రాతిపదికన పంపిణీ చేసే బాధ్యత రాష్ట్ర ఆర్థిక సంఘం చూసుకుంటుందని తెలిసింది. కొత్త పంచాయతీలు ఉనికిలోకి వచ్చినా రాకపోయినా ప్రస్తుతం ఉన్న పంచాయతీలైనా ఈ నిధులతో అనేక పనులు చేపట్టవచ్చునని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. సర్పంచ్‌లకే చెక్ పవర్ ఇస్తున్నందున స్థానిక అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేసి ప్రజలకు ఆ ఫలాలు అందేలా చూడడం వీలవుతుందని, ఫలితంగా గ్రామ స్థాయి ప్రజల మన్ననలను చూరగొనవచ్చన్నది ప్రభుత్వ భావన. రానున్నది ఎన్నికల సంవత్సరం కాబట్టి గ్రామ స్థాయిలో ఓటు బ్యాంకును అనుకూలంగా మల్చుకోవడానికి ఈ బడ్జెట్ కేటాయింపుల విధానం అధికార పార్టీకి కలిసొచ్చే అంశం కానుంది. ఎన్నికల సమయంలో ప్రభావితం చేయడానికి అవకాశం ఉంటుంది. రైతు పెట్టుబడి పథకం, సంక్షేమ పథకాల అమలుకు తోడు గ్రామీణాభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు ఇవ్వడం ద్వారా గణనీయమైన అభివృద్ధి కనిపిస్తుందని అధికార పార్టీ నేతల అభిప్రాయం.

చైర్మన్ల జీతాలు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

స్పెషల్ గ్రేడ్ మార్కెట్ చైర్మన్ జీతం రూ.1500 నుంచి రూ. 20 వేలకు, గ్రేడ్ 1 మార్కెట్ కమిటీ ఛైర్మన్ జీతం రూ. ఒక వెయ్యి నుంచి రూ. 15 వేలకు, గ్రేడ్ 2,3 మార్కెట్ల చైర్మన్‌లకు రూ. 500 నుంచి రూ.15 వేలకు పెరిగింది. అలాగే ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యులు తమ కార్యాలయానికి వచ్చి రోజువారీ విధులు నిర్వహించిన సమయంలో ఒక్క రోజుకు రూ. 1000 మించకుండా చెల్లించనున్నారు. ఈ మేరకు తెలంగాణ మార్కెట్ రూల్స్ 1969కు సవరణ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

మంత్రి హరీశ్ చొరవ, సిఎం ఆమోదం

మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు చొరవ తీసుకోవడంతోనే తమ జీతాల పెంపు జరిగిందని పలువురు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు హర్షం వ్యక్తం చేశారు. గత 16 సంవత్సరాలుగా కేవలం రూ. 2 వేల వేతనం విధానం అమలవుతోందని, తమ సమస్యలను దృష్టిలో ఉంచుకుని జీతం పెంపునకు ఆమోదం తెలిపిన సిఎంకు కృతజ్ఞతలు చెబుతున్నారు. తమ జీతాల పెంపులో హరీశ్ చూపిన చొరవనే మార్కెట్‌లో రైతులకు సహకరించేందుకు చూపుతామంటున్నారు.

జలం జారి పోతోంది

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వేసవికి ముందే నీటి ఎద్దడి
- వెలవెల బోతున్న గోదారి, వాగులు, వంకలు, బోర్లు, బావులు
- భగీరథ పథకం గొంతుకలు తడిపేనా





జీవ జలం చేజారి పోతోంది... ఇంకా వేసవి కాలం రాకముందే భూగర్భ జలం అడుగంటు తుంది... ఇప్పటికే నీటి ఎద్దడి మొదలైంది... జల సిరు లకు సొంతమైన భద్రాద్రి జిల్లాలో గోదావరి నీరులేక వెలవెల బోతోంది... వాగులు, వంకలు, చెరువులు, బోర్లు, బావులు నిండుకుంటున్నాయి...గుక్కెటి నీళ్ళ కోసం మైళ్ళ దూరం నడిచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది... ఉగాది నాటికి మిషన్ భగీరథ ద్వారా నీళ్ళందించేందుకు అధికారులు హడావిడి చేస్తోన్నా ఈ వేసవిలో కూడా ఎండిపోయే గొంతుకలు తడుస్థాయా అనే అనుమాలు వ్యక్తం అవుతున్నాయి...

మన తెలంగాణ/భద్రాచలం : పూర్తి ఏజెన్సీ ప్రాంతం, దట్టమైన అడవులు, వాగులు, వంకలు, నదులు, ఉప నదులకు నిలయమైన భద్రాద్రి జిల్లా నీటి ఎద్దడి భారిన పడుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు ఇప్పటికే నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఆయా గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులు నిండే పరిస్థితి లేదు. జిల్లా వ్యాప్తంగా అనేక బావుల్లో ఇప్పటికే చుక్క నీరు లేదంటే అతిశయోక్తి కాదు. చాలా ప్రాంతాల్లో బోర్లు పతనావస్తకు చేరుకోగా మరి కొన్ని మరమ్మత్తులకు నోచుకోలేదు.

వేసవికి ముందే : చలికాలం పూర్తయి ఇప్పుడిప్పుడే వేసవి కాలంలోకి అడుగుపెడుతున్నాం. మార్చి మాసం రాకముందే నీటి సమస్య జఠిలమైంది. ముందున్న మూడు మాసాల వేసవి కాలాన్ని తలుచుకుంటే గుండెలు గుభేల్లుమంటున్నాయి. బిందెడు మంచినీటి కోసం అటవీ గిరిజన ప్రాంతాల ప్రజలకు కూడా మైళ్ళదూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయా ప్రాంతాల్లో ఉండే వాగులు ఎండి పోవడంతో చెలిమల ద్వారా నీటి తోడుకుంటున్నప్పటికి ఆశించిన స్థాయిలో నీరు పైకి ఉబకటం లేదు. ఒక్క బిందెడు చెలిమ నీటి కోసం అరగంటకు పైగా పడిగాపులు కాయాల్సి వస్తుందని గిరిజన మహిళలు వాపోతున్నారు.

గోదారున్నా : నిత్యం నిండుకుండలా ప్రవహించే గోదావరిలో నీళ్లులేక వెలవెల బోతోంది. దాపునే గోదావరి ప్రవహిస్తున్నా పలు ప్రాంతాల ప్రజలకు నీటి కష్టాలు తప్పటం లేదు. ప్రతి నిత్యం విడుదల చేయాల్సిన నీరు రెండు రోజులకొకసారి అరకొరగా వదులుతున్నారు. జీవనది పరిసర ప్రాంతాల్లో సైతం 100 అడుగుల వరకు తగిలే పరిస్థితి లేదు. ఒకప్పుడు కేవలం 50 అడుగులలోపే నీటి ఊటలుండేవి. గోదావరికి ఇరువైపుల ఉన్న భద్రాచలం, పినపాక నియోజకవర్గాల పరిధిలో వాగులు, బావులు, బోర్లు సైతం ఎండిపోతున్నాయి. విరివిగా ప్రవహిస్తున్న నీటిని వడిసి పట్టి ప్రజా ప్రయోజనాలకు మళ్ళించటంలో ప్రభుత్వాలు ఇంకా విఫలమవుతూనే ఉన్నాయి.

భగీరథ భాదలు తీర్చేనా : జిల్లాలో నీటి వనరులను సద్వినియోగం చేసుకొని ప్రతీ ఇంటి ముంగట గోదావరి జలాలు పారిస్తామని చెప్పిన తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపటం లేదు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లాను ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులు ఏళ్లతరబడి సాగుతూనే ఉన్నాయి. వాస్తవానికి 2017 డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి కావలసిన పనులు కాక పోవడంతో మార్చి నాటికి పనులను పూర్తి చేసి అప్పగిస్తామని మరో సారి చెబుతున్నారు. ఇంకా అక్కడక్కడ ట్యాంకుల నిర్మాణ పనులు, పైప్‌లైన్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. పని ప్రాంతాల్లో అధికారుల హడావిడి కనిపిస్తుందే తప్ప పనుల్లో ఎలాంటి పురోగతి లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వేసవికి కూడా మిషన్ భగీరధుడు తడి ఆరుతున్న గొంతుకలను తడిపే పరిస్థితి లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ వేసవి కాలంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజల మంచినీటి సమస్యలు తీర్చేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపధికన పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఆన్‌లైన్ ద్వారా ఎంసెట్

- మెడిసిన్, అగ్రికల్చర్ మే 2,3న, ఇంజినీరింగ్ 4,5,7తేదీల్లో
- నిమిషం ఆలస్యమైనా అనుమతించం : పాపిరెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్/హైదర్‌నగర్ : 201819 ఎంసెట్ పరీక్షను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామని తెలంగాణ విద్యా మండలి చైర్మన్ పాపిరెడ్డి అన్నారు. సోమవారం కెపిహెచ్‌బిలో గల జెఎన్‌టియుహెచ్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఎంసెట్ 201819 వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా ఈ సారి ఆన్‌లైన్ విధానంలో ఎంసెట్‌ను నిర్వహించ తలపెట్టినట్లు ఎస్సీ, ఎస్టీలకు రూ.400, ఇతరులకు రూ.800 ఫీజును నిర్వహించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ జారీ చేస్తామని, ఫిబ్రవరి 28 నుంచి అందుబాటులో ఉంటుందని, మార్చి 4 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఎలాంటి సవరణలున్నా ఏప్రిల్ 6 నుంచి 9 వరకు సమయముంటుందన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 4 వరకు, రూ.1000 రుసుముతో ఏప్రిల్ 18 వరకు, 5000 రుసుముతో ఏప్రిల్ 24 వరకు, రూ.10,000 రుసుముతో ఏప్రిల్ 28 వరకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. హాల్ టికెట్లను ఏప్రిల్ 4 నుంచి మే 1లోపు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఉదయం 10 నుంచి 1 గంట వరకు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ సారీ మైనార్టీలను దృష్టిలో పెట్టుకొని ఉర్దూలో కూడా ప్రశ్న పత్రాలను జారీ చేస్తున్నట్లు తెలిపారు.



మెడిసిన్, అగ్రి కల్చర్ వారికి మే 2, 3 న ఇంజినీరింగ్ విద్యార్థులకు 4, 5, 7 న ఎంసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు , ఒకే సారి ఈ ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించడం సాధ్యం కాదని విడుతల వారీగా 25 వేల విద్యార్థులు ఒక రోజు పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఆన్‌లైన్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఎంసెట్ పరీక్ష తరువాత '' కీ '' ని వారి వారి మెయిల్‌కు మెయిల్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ యాదయ్య, లింబాద్రి, గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

శ్రీదేవి-బోనీ కాల్‌డేటాపై ఆరా

(మొదటిపేజీ తరువాయి)

శ్రీదేవి ఏ పరిస్థితిలో స్పృహ కోల్పోయ్యారనేది స్పష్టం కాలేదు. మరో వైపు ఆమె గుండెపోటుతో మృతి చెందినట్లుగా తొలుత వెలువరించిన నివేదికను ఉపసంహరించుకున్నారా? లేదా అనేది స్పష్టం కాలేదు. ఆమెకు గుండె సంబంధిత జబ్బులు లేవని సన్నిహితవర్గాలు చెపుతున్నాయి. ఈ దశలోనే ఆమెటబ్‌లో పడి చనిపోయినట్లుగా నివేదిక వెలువడింది. దీనితో మరణంపై పలు విధాలుగా సస్పెన్స్ మిస్టరీ నెలకొంది. మరో వైపు శ్రీదేవి మృతి గురించి తెలియచేసిన ఆమె సమీప బంధువులు ఆ తరువాత తాము పూర్తి విషాదంలో మునిగి ఉన్నట్లు తరువాత వెలువడుతున్న కథనాలపై తమను సంప్రదించవద్దని చెప్పి మీడియాకు దూరంగా ఉంటున్నారు.

బోనీ కపూర్ ఇతరుల విచారణ

శ్రీదేవి మృతిపై పలు అనుమానాల నివృత్తికి దుబాయ్ పోలీసులు స్థానిక ప్రాసిక్యూషన్‌కు కేసును అప్పగించడంతో భర్త బోనీకపూర్‌ను విచారించారు.మూడు గంటలు ఆయనను ఇతరులను ప్రశ్నించినట్లు, విచారణ పూర్తి అయ్యేంత వరకూ దుబాయ్ వదిలి వెళ్లరాదని ఆదేశించినట్లు వెల్లడైంది. విచారణ ప్రక్రియ ఇంకా పూర్తి కానందున శ్రీదేవి భౌతిక కాయాన్ని సోమవారం రాత్రి కూడా ముంబైకి తరలించే వీలులేదని, అన్ని ప్రక్రియలు పూర్తయితే మంగళవారం ముంబైకి పంపించే వీలుందని అనధికారిక వర్గాలు తెలిపాయి.

ఒకే నెంబరు నుంచి పదేపదే ఫోన్లు

శ్రీదేవి మృతిపై దుబాయ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసును దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేశారు. విచారణలో కీలకంగా ఇప్పుడు శ్రీదేవి , బోనీకపూర్‌ల ఫోన్ల కాల్‌డేటాలను పరిశీలిస్తున్నారు. శ్రీదేవి, బోనీ ఎప్పుడెప్పుడు ఎంత సేపు మాట్లాడుకున్నదీ ఆరా తీస్తున్నారు. కాల్‌డేటా ఆధారంగా వివరాలుసేకరిస్తున్నారు.అయితే ఒకే నెంబర్ నుంచి ఆమెకు పలుసార్లు ఫోన్ కాల్స్ వచ్చినట్లు తెలిసింది. బోనీకపూర్‌ను ఎక్కువ సమయం తీసుకుని పోలీసులు విచారించారు, అంతేకాకుండా తుది క్షణాలలో శ్రీదేవిని బోనీతో పాటు ఆసుపత్రికి తరలించిన ముగ్గురు వ్యక్తులను విచారించారు. రషీద్ ఆసుపత్రికి చెందిన ఇద్దరు డాక్టర్లు , ఐదుగురు అటెండర్ల వాంగ్మూలాలను రికార్డు చేసుకున్నారు. కీలకంగా శ్రీదేవి రెండు మూడు రోజులు బస చేసి ఉన్న హోటల్ సిబ్బందిని కూడా పోలీసులు అన్ని కోణాల నుంచి విచారించారు.

శ్రీదేవి తాగి ఉన్నారా?

మరణానికి ముందు శ్రీదేవి అల్కహాల్ తీసుకుని ఉన్నట్లుగా దర్యాప్తు అధికారులు గుర్తించినట్లు తెలిసిందని గల్ఫ్‌న్యూస్ పత్రిక వెల్లడించింది. ఆల్కహాల్ ప్రభావంతో ఉన్నప్పుడే ఆమె టబ్‌లో పడి ఉంటారని ఈ దశలో స్పృహ తప్పి ఉంటారని పత్రిక తెలిపింది. ఆమె మందు తీసుకున్నట్లు వచ్చిన వార్తలను దర్యాప్తు సంస్థలు నిర్ధారించలేదు. అయితే యుఎఇ ప్రభుత్వ ఫోరెన్సిక్ నివేదికను గల్ఫ్‌న్యూస్ వారు తమ ట్విట్టర్‌లో పొందుపర్చారు. మరో వైపు దుబాయ్‌లో అమలులో ఉన్న పలు నిబంధనల మేరకు పోస్టు మార్టం నివేదిక సమర్పణలో జాప్యం ఏర్పడిందని వెల్లడైంది. పలు రకాల పరీక్షల తరువాత నివేదికను శ్రీదేవి కుటుంబ సభ్యులకు పోలీసులు అందించారు.

బోనీ కపూర్ అసలు ఎక్కడ ఉన్నారు?

హోటల్ గదిలో మృతి సమయంలో ఆమె ఒంటరిగా ఉన్నారా? భర్త బోనీకపూర్ అక్కడే ఉన్నారా? శ్రీదేవి చనిపోయి ఉన్న విషయాన్ని తొలుత ఎవరు గుర్తించారు? హోటల్ సిబ్బందా? లేక భర్త బోనీనా ? అనే పలు ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానాలు రాకపోవడంతో శ్రీదేవి మృతి అనుమానాస్పదంగా మారుతోంది. ఇప్పటివరకూ పోస్టుమార్టం నివేదిక వెల్లడితో ఆమె భౌతిక కాయాన్ని ముంబైలోని శ్రీదేవి నివాసానికి తరలించడానికి మార్గ ం సుగమం అయింది. ఇప్పటికే రిలయన్స్ దిగ్గజం అనిల్ అంబానీ 13 సీటర్ల ప్రత్యేక విమానాన్ని శ్రీదేవి భౌతిక కాయాన్ని ఇండియాకు తరలించేందుకు పంపించారు. ముంబైలో వేలాది మంది అభిమానులు, వందలాది మంది సినీ ప్రముఖులు శ్రీదేవి నివాసం వద్దకు చేరుకున్నారు. దుబాయ్‌కు వెళ్లిన శ్రీదేవి ఎన్నిరోజులు దుబాయ్‌లో ఉన్నారు? శ్రీదేవి దుబాయ్‌లో ఉన్నప్పుడే భర్త బోనీ ముంబైకి వెళ్లి తిరిగి హడావిడిగా దుబాయ్‌కు వచ్చారా? శ్రీదేవి మరణం సమయంలో ఖుషీ ఎక్కడున్నారు? వంటి పలు అంశాలకు సరైన సమాధానాలు లభించకపోవడం అనుమానాలను రేకెత్తించింది.

అక్షర దోషాలతో మరణ నివేదిక

పలు రకాల పరిశీలన తరువాత అధికారులు వెలువరించిన శ్రీదేవి మరణ నివేదిక ఇంగ్లీషులో ఉంది. ఇందులో పదాల తప్పులు దొర్లాయి. యాక్సిడెంటల్ డ్రౌనింగ్ అని ఉండాల్సిన చోట డ్రాయింగ్ అనే పదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ టబ్‌లో పడి మృతి చెందినట్లుగా నివేదికలో పేర్కొన్నారు. మృతి వెనుక ఎలాంటి కుట్ర లేదని నిర్ధారణకు వచ్చినట్లుగా దుబాయ్ పోలీసులు తెలిపారు. ఫోరెన్సిక్ నివేదికను అక్కడి అధికారులు పోలీసులకు అందించారు. తరువాత పోలీసు వర్గాలు అధికారిక ప్రకటన వెలువరించారు. నివేదికను మీడియా ముందు చదివి విన్పించిన పోలీసులు శ్రీదేవి ప్రమాదవశాత్తూ చనిపోయినట్లు, టబ్‌లో మునిగి మృతిచెందినట్లుగా వెల్లడయినట్లు తెలిపారు.

అల్కహాల్ అలవాటు లేదట

టబ్‌లో పడి పోయి ఉన్న సమయంలో శ్రీదేవి ఆల్కహాల్ తీసుకున్నట్లు నివేదికలో నిర్ధారించారు. కానీ ఆమెకు మందు తీసుకునే అలవాటు లేదని రాజ్య సభ ఎంపి అమర్ సింగ్ తెలిపారు.

సింగర్ తరహాలోనే మృతి

బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన శ్రీదేవి ఉదంతం ఇప్పుడు ప్రముఖ గాయకురాలి మృతిని తలపించింది. అమెరికాకు చెందిన ప్రఖ్యాత గాయని విట్నీ హోస్టన్ మరణం కూడా బాత్‌టబ్‌లోనే సంభవించింది. ఈఅంశాన్ని ఇప్పుడు అప్పటి నటి సిమి గరేవాల్ తమ ట్విట్టర్‌లో తెలిపారు.

శ్రీదేవికి స్పోకెన్ ఇంగ్లీషు సంస్థ నివాళులు

పాట్నా : నటి శ్రీదేవి మృతి పట్ల పాట్నాలోని స్పోకెన్ ఇంగ్లీషు ఇనిస్ట్యూట్‌లో సోమవారం సంతాప సభ జరిగింది. శ్రీదేవి చాలా కాలం విరామం తరువాత నటించిన ఇంగ్లిషు వింగ్లీషు సినిమాను స్పూర్తిగా తీసుకుని ఆంగ్లబోధన కోసం ఈ విద్యా సంస్థను ఏర్పాటు చేశారు.బడుగు వర్గాలకు చెందిన బాలికలకు ఆంగ్లం నేర్పేందుకు ఈ వెలిసిన ఈ సంస్థలో శ్రీదేవి మరణం పట్ల నివాళులు అర్పించారు. ఆమెను స్మరించుకుంటూ సభ జరిగింది.

దుబాయ్ పోలీసుల అదుపులో బోనీ

దర్యాప్తు సుడులు తిరుగుతోంది. శ్రీదేవి భర్త బోనీకపూర్‌ను దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ఇతరులతో పాటు విచారిస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదికలోని అంశాలు పలు కీలక విషయాలకు దారితీయడంతో స్థానిక పోలీసులు కేసును పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు అప్పగించారు. ఇప్పుడు బోనీ కపూర్‌ను దుబాయ్ విడిచి వెళ్లరాదని ఆదేశించినట్లు వెల్లడైంది.

ఉద్యమ ఆకాంక్షలను... గాలికొదిలిన టిఆర్ఎస్

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను గాలికొదిలి, ఇతర పార్టీల నుంచి నాయకులను చేర్చుకొని, రాజ్య వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకోవడమే లక్ష్యంగా టిఆర్ఎస్ పనిచేస్తోందని, 2019 ఎన్నికల్లో ఎలాగైనా గెలువాలనే ఉద్దేశంతో డబ్బులను పోగు చేసుకోవాలనే ఆలోచిస్తోందని, కానీ తెలంగాణ ఉద్యమం నేర్పింది ఇది కాదని, అందువల్లనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బలమైన సైద్ధాంతిక పునాదితో రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నామని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ స్పష్టం చేశారు. డల్లాస్‌లో తెలంగాణ ఎన్ఆర్ఐలు ఆదివారం నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్'లో కోదండరామ్ తెలంగాణ రాష్ట్రంలోని పరిస్థితులను, తాజా రాజకీయ పరిణామాలను వివరించారు. ప్రజా సమస్యలను, ఉద్యమ ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టకి తీసుకెళ్లే ప్రయత్నం చేశామని, కానీ ఈ అన్ని ప్రయత్నాలను టిఆర్ఎస్ ప్రభుత్వం అణచివేసేందుకు ప్రయత్నించిందన్నారు. వాస్తవానికి తెలంగాణ ఉద్యమం, త్యాగాల ఫలితమే 2014 ఎన్నికల్లో టిఆర్ఎస్ విజయానికి కారణమన్నారు. తెలంగాణ ఉద్యమ అనుభవం, రాష్ట్ర అభివృద్ధికి నాలుగేళ్ళ పాటు టిజెఏసి చేసిన ప్రయత్నం రాజకీయ ప్రక్రియకు నాంది పలికిందన్నారు.

పోస్ట్‌కార్డ్ ఉద్యమానికి ఎన్ఆర్ఐల మద్దతు

నిరుద్యోగుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 'పోస్ట్‌కార్డు ఉద్యమాని'కి తెలంగాణ లండన్ ఎన్ఆర్ఐలు మద్దతు పలికారు. ఈ కార్యక్రమానికి జెఎసి లండన్ ఎన్ఆర్ఐ ప్రతినిధి రంగువెంకట్ అధ్యక్షత వహించగా, ప్రతినిధులు రవికూర, తిరుపరి నర్సింహరెడ్డి, కొలను విద్యాభూషన్, గుర్రం మల్లారెడ్డి, పుష్పాల రాజు, మధు, గుమ్మడవల్లి రమేష్, నాయిని శైలజ, నాయిని సురేందర్ రెడ్డి ఆకుల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో గోవిందారంవాసి ఆత్మహత్య

మన తెలంగాణ/మేడిపల్లి : గల్ఫ్ దేశం వెళ్లిన మండలంలోని గోవిందారం చెందిన ఓ వలస జీవి పనికి తగ్గ వేతనం లభించక, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తాను నివాసముంటున్న గదిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు ఆదివారం రాత్రి సమాచారం అందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని గోవిందారం గ్రామానికి చెందిన పెద్ది శ్రీనివాస్ (36) అనే వ్యక్తి ఉపాధి కోసం అప్పులు చేసి రెండు నెలల క్రితం దుబాయ్ పయనమయ్యాడు. అక్కడ ఓ కంపెనీలో పని చేస్తున్న శ్రీనివాస్ శ్రమకు తగ్గ వేతనం లభించకపోవగా తన భార్య అనారోగ్యానికి గురి కావడంతో ఆందోళకు గురయ్యాడు. తనకు వస్తున్న వేతనంతో అప్పులు తీర్చే మార్గం లేక జీవితం మీద విరక్తి చెంది ఆదివారం తన తోటి స్నేహితులు విధులకు వెళ్లగా విధులకు వెళ్లకుండా గదిలోనే ఉండిపోయిన శ్రీనివాస్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని ఆదివారం రాత్రి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలపడంతో ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. శవాన్ని త్వరగా స్వగ్రామానికి పంపించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

కిడ్నాప్.. గ్యాంగ్ రేప్

(మొదటిపేజీ తరువాయి)

ఇంటర్‌నెట్‌లో పెడుతామని తల్లిని హెచ్చరించారు. ఇప్పటికే తమపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూతుర్ని గదిలో నగ్నంగా బంధించిన దృశ్యాలు కనిపించాయని చాంద్రాయణగుట్ట పోలీసులకు ఆ యువతి తల్లి ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. తన కూతురు మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేయడంతో చాంద్రాయణగుట్ట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాధితురాలి తాజా స్థితితో ఆచూకీ కనిపెట్టేందుకు నాలుగు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. యువతికి ఎలాంటి ప్రాణహాని కలుగకుండా పోలీసులు ఈ కేసును జాగ్రత్తగా దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిటన్‌లో భారీ పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

షేన్ తెలిపారు. శిథిలాల కింద మరింత మంది ఉన్నారనే అనుమానిస్తున్నట్టు వెల్లడించారు. పోలీసులు, లిసెస్టర్‌షైర్ అగ్నిమాపక అధికారులు ఉమ్మడిగా పేలుడు కారణంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు ఉగ్రవాద చర్యలకు ఏమైనా సంబంధం ఉందా అనే విషయాన్ని ఇప్పటికిప్పుడే తాము చెప్పలేమని అన్నారు.




తెలంగాణకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి: నాటి నుంచి నేటి వరకు తెలంగాణకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని నీటిపారుదల శాఖా మంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. సోమవారం సిద్దిపేటలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు వెనుకబాటుకు గురైన తెలంగాణపై ఎందుకు మాట్లాడరని ఆయన ప్రశ్నించారు. సాగునీటి రంగంలో ఏపితో పోలిస్తే తెలంగాణ చాలా వెనుకబాటుకు గురైందని అందు కోసం ప్రాణహిత చేవెళ్లకు జాతీయ హోదా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా వుందని అన్నారు. యుపిఎ హయాంలో జాతీయ ప్లానింగ్ కమిషన్ తెలంగాణలోని తొమ్మిది జిల్లాలో వెనుకబాటుకు గురైందని చెప్పిన మాట వాస్తవం కాదా అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి హామీలు ఇచ్చినా తాము అభ్యంతరం చెప్పమని అదే సమయంలో వెనుబాటుకు గురైన తెలంగాణ గురించి ఎందుకు మాట్లాడరన్నారు. ఈ విషయంలో బస్సు యాత్రకు బయలుదేరిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు పెదవి విప్పాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన తెలంగాణను అభివృద్ధి పథాన నడపడానికి సిఎం కేసీఆర్ అప్పు తెచ్చయినా కాళేశ్వరం ప్రాజక్టును పూర్తి చేయాలని ప్రయత్ని స్తున్నారని హరీశ్‌రావు అన్నారు.

‘మహా’ బడ్జెట్ రూ.13,150 కోట్లు

ఆమోదించిన బల్దియా పాలకమండలి



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : బల్దియా చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 2018 – 19 వార్షిక బడ్జెట్‌ను రూ.13,150 కోట్లతో పాలక మండలి సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా అమోదించింది. మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి), ఇతర కార్పొరేషన్లకు కేటాయించిన నిధులతో బడ్జెట్‌ను రెండు భాగాలు విభజించారు. ఇందులో జిహెచ్ఎంసి 2018 – 19 వార్షిక బడ్జెట్‌ను రూ.6076.96 కోట్లుగా చూపించారు. మూసీ రివర్ ఫ్రంట్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్‌లకు రూ.7073.14 కోట్లు కేటాయించారు. ఈ రెండు భాగాలుగా విభజించిన బడ్జెట్‌ను రూ.13,150 కోట్లతో నగర మేయర్ బొంతు రామ్మోహన్ సోమవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టారు. పాలక మండలిలో చర్చించిన అనంతరం సభ్యులు బడ్జెట్‌ను ఏకగ్రీవంగా అమోదించారు. బడ్జెట్ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రెవెన్యూ ఆధాయం రూ.3,325(29శాతం), క్యాపిటల్ రిసిట్స్ రూ.2751.86 కోట్లు(20.93 శాతం) చూపించారు. బడ్జెట్ మొత్తం రూ.13,150 కోట్లు. రెవెన్యూ వ్యయం రూ.2,675 కోట్లు(20.34), క్యాపిటల్ వ్యయం జిహెచ్ఎంసి బడ్జెట్ నుంచి రూ.3401.86 కోట్లు(25.87 శాతం), మూడు కార్పొరేషన్ల నిధుల ద్వారా క్యాపిటల్ వ్యయం రూ.7077.14 కోట్లు(53.79 శాతం)గా పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి కార్పొరేషన్, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొషన్, హౌసింగ్ కార్పొరేషన్లకు కేటాయించడానికి గ్రాంట్‌గా అత్యధికంగా మూడు కార్పొరేషన్ల నుంచి రూ.7073.14 కోట్లు జిహెచ్ఎంసికి లభించనున్నాయి. రెవెన్యూ వ్యయంలో అత్యధికంగా పరిపాలన సంబంధిత వ్యయం రూ.1488.79 కోట్లు(55.66 శాతం) కాగా, ఆపరేషన్, మెయింటనెన్స్‌కు రూ.1043.90 కోట్లు (39.02 శాతం)గా ఉంది. నాలుగు కార్పొరేషన్ల బడ్జెట్ వివరాలు ఈ విధంగా ఉన్నాయి.
జిహెచ్ఎంసి వార్షిక బడ్జెట్ రూ.6076.96 కోట్లు.
డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ కార్పొరేషన్‌కు రూ. 6317.64 కోట్లు.
హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.377.75 కోట్లు.
మూసీ సుందరీకరణకు మూసీరివర్ ఫ్రంట్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.377.75 కోట్లు కేటాయించారు.

భారీ ప్రాజెక్టలకే ప్రాధాన్యం...

బల్దియా 2018 – 19 వార్షిక బడ్జెట్‌లో అత్యధిక శాతం ప్రాజెక్టలకే ప్రాధాన్యం ఇచ్చారు. మేయర్ బడ్జెట్ ప్రసంగంలో సంక్షేమ రంగానికి సంబంధించి ఊసే ఎత్తలేదు. రూ.3500 కోట్లు బాండ్లు, రూ.200 కోట్లను తీసుకున్నామని, బ్యాంకుల రుణాల సేకరిస్తామని మేయర్ బొంతు రామ్మోహన్ ప్రకటించారు. రూ.3,600 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేపడుతామన్నారు. రూ.8,500 కోట్ల వ్యయంతో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తున్నామని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు గ్రాంట్లను జిహెచ్ఎంసికి విడుదల చేస్తుందన్నారు. చెత్త వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఎల్ఇడి లైట్లతో విద్యుత్ పొదుపు, రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాల కొనసాగింపు, గ్రీన్‌సిటీలో భాగంగా కోటి మొక్కలు నాటడం, పార్కుల్లో వాకింగ్ ట్రక్‌లు, సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎస్.సి, ఎస్.టి ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని మేయర్ తన ప్రసంగంలో వివరించారు.

ప్రభుత్వ చీఫ్‌విప్ వాహనాన్ని ఢీకొన్న కారు : ఒకరు మృతి

మన తెలంగాణ/కరీంనగర్ క్రైం: ఆగి ఉన్న ప్రభుత్వ చీఫ్ విప్ వాహనాన్ని వెనక నుండి కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. కరీంనగర్ రూరల్ సిఐ శశిధర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ బైపాస్ రోడ్డు వద్ద ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ వాహనం డిజిల్ పోయించుకునేందుకు యుటర్న్ వద్ద ఆగి ఉండగా వెనక నుండి వస్తున్న కారు ఢీకొంది. కారు ఢీకొన్న దాటికి ఇన్నోవా వాహనం ముందుకు వెళ్ళి మరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇన్నోవాను వెనక నుండి ఢీకొన్న ఇన్నోవా వాహనం నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న కుందారపు గోపాల్ (58) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న అతని కుమారుడు శ్రీనివాస్, భార్య భాగ్యలక్ష్మి, కుమార్తె వాణిశ్రీలు గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే కరీంనగర్ రూరల్ సిఐ శశిధర్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని గోపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థిని అనుమానాస్పద మృతి

మనతెలంగాణ/నిజామాబాద్ క్రైం: ప్రేమికుల మధ్య తలెత్తిన మనస్పర్థలకు ఓ విద్యార్థిని బలైంది. వివరాల్లోకి వెళ్తే బీంగల్ మండలం చెంగల్ గ్రామానికి చెందిన పిట్ల సాయి దీక్షిత సాయి సిద్దార్థ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. ఆమె అదే గ్రామానికి చెందిన మగ్గిడి సచిన్‌ల మధ్య గత కొంత కాలంగా ప్రేమ వ్యవకొనసాగుతుంది. ఇటీవల వీరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ యువతి వారి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ముందుగా అనుమానించి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగి తమ కూతురు మృతికి కారణమైన సచిన్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకోవడంతో బాధిత కుటుంబీకులు ఆందోళన విరమించారు.

ఆ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

మన తెలంగాణ/నిర్మల్ : పెళ్లి చేసుకుటానని మోసం చేసిన సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని మైనర్ బాలిక సోమవారం పిఒడబ్ల్యూ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని ఓ మైనర్ బాలిక మామయ్య వద్ద ఉంటుంది. అదే గ్రామానికి చెందిన సర్పంచ్ శ్రీనివాస్ ఆ బాలికకు మాయమాటలు చెప్పి లొంగతీసుకున్నాడు. ఈ విషయమై ఈ నెల 17న లక్ష్మణచాంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వెంటనే అరెస్ట్ చేసి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రగతిశీల మహిళ సంఘం కార్యదర్శి హరిత, పిడిఎస్‌యు జిల్లాకార్యదర్శి సింగారి వెంకటేష్, బంధువులు పాల్గొన్నారు.

గుండె పోటుతో రైతు మృతి



మన తెలంగాణ/వాజేడు : గుండె పోటుతో రైతు మృతి చెందిన సంఘటన జయశంకర్ జిల్లా వాజేడు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం మండలంలోని చెరుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రేగులపాడు గ్రామనికి చెందిన యాలం బాబు(60) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రజ్ఞాపూర్‌కు చేరిన ఐఎమ్ఎ యాత్ర

మన తెలంగాణ/గజ్వేల్ :పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టబోతున్న నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25 వరకు జరుగుతున్న ఐఎమ్ఎ భారత్‌యాత్రమెదక్‌జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నగర పంచాయతీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చేరుకుంది. ఈ యాత్రకు ఐఎమ్ఎ గజ్వేల్‌శాఖ సభ్యులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్బంగా ఐఎమ్ఎ మాజీ జాతీయ అధ్యక్షుడు డా.అశోక్ అధావ్ మాట్లాడుతూ గతంలో ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో ప్రవేశ పెట్టిన నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లులో వైద్య రంగానికి, ప్రజారోగ్యానికి భంగకరమైన అనేక విషయాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా వైద్య రంగంతో సంబంధం లేని వైద్యేతరులకు నేషనల్ మెడికల్ కమిషన్‌లో స్థానం కల్పించడం అభ్యంతరకరంగా ఉందన్నారు. అల్లోపతి (ఎంబిబిఎస్)వైద్య విద్య అభ్యసించని అయుర్వేద, యునాని,సిద్ధ,హోమియో(అయూష్)వైద్యులకు ఆరు నెలల బ్రిడ్జి కోర్స్ ప్రవేశ పెట్టి అల్లోపతి వైద్యం చేయడానికి అవకాశం కల్పించడం వల్ల వైద్య ప్రమాణాలు క్షీణిస్తాయన్నారు. కార్యక్రమంలో ఐఎమ్ఎ మహారాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.ప్రకాష్‌దావే, ఐఎమ్ఎ రాష్ర్ట కోశాధికారి డా,బాల్‌రాజ్, గజ్వేల్ శాఖ అధ్యక్షుడు డా.లింగం,ప్రధాన కార్యదర్శి డా.చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు చెంపదెబ్బ

కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించాలని ఆటోడ్రైవర్ల డిమాండ్



మన తెలంగాణ/మహబూబాబాద్ ఎడ్యుకేషన్: ఓ ఆటోడ్రైవర్‌పై ట్రాఫిక్ కానిస్టేబుల్ చెంప చెల్ మనిపించిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మదర్‌థెరిస్సా సెంటర్‌లో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే మహబూబాబాద్ మండలంలోని ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ భూక్య హంజ్యా అనే ఆటో డ్రైవర్ రైల్వేస్టేషన్ సమీపం నుంచి మదర్‌థెరిస్సా సెంటర్ మీదుగా బస్టాండ్‌వైపు వెళ్ళేక్రమంలో డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సదానందం కలుగజేసుకొని అకారణంగా తన చెంపపై కొట్టి చేయి చేసుకున్నాడు. దీంతో బాధితుడు హంజీతో పాటు సంఘటన స్థలంలో ఉన్న పలువురు ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు. గతంలో కూడా సధానందం అనే కానిస్టేబుల్ పలువురు ఆటోడ్రైవర్లపై చేయిచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. భూక్య బాలు అనే డ్రైవర్‌ను గతంలో చితకబాది డబ్బులు వసూలు చేశాడని పేర్కొన్నారు. పైకం ఇవ్వని వారిని ఇలాగే నానా రకాలుగా ఇబ్బందులు పెడుతూ, ఆటో డ్రైవర్‌లను భయబ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కానిస్టేబుల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని, ఆటో డ్రైవర్‌కు క్షమాపణ చెప్పాలని కోరుతూ ఆటోడ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ సిరిసిల్ల అశోక్ కలుగజేసుకుని ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్‌లకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

రైతు ఆత్మహత్య

మనతెలంగాణ/మాచారెడ్డి(కామారెడ్డి జిల్లా) మండలంలోని మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన రైతు కామాటి రాజయ్య చుక్కపూర్ స్థానిక అటవీ ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎఎస్సై మదుసూదన్‌రెడ్డి వివరాలు ప్రకారం... రాజయ్య శనివారం ఉదయం పంట పొలానికి మందు చల్లి వస్తానని ఇంట్లో నుండి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగిరాలేదు. దీంతో మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అటవీ ప్రాంతంలో వెతకగా అక్కడ రాజయ్య చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. మూడు నెలల క్రితం బోర్ వేయగా నీరు రాకపోవడం, పాత అప్పులు ఉండడంతో తీవ్ర దిగ్బ్రాంతికి గురైన రాజయ్య ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య తెలిపిది. అక్కడే వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- కారును ఢీకొట్టిన లారీ
- ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఘటన



మన తెలంగాణ/అబ్దుల్లాపూర్‌మెట్ : ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి నగరానికి వస్తున్న కారును లారీ ఢీకొట్టడంతో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాటసింగారం కొత్తగూడం జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. సిఐ ముని కథనం ప్రకారం...అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంకు చెందిన నొమ్ముల సతీష్ ఆదివారం రాత్రి తన కూమారులకు నూతన వస్త్రాలంకరణ ఫంక్షన్ నిర్వహించారు. హైదరాబాద్ గోల్నాక్ అంబర్‌పేట్ బతుకమ్మకుంట సంజీవనగర్‌కు చెందిన బంధువులైన పసుమాముల శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి కొత్తగూడంలో నొమ్ముల సతీష్ కూమారుల ఫంక్షన్ వెళ్లి కారులో తిరుగు ప్రయాణం వస్తుండగా, కొత్తగూడం చౌరస్తా జాతీయరహదారిపై కారు హైదరాబాద్ వైపు యూ టర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో అటుగా విజయవాడ వైపు నుండి హైదరాబాద్ వైపు వస్తున్న లారీ వేగంగా వచ్చి కారును ఢీ కొట్టింది. లారీ అదుపు తప్పి కారుపై పడటంతో కారులో ఉన్న పసుమాముల పద్మ(48), పసుమాముల స్వప్న(35), నిత్య అభిరాం(8) అక్కడిక్కడే మృతి చెందగా, పసమాముల శంకర్, రిత్వికలు గాయపడగా కారు నడుపుతున్న హరిక్రిష్ణ క్షేమంగా బయటపడ్డారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వల్ల ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతదేహాలను ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ

ముగ్గురు యువకుల దుర్మరణం

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : ఓ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని మరో వాహనం ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన సం ఘటన ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన లక్ష్మణ్(25), నితీష్(27), రోహిత్(18)లు ఉప్పల్‌లోని భజరంగి ఫ్యాకేజిలో పనిచేస్తున్నారు. ఓకే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వీరు ముగ్గురు ఆదివారం రాత్రి తమ మో టార్ సైకిల్ నెం. ఎపి12జి 3542 వాహనంపై ఇంటికెళ్తున్నారు. ఉప్పల్ ఐడిఎల్‌లోని మాడ్రన్ యూటర్న్ వద్ద వాహనాన్ని మలుపు తిప్పుకుని రామాంతాపూర్‌వైపు వెళ్తుం డగా వెనుక నుండి అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం వీరి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో వీరు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తర లించారు. ఉప్పల్ సిఐ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది.

20 వేల కోట్లతో బిసి సబ్‌ప్లాన్

బిసి సంఘాల సమావేశం డిమాండ్

మన తెలంగాణ /హైదరాబాద్/ముషీరాబాద్ : వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను రూ. 10 వేల కోట్లకు పెంచాలని, రూ. 20 వేల కోట్లతో బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని బిసి సంఘాల సమావేశం డిమాండ్ చేసింది. హైదరాబాద్ బిసి భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా బడ్జెటు కేటాయింపులో బిసిలకు అన్యాయం జరిగిందన్నారు. అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలలో బిసిలకు జనాభా ప్రకారం 52 శాతం లబ్దిదారులను, ఎంపిక చేసి, ఇదే నిష్పత్తిలో బడ్జెటు కేటాయించాలని కోరారు. బిసి కార్పొరేషన్‌కు ఏటా 2 వేల కోట్లు, యం.బి.సి కార్పొరేషన్‌కు 2 వేల కోట్లు కేటాయించాలన్నారు. కులవృత్తులను కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించవలసిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాల స్థాయిలో చదివే విద్యార్థులకు అర్హులందరికి నెలకు రూ. 300 రూపాయిలు చొప్పున స్కాలర్‌షిప్ మంజూరు చేయాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకొనే దంపతులకు ఇచ్చే ప్రోత్సాహక పారితోషికం రూ. 10 వేల నుంచి రెండు లక్షలకు పెంచాలన్నారు. అదనంగా 200 కొత్త బిసి కాలేజి హాస్టళ్ళు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గుజ్జకృష్ణ, ఏడుకొండలు, బీరయ్య యాదవ్, మున్నూరు రాజు, పోతరాజు శ్రీనివాస్, శ్రీధర్, కృష్ణ తదితరులు ప్రసంగించారు. అనంతరం అనిల్‌కుమార్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఆర్.కృష్ణయ్య ప్రకటించారు.


అనారోగ్యంతో కస్తూర్బా విద్యార్థిని మృతి

- బంధువులు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాల ఆందోళన
- విచారణ జరిపించాలని డిమాండ్



మన తెలంగాణ / టేకులపల్లి : కస్తూర్బా గిరిజన బాలికల విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న జాటోతు భూమిక (14) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించింది. మండల పరిధిలోని బోడు పంచాయతీ ముక్కంపాడు తండాకు చెందిన జాటోతు బాలు, బుజ్జి ల కుమార్తె అయిన భూమిక 6వ తరగతి నుండి కస్తూర్బా విద్యాలయంలో చదువుకుంటుంది. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావటంతో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ఆరోగ్యం కుదుటపడకపోవటంతో కొత్తగూడెం అక్కడినుండి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం అర్థరాత్రి ఆరోగ్యం విషమించటంతో భూమిక మరణించింది. అధికారుల నిర్లక్ష్యం వలనే భూమిక మరణించిందని ఆరోపిస్తూ భూమిక మృతదేహంతో బంధువులు, విద్యార్థి సంఘాలు, కులసంఘాలు సోమవారం టేమవారం ఆందోళనకు దిగాయి. స్థానిక జడ్‌పిటిసి సభ్యుడు లక్కినేని సురేందర్, ఎఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి , గిరిజన సంఘాలు ఆందోళన చేపట్టటంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. భూమిక కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, ఇందుకు కారణమైన సిబ్బందిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారుల వద్దకు చేరుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి ఆందోళనకారులతో చర్చించారు. అక్కడినుంచి కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో ఫోన్‌లో పరిస్థితిని వివరించారు. ప్రభుత్వం నుంచి రూ. 50 వేల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సిబ్బంది తీరుపై విచారణ జరుపుతామని, ప్రభుత్వ ఉద్యోగ విషయం ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. స్థానిక జడ్‌పిటిసి సభ్యులు లక్కినేని సురేందర్ భూమిక కుటుంబానికి రూ. 25 వేలు ఆర్థిక సహాయం ప్రకటించగా స్థానిక సర్పంచ్ ఇస్లావత్ పార్వతి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మనతెలంగాణ/కాసిపేట : చొప్పరిపల్లె–సోమగూడెం మధ్యగల రైల్వే ట్రాక్‌పై సోమవారం ఉదయం వ్యక్తి రైలు క్రింద పడి మృతి చెందాడు. మందమర్రి వేపు నుండి బెల్లంపల్లి వైపుకు వెళ్లె రైలు ఢికొట్టడంతో అతడు మృతి చెందినట్లు తెలుస్తోంది. తెలిసిన వివరాల ప్రకారం మృతుడు ఆదిలాబాద్ జిల్లా కాసిపేట మండలం సోమగూడెం గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన కడముంత రాములు (35) ఇతను స్థానిక ఓరియంటల్ సిమెంట్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడు. మృతుడి మొండెం ఒకచోట, చేయి ఒక చోట, వీపు నుండి పైభాగం రైల్వే ట్రాక్‌లో పడివుండి ఉదయం రైల్వే లైన్‌మెన్ చూడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

మన తెలంగాణ/దండేపల్లి : మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామ సమీపంలోని శ్రీముఖి జిన్నింగ్ మిల్లులో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో జిన్నింగ్ మిల్లులోని పత్తి కాలిపోయింది. షాట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదంలో పత్తి కాలిపోయిందని, జిన్నింగ్ మిల్లు యజమాని తెలిపారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

అప్పుల తెలంగాణ..!

- నత్తనడకన పెండింగ్ ప్రాజెక్టులు
- పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ విమర్శ



మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: కెసిఆర్ ప్రభుత్వం బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి బతుకులేని తెలంగాణగా మారుస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిఎల్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ప్రారంభమైన సిపిఐ జిల్లా 21వ మహాసభలలో ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. 65 కోట్ల రూపాయల అప్పులో ఉన్న తెలంగాణను నాలుగేళ్లలో మరో 90వేల కోట్ల రూపాయల అప్పులపాలు చేశారని, వీటికి 11వేల కోట్లు వడ్డీ రూపంగా చెల్లించాల్సి వస్తుందని టిఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తున్నామని ప్రభుత్వం చెబుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కార్పోరేషన్ ఏర్పాటు చేసి బ్యాంకుల నుండి 33వేల కోట్ల రూపాయలు రుణం తీసుకొని పనులు సాగిస్తున్నారని అన్నారు. నల్లగొండ జిల్లాలో డిండి, ఎత్తిపోతలు, బ్రాహ్మణ వెల్లెంల, ఎస్ఎల్‌బిసి, మొదలైన పెండింగ్ ప్రాజెక్టు పనులు తూ.. తూ.. మంత్రంగా సాగుతున్నాయని అన్నారు. రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి డబ్బులు ఇస్తామంటున్న ప్రభుత్వం నీటి సౌకర్యం కల్పించడంలో విఫలమైందని అన్నారు. డిండి ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకు కూర్చొని పనులు చేయిస్తానన్న ముఖ్యమంత్రి ప్రగతిభవనం, ఫాంహౌజ్ తప్ప అధికార కుర్చీని వదిలిపెట్టడం లేదని మండిపడ్డారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సు ప్రకారం క్వింటా వరి ధాన్యానికి రూ. 2700 మద్దతు ధర కల్పించాల్సి ఉండగా ఆ మాటే మరిచారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలయ్యాయని అన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, ఇస్తానని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. పేదలందరికీ రెండు పడకల ఇళ్లను నిర్మిస్తామని చెప్పి 20 లక్షల మంది ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకుంటే 20,500 ఇండ్లు కూడా నిర్మించలేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. దళితులు రాష్ట్రంలో 3 లక్షల 50వేల మంది ఉండగా నాలుగేళ్లలో ప్రభుత్వం 4,654 ఎకరాలు మాత్రమే ఇచ్చిందని అన్నారు. వందేళ్లయినా నిరుపేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడం కెసిఆర్‌కు సాధ్యం కాదని అన్నారు. భూసర్వే పేరుతో హడావుడి చేస్తున్న ప్రభుత్వం రికార్డుల్లో తప్పుడు పేర్లు నమోదు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. భూమిపై కొలత రాళ్లు పాతి సర్వే నెంబర్ల ఆధారంగా కొలతలు వేయాలని సిపిఐ పార్టీ ప్రభుత్వానికి సూచించిందని అన్నారు. కాగా ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములను ఆక్రమించుకున్న భూదొంగలను ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బ్యాంకుల్లోని ప్రజా డబ్బును కొల్లగొట్టిన వారికి, కార్పోరేట్ సంస్థలకు అండగా ఉంటుందని అన్నారు. 2 లక్షల 14 వేల కోట్ల రూపాయల మొండి బకాయిలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని, మరో 10 లక్షల కోట్లు మొండి బకాయిలు ప్రస్తుతం బ్యాంకుల్లో ఉన్నాయన్నారు. రైతులకు 10 లక్షల కోట్ల రూపాయలు రుణాలుగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం 5 లక్షల 50 కోట్లే ఇచ్చిందన్నారు. కార్పోరేట్ సంస్థలు దేశంలోని సహజ వనరులను కొల్లగొడుతున్నాయన్నారు. మతోన్మాదం పెరిగిందన్నారు. అభ్యుదయ వాదులైన వారిని దాడులు చేసి చంపేస్తున్నారని, గౌరీ లంకేష్, కల్‌బుర్గీ, నరేంద్ర దబోల్‌కర్‌లాంటి వారిని మత హింస పొట్టన పెట్టుకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా లౌకిక వామపక్ష ఐక్య కూటమి ఏర్పాటుకు సిపిఐ కృషి చేస్తుందని అన్నారు. తెలంగాణ జెఎసితో ఇతర లౌకికప్రజాస్వామ్య శక్తులతో కలిసి ఉద్యమిస్తామని, హక్కులను అడిగితే అణచివేస్తున్న కేసిఆర్‌ను గద్దె దించేంతవరకు పోరాడుతామని హెచ్చరించారు.మహాసభలో అన్ని అంశాలపై ప్రతినిధులతో చర్చించి భవిష్యత్ పోరాట రూపాలను నిర్మిస్తామని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మహాసభల సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ బలోపేతానికి నాయకత్వం చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లెపల్లి ఆదిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నాకర్‌రావులు హాజరయ్యారు.

మాళవిక శర్మకు లక్కీ ఆఫర్



హిట్ల మీద హిట్లతో నాని కెరీర్ అద్భుతంగా సాగుతోంది. గత ఏడాది వరుస విజయాలతో దూసుకుపోయిన ఈ యంగ్‌స్టార్ ఈ ఏడాది కూడా అదే ఊపును కొనసాగించాలని అనుకుంటున్నాడు. నాని ప్రతి ఏడాది మూడు సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నాడు. అయితే అతనికి జోడీగా కొత్త హీరోయిన్‌ను ఎంపికచేయడానికి దర్శకులు కొంత కష్టపడాల్సి వస్తోంది. ఇప్పుడు నానీకి జోడీగా కొత్త హీరోయిన్‌ను ఎంపికచేశారు. నాగార్జునతో కలిసి నాని ఓ మల్టీస్టారర్ చేస్తున్న విషయం తెలిసిందే. వైజయంతి మూవీస్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమాను సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నానీకి జోడీగా కొత్త భామ మాళవిక శర్మను ఎంపికచేశారు. యాడ్స్‌తో బాగా పాపులర్ అయిన ఈ భామ ఈ సినిమాలో గ్లామరస్ రోల్‌లో నటించనుంది. రవితేజకళ్యాణ్‌కృష్ణ సినిమాతో హీరోయిన్‌గా మారిన ఈ బ్యూటీ ఇప్పుడు నానీతో రొమాన్స్ చేయబోతోంది. అయితే ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తోంది. యంగ్ డైరెక్టర్ టి.శ్రీరామ్ ఆదిత్య ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు.



ప్రభాస్

అక్కడ ఛేజింగ్ సీన్ కష్టమే

బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ 'బాహుబలి' తర్వాత ప్రభాస్ చేస్తున్న సినిమా 'సాహో'. రూ.250 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యాక్షన్ సీన్స్ హైలైట్‌గా ఉంటాయట. ఈ సినిమాకు కీలకమైన భారీ ఛేజింగ్ సీన్‌ను అరబ్ దేశాల్లో షూటింగ్ చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేసింది. ఇప్పుడు ఈ ఛేజింగ్ సీన్ చిత్రీకరణకు సమస్యలు ఎదురైనట్లు తెలిసింది. భారీ ఖర్చు, విదేశీ సాంకేతిక నిపుణులతో ఈ యాక్షన్ సీన్‌ను ప్లాన్ చేశారు. ఈ ఒక్క ఎపిసోడ్‌కే భారీగా ఖర్చుపెట్టాల్సి ఉంది. అయితే దుబాయ్, అబుదాబి తదితర ప్రాంతాల్లో ఎక్కడ హైవేల మీద షూటింగ్ చేయాలన్నా అక్కడి అధికార వర్గాల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు ఈ అనుమతులు లభించలేదని తెలిసింది. సినిమా ప్రారంభానికి ముందు ఈ ఛేజింగ్ సీన్‌ను ప్లాన్ చేసిన ఫిల్మ్‌మేకర్స్ అరబ్ దేశాల్లో ఈ యాక్షన్ సీన్స్‌కు అనుమతులు లభించడం పెద్ద కష్టం కాకపోవచ్చని భావించారు. కానీ సాహో టీమ్ ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సెట్ వేసుకోవడం తప్ప మరో మార్గం లేదని తెలిసింది. తప్పనిసరిగా రామోజీఫిల్మ్ సిటీలో భారీ రోడ్డును తాత్కాలికంగా నిర్మించి గ్రీన్‌మ్యాట్‌ను వేసి షూటింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. షూటింగ్ అనంతరం ఈ యాక్షన్ సీన్లను గ్రాఫిక్స్‌లో తీర్చిదిద్దుకోవాల్సిందేనని అంటున్నారు. దీంతో గ్రాఫిక్స్‌కు ఎక్కువ సమయం పడుతుందని, ఖర్చు పెరుగుతుందని టాక్. 2019 వేసవిని టార్గెట్‌గా చేసుకొని 'సాహో' చిత్రాన్ని సిద్ధం చేస్తున్నారు ఫిల్మ్‌మేకర్స్. ఇది పూర్తయిన తర్వాత ప్రభాస్ ఓ తెలుగు సినిమాతో పాటు ఓ బాలీవుడ్ సినిమా చేయనున్నాడట.

అతిలోక సుందరికి 'మహానటి' అంకితం





తెలుగు సినిమా ఇండస్ట్రీలో మొదటిసారిగా ఒక హీరోయిన్ బయోపిక్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. అలనాటి తార సావిత్రి జీవితం ఆధారంగా 'మహానటి' చిత్రాన్ని నాగ్‌అశ్విన్ తెరకెక్కిస్తుండగా... వైజయంతి ప్రొడక్షన్ బ్యానర్‌లో సి.అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా సావిత్రి ఓ వెలుగు వెలిగారు. ఆమె తరహాలోనే శనివారం అర్ధరాత్రి మృతిచెందిన శ్రీదేవి కూడా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాత సి.అశ్వనీదత్ 'మహానటి' చిత్రాన్ని సావిత్రికి అంకితం ఇవ్వాలని అనుకుంటున్నారు. దాదాపు ఇద్దరి జీవితాలు ఒకే తరహాలో కొనసాగాయి. ఇద్దరు కూడా అప్పటికే పెళ్లయిన వ్యక్తులనే పెళ్లి చేసుకున్నారు. కానీ వీరి మరణంలో మాత్రం వ్యత్యాసం చాలానే ఉంది. ఇకపోతే వైజయంతి బ్యానర్‌లో శ్రీదేవి ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాలను చేశారు. ఆఖరి పోరాటం, గోవిందా గోవిందా సినిమాలు ఆమె కెరీర్‌లో మరచిపోలేని చిత్రాలు. అంతేకాకుండా మరో గొప్ప సినిమా కూడా ఉంది. ఆ చిత్రమే జగదేకవీరుడు అతిలోక సుందరి. వైజయంతి ప్రొడక్షన్‌లో వచ్చిన ఈ చిత్రం ఘన విజయాన్ని అందుకొని ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఈ సినిమా తెలుగు సినిమా పరిశ్రమలో ఒక ట్రెండ్‌సెట్టర్. మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి పాత్రలు నడిచిన విధానం అందరినీ ఆకట్టుకున్నాయి. దీంతో అతిలోకసుందరి శ్రీదేవికి 'మహానటి' చిత్రాన్ని అంకితమివ్వాలని సి.అశ్వనీదత్ నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. మరికొన్ని రోజుల్లో ఈ సినిమాలోని కొన్ని పాటలను రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది. ఈ చిత్రంలో సావిత్రిగా కీర్తి సురేష్ నటిస్తున్న విషయం తెలిసిందే.

అది సాకారమైతే బాగుండేది



శ్రీదేవి, రాఘవేంద్రరావు

ఓ కాంబినేషన్‌లో రెండు, మూడు సినిమాలు వస్తేనే అపురూపంగా చెప్పుకునే రోజులు ఇవి. కానీ ఓ దర్శకుడు, ఒక హీరోయిన్ కలిసి ఏకంగా 24 సినిమాలు చేశారంటే అది నిజంగా అద్భుతమైన విషయమే. అందాల తార శ్రీదేవితో అన్ని సినిమాలు చేసి దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు ఈ ఘనతను సాధించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో తెలుగులో 15, హిందీలో 9 కలిసి మొత్తం 24 చిత్రాలు రూపొందాయి. శ్రీదేవి స్టార్‌డమ్ సంపాదించడంలో రాఘవేంద్రరావు సినిమాలు ఎంతగానో తోడ్పడ్డాయి. ఆమధ్యన ఓ టివి షో కోసం వీరిద్దరూ కలిసి కనిపించారు... ఎన్నో జ్ఞాపకాలను పంచుకున్నారు. ఇదే కార్యక్రమానికి శ్రీదేవిని ఎంతగానో ఆరాధించే మరో దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ కూడా రావడం విశేషం. ఆ సమయంలో రాఘవేంద్రరావుశ్రీదేవి కాంబినేషన్‌లో 25వ చిత్రం వస్తే బాగుంటుందనే చర్చ కూడా జరిగింది. 24 సినిమాలు కలిసి చేసిన వీళ్లిద్దరూ 25వ చిత్రం కూడా పూర్తిచేస్తే సిల్వర్‌జూబ్లీ అవుతుందనే మాటలు వినిపించాయి. ఆ ప్రాజెక్ట్ గురించి అడిగితే... "నా సినిమా ఎలా ఉండాలో మీకంటే ఎవరికి బాగా తెలుస్తుంది"అని రాఘవేంద్రరావును ఉద్దేశించి శ్రీదేవి చెప్పడం విశేషం. వర్మ కనుక నిర్మాతగా వ్యవహరించి కథ అందిస్తే ఖచ్చితంగా శ్రీదేవితో 25వ సినిమా చేస్తానన్నారు దర్శకేంద్రుడు. లార్జర్ దెన్ లైఫ్ కథ అయితే బాగుంటుందని వర్మ పేర్కొన్నాడు. శ్రీదేవితో సినిమా చేస్తే వర్మ దగ్గర తప్పకుండా సలహాలు తీసుకుంటానని చెప్పారు రాఘవేంద్రరావు. ఈ సంభాషణ అంతా సరదాగా సాగినా... ఇప్పుడు ఆమె దూరమైపోయిన క్షణంలో మాత్రం నిజంగా శ్రీదేవిరాఘవేంద్రరావువర్మ కాంబినేషన్ సాకారమై ఉంటే బాగుండేదని అభిమానులు అనుకుంటున్నారు. ఈ సిల్వర్‌జూబ్లీ చిత్రం చూసే అవకాశం దక్కేదని భావిస్తున్నారు.

'దండుపాళ్యం 3' గీతాల ఆవిష్కరణ



'దండుపాళ్యం' ఆడియో వేడుక దృశ్యం

దండుపాళ్యం సిరీస్‌లో ఇప్పటివరకు వచ్చిన రెండు చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు ఈ సిరీస్‌లో దండుపాళ్యం 3 చిత్రం రాబోతోంది. శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను థ్రిల్ చేయనుంది. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవి కాలే ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని శ్రీవాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ వారు తెలుగులో విడుదల చేస్తున్నారు. శ్రీక్షీర రామలింగేశ్వరస్వామి ఆశీస్సులతో సాయికృష్ణ ఫిల్మ్స్ సమర్పణలో నిర్మాతలు శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణ పెండ్యాల సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్రం ఆడియో ఫంక్షన్ హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వి.ఐ.ఆనంద్, త్రినాథ్, పరుచూరి వెంకటేశ్వరరావు, మల్కాపురం శివకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజాగాంధీ మాట్లాడుతూ "నేను ఇప్పటివరకు చాలా గ్లామర్ రోల్స్ చేశాను. కానీ దర్శకుడు శ్రీనివాసరాజు చెప్పిన కథ, కథనం నచ్చి ఈ సినిమా చేశాను. ఇప్పుడు అందరు మా గ్యాంగ్‌ను చూసి దండుపాళ్యం గ్యాంగ్ అంటున్నారు. ఈ చిత్రంలోని లక్ష్మి పాత్రకు నేను కొంచెం కష్టపడాల్సి వచ్చింది. నా బాడీలాంగ్వేజ్, నా మాటతీరు అన్ని మార్చుకోవాల్సి వచ్చింది. దండుపాళ్యం 3 కూడా మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను"అని అన్నారు. మకరంద్ దేశ్‌పాండే మాట్లాడుతూ "ఈ చిత్రంలో నా నవ్వుని సిగ్నేచర్ స్మైల్‌గా మార్చారు. ఈ సినిమా తర్వాత మమ్మల్ని ప్రేక్షకులు చూసే తీరు మారుపోయింది. క్రూరంగా, ఘోరంగా చూస్తున్నారు. మా పాత్రల్ని గుర్తుపెట్టుకున్నారు అంటే అదే మా విజయం"అని తెలిపారు. వి.ఐ.ఆనంద్ మాట్లాడుతూ "ఇలాంటి చిత్రాలు తీయడం అందరివల్ల కాదు. దానికి ఎంతో ధైర్యం కావాలి. దర్శకుడు శ్రీనివాసరాజు దండుపాళ్యం మొదటిపార్టుతోనే తానేంటో నిరూపించుకున్నాడు. తప్పకుండా దండుపాళ్యం 3 సక్సెస్ సాధిస్తుంది"అని చెప్పారు. చిత్ర నిర్మాతలు శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణ పెండ్యాల మాట్లాడుతూ "దండుపాళ్యం 3 చిత్రంతో నిర్మాతలుగా సినీరంగ ప్రవేశం చేస్తున్నాము. మంచి టాలెంట్ ఉన్న దర్శకుడు శ్రీనివాసరాజు. ఆయన తెరకెక్కించిన దండుపాళ్యం రెండు పార్టులు మంచి విజయాలు సాధించాయి. చివరి పార్టుగా వస్తున్న దండుపాళ్యం 3 మార్చి నెలలో విడుదల కానుంది"అని పేర్కొన్నారు.

భారతీయ చిత్రపరిశ్రమకు తీరని లోటు



చిత్ర నిర్మాత, పార్లమెంట్ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి కుటుంబానికి శ్రీదేవి ఎంతో సన్నిహితురాలు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ కుటుంబానికి ఆ మహానటి ఆప్తురాలు. చాందిని, లమ్హే వంటి బాలీవుడ్ హిట్ సినిమాలను యష్‌చోప్రాతో కలిసి టి.సుబ్బరామిరెడ్డి నిర్మించారు. ఇక శ్రీదేవి మృతి పట్ల టి.సుబ్బరామిరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఆయన మాట్లాడుతూ "శ్రీదేవి హఠాన్మరణం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దీన్ని నమ్మలేకపోతున్నాను. మా కుటుంబానికి ఎంతో ఆప్తురాలైన ఆమె ఎన్నో సినీ వేడుకలకు మా ఆహ్వానాన్ని మన్నించి వచ్చేవారు. శ్రీదేవి మరణం భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటు. బాలీవుడ్‌లో యాష్‌చోప్రాతో కలిసి మేము నిర్మించిన చాందిని, లమ్హే చిత్రాలు ఆమె నట జీవితానికి ఎంతో వన్నె తెచ్చాయి. గత ఏడాది 'మామ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన శ్రీదేవి హఠాత్తుగా మరణించడంతో అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. బాలనటిగా కెరీర్‌ను మొదలుపెట్టిన ఆమె అంచెలంచెలుగా స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. శ్రీదేవి అప్పటి యువ కథానాయకులతో నటిస్తూనే సీనియర్ నటులతోనూ సినిమాలు చేసేందుకు ఏమాత్రం సంశయించలేదు. 'బడి పంతులు' చిత్రంలో ఎన్టీఆర్ మనవరాలిగా చేసిన శ్రీదేవి... ఆతర్వాత ఆయన పక్కన హీరోయిన్‌గానూ అదరగొట్టేశారు. ఇక ఏఎన్నార్‌తో పలు చిత్రాల్లో నటించిన ఈ అతిలోక సుందరి ఆతర్వాత కాలంలో నాగార్జునతో కూడా నటించడం గమనార్హం. నటనకు వయసు ప్రమాణికం కాదని అప్పట్లోనే తేల్చి చెప్పారు శ్రీదేవి. తన సినీ కెరీర్‌లో 250కి పైగా చిత్రాల్లో నటించిన ఆమె హఠాత్తుగా ఈలోకాన్ని విడిచి వెళ్లడం అభిమానులను తీవ్రంగా కలచివేస్తోంది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ... వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను"అని అన్నారు.



• అశ్రు నయనాలతో..

శ్రీదేవి భౌతిక కాయానికి నివాళులర్పించడానికి పలువురు సినీ ప్రముఖులు ముంబయికి చేరుకున్నారు. వెంకటేశ్, కమల్‌హాసన్, జయప్రద, కరిష్మాకపూర్, టబు, రణ్‌వీర్‌సింగ్, దీపికాపదుకునె, శృతిహాసన్, అక్షరహాసన్, సారిక, నాజర్, ఫరాఖాన్, కరణ్‌జోహార్, జెనీలియా తదితరులు ముంబయిలోని అనిల్‌కపూర్ ఇంటికి వెళ్లారు.



















వినోదమే ప్రధానంగా..



పూజా సింగ్, లక్కీ ఎకారి

భీచుపల్లి ఆంజనేయ ప్రొడక్షన్స్‌పై సాయి వెంకట్ సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం 'నందికొండ వాగుల్లో'. షఫీ, లక్కీ ఎకారి, సాయికిరణ్, పూజా సింగ్, మేఘన, జ్యోతిక యాదవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని సత్యనారాయణ దర్శకత్వంలో రఘు.హెచ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌ఛాంబర్‌లో జరిగింది. ట్రైలర్‌ను శివారెడ్డి విడుదల చేయగా... ఆడియోను ఎర్రల్ల శ్రీనివాస్ విడుదల చేశారు. ఆర్.కె.గౌడ్, సత్యానంద్, రాధా ప్రకాష్, హనుమంతరావు, రష్మీ ఠాగూర్ తదతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సత్యనారాయణ మాట్లాడుతూ "సెన్సార్ పూర్తిచేసుకొని 'ఎ' సర్టిఫికెట్ వచ్చిన ఈ చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్ చాలా ఎక్కువగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రమిది"అని అన్నారు. నిర్మాత రఘు మాట్లాడుతూ "దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకొచ్చిన ఆర్.కె.గౌడ్, సాయి వెంకట్‌లకు ధన్యవాదాలు"అని తెలిపారు. సాయి వెంకట్ మాట్లాడుతూ "అర్జున్‌రెడ్డి సినిమాలో ఉన్న దానికంటే కాస్త ఎక్కువగానే ఇందులో వినోదం ఉంటుంది. ముఖ్యంగా బి,సి సెంటర్లలో సినిమా బాగా ఆడుతుంది"అని పేర్కొన్నారు.



9,500 హై–రిస్క్ బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సంస్థల జాబితా విడుదల

న్యూఢిల్లీ : బ్యాంకులు, ప్రైవేటు కంపెనీలకు సంబంధించి వేలాది కోట్ల మోసం కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో దాదాపు 9500 ఎన్‌బిఎఫ్‌సి(బ్యాంకింగ్ యేతర ఆర్థిక సంస్థల) జాబితాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ విడుదల చేసింది. ఇవి అత్యంత ప్రమాదకర(హై రిస్క్) ఆర్థిక సంస్థలు అని పేర్కొంది. ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఈ జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాలో ఉన్న అనేక కంపెనీలు పిఎంఎల్ఎ(మనీ లాండరింగ్ నియంత్రణ చట్టం) నిబంధనలను అనుసరించడం లేదని గుర్తించినట్టు కేంద్రం పేర్కొంది. పిఎంఎల్ చట్టం సెక్షన్ 13 కింద నిబంధనలను పాటించని కంపెనీలపై జరిమానా విధించనున్నట్టు తెలిపింది. రికార్డులు నిర్వహించకపోయినా, సమాచారం అందించకపోయినా జరిమానా పడనుందని కేంద్రం స్పష్టం చేసింది. నిబంధనలను పాటించని బ్యాంకింగ్ యేతర ఆర్థిక సంస్థలపై జరిమానా రూ.10 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఉండొచ్చని ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ వెల్లడించింది. అక్రమంగా రద్దు చేసిన నోట్ల మార్పిడీ చేపట్టినందుకు ఇంతకుముందు ఐటి విభాగం, ఇడి(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్)లు గ్రామాలు, పట్టణాల్లో దర్యాప్తు చేశాయి.

ఏప్రిల్ నుంచి భారత్‌కు నోకియా కొత్త స్మార్ట్‌ఫోన్లు

బార్సిలోన(స్పెయిన్): మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ హెచ్ఎండి గ్లోబల్ ఏప్రిల్ నుంచి కొత్త నోకియా స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లోకి తీసుకురానుంది. కొత్త వెర్షన్ నోకియా 8110 మేలో భారత్‌కు రానుంది. మొత్తం ఫోన్లు ఏప్రిల్ నుంచి రానున్నాయని హెచ్ఎండి అధికార ప్రతినిధి భారత్ మీడియా తెలిపారు. బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్ కాంగ్రెస్ 2018(ఎండబ్ల్యుసి) వేదికగా కొత్తగా ఐదు డివైజ్‌లను హెచ్ఎండి గ్లోబల్ ఆవిష్కరించింది. అవి నోకియా 8 సిరొక్కో, నోకియా 7 ప్లస్, నోకియా 6(కొత్త వేరియంట్), నోకియా 1, పునరుద్ధరించిన నోకియా 8110 వంటివి ఉన్నాయి. నోకియాకు చెందిన ఐకానిక్ మోడల్ 8110.. ఈ మోడల్‌ను ప్రస్తుతం 4జి కనెక్టివిటీతో పాటు గూగుల్ అసిస్టెంట్, గూగుల్ మ్యాప్స్, గూగుల్ సెర్చ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి యాప్స్‌తో కంపెనీ ఆవిష్కరించింది. పన్నులు, ఇతర సబ్సిడీలను మినహాయించి నోకియా ఐకానిక్ మోడల్ అయిన 8110 ధరను 79 యూరోలుగా నిర్ణయించారు. మే నుంచి ఈ ఫోన్ అందుబాటులోకి రానుంది. కొత్తగా ఐదు డివైజ్‌ల ఆవిష్కరణతో తమ రేంజ్‌ను విస్తరించుకున్నామని తెలుపడం చాలా గర్వంగా ఉందని హెచ్ఎండి గ్లోబల్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ జుహో సర్వికాస్ అన్నారు. నోకియా 8 సిరొక్కోతో స్మార్ట్‌ఫోన్ డిజైన్‌లో కొత్త బెంచ్‌మార్కు తీసుకొచ్చామని అన్నారు. నోకియా 8 సిరొక్కో, నోకియా 7 ప్లస్, కొత్త నోకియా 6లు ఆండ్రాయిడ్ వన్ ఫ్యామిలీలో చేరాయని, గూగుల్ డిజైన్ చేసిన హై క్వాలిటీ సాఫ్ట్‌వేర్ అనుభవాన్ని వీటిలో తాము అందించినట్టు పేర్కొన్నారు. నోకియా 8 సిరొక్కో స్మార్ట్‌ఫోన్ ధర 749 యూరోలుగా కంపెనీ నిర్ణయించింది. అంటే భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ.60వేలుగా తెలుస్తోంది. అయితే భారత్‌లో ఈ స్మార్ట్ ఫోన్ ధర ఎంత ఉండొచ్చో కంపెనీ వెల్లడించలేదు.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34445.75	303.60	0.89%
నిఫ్టీ	10582.60	91.55	0.87%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29270	31304.81	0.21%
ముంబై	29910	31989.30	0%
ఢిల్లీ	29750	31818.18	0%
కోల్‌కతా	30080	32171.12	0.13%
కేరళ	28400	30374.33	0.35%
బెంగళూరు	28650	30641.71	0.17%
హైదరాబాద్	29230	31262.03	0.07%
గల్ఫ్	1407.18	1505.00	–0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	41600.00	41400.00	0.48
ముంబై	41600.00	41400.00	0.48
ఢిల్లీ	41600.00	41400.00	0.48
కోల్‌కతా	41600.00	41400.00	0.48
హైదరాబాద్	41600.00	41400.00	0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	360
వరంగల్	357	చిత్తూరు	388
విజయవాడ	358	చెన్నై	395
గోదావరి	358	బెంగళూరు	385

జిడిపి 7 శాతానికి పెరగనుంది..



- డిసెంబర్ ముగింపు త్రైమాసికంపై అంచనా
- ప్రభుత్వరంగ బ్యాంకుల నిరర్థక ఆస్తులపై ఆందోళన
- మోర్గాన్ స్టాన్లీ, రైటర్స్ పోల్ నివేదికలు వెల్లడి

బెంగళూరు : మూడో త్రైమాసికంలో(అక్టోబర్–డిసెంబర్)లో దేశీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగంగా ఉందని, వినియోగదారులు, వ్యాపారపరంగా.. అలాగే ప్రభుత్వం వ్యయాలను మరింతగా పెంచిందని మోర్గాన్ స్టాన్లీ, రైటర్స్ పోల్ రెండు నివేదికలు అంచనా వేశాయి. అయితే 2016 నవంబర్‌లో అనూహ్యంగా పెద్ద నోట్లను రద్దు చేయడం, అలాగే ఆందోళనల మధ్య 2017 జులైలో జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు వంటి అంశాలు జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)కి ఆటంకంగా మారాయని నివేదికలు తెలిపాయి. ఏడాది – ఏడాది ఆధారంగా చూస్తే జిడిపి వృద్ధి రేటు 7 శాతానికి పెరగనుందని, అంతకముందు సెప్టెంబర్ ముగింపు త్రైమాసికంలో 6.3 శాతంతో పోలిస్తే మెరుగవనుందని మోర్గాన్ స్టాన్లీ రీసెర్చ్ నోట్ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18) జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో భారత్ జిడిపి 6.3 శాతం నమోదవగా, అంతకుముందు తొలి త్రైమాసికంలో 5.7 శాతంతో పోలిస్తే పెరిగింది. మోర్గాన్ స్టాన్లీ ప్రకారం, పరిశ్రమ, సేవల రంగంలో వృద్ధి రేటు పెరగనుండగా, అదే సమయంలో వ్యవసాయ రంగంలో వృద్ధి క్షీణించనుంది. జివిఎ(గ్రాస్ వాల్యూ యాడెడ్) విధానంలో చూస్తే వృద్ధి రేటు గత ఏడాదిలో 6.1 శాతం నుంచి 6.7 శాతానికి పెరగనుందని సంస్థ వెల్లడించింది. కార్పొరేట్ రెవెన్యూ ట్రెండ్‌ను చూస్తే డిసెంబర్ త్రైమాసికంలోనూ మెరుగదల ఉంది. ద్విచక్ర వాహన అమ్మకాలతో డిసెంబర్ త్రైమాసికంలో వేగవంతమైన వృద్ధి రేటు నమోదైంది. అలాగే వస్తువుల ఎగుమతుల వృద్ధి మరింతగా రెండంకెల స్థాయికి పెరిగింది. 'తాజా త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం పటిష్ఠంగా ఉంది. ప్రైవేటు వినిమయ డిమాండ్ వేగంగా వృద్ధి చెందుతోంది.

ఈ కారణంగా వాహన అమ్మకాల్లో బలమైన వృద్ధి కనిపిస్తోంద'ని ఐసిఐసిఐ సెక్యూరిటీస్ పిడి ఆర్థికవేత్త అభిషేక్ ఉపాధ్యాయ్ అన్నారు. డీమానిటైజేషన్(నోట్ల రద్దు)తో మందగించిన కన్‌స్ట్రక్షన్, రియల్ ఎస్టేట్‌లు ప్రస్తుతం పుంజుకుంటున్నాయి. రూపాయి బలపడడంతో ప్రపంచంలో ఏడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ఎగుమతులపై ప్రభావం చూపింది. గతేడాదిలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 6.5 శాతం బలపడింది. అయితే రూపాయి ఈ ఏడాదిలో 1 శాతం డౌన్ అయింది.

ఆందోళనకరంగా బ్యాంకింగ్ ఎన్‌పిఎ

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) పెరగడం పట్ల తాజా రైటర్స్ పోల్‌లో ఆర్థిక నిపుణులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించకపోయినట్లయితే దేశీయ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే అవకాశముందని వారు అభిప్రాయపడ్డారు. వీరి ఆందోళనలకు ప్రధాన కారణంగా తాజాగా బయటపడిన పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో రుణాల మోసం.. ఇది బ్యాంకింగ్ చరిత్రలో అతి పెద్ద కుంభకోణంగా నిలిచింది. ఈ కుంభకోణం ఇతర ప్రభుత్వరంగ బ్యాంకులపైనా పడింది. ఇప్పటికే చాలా బ్యాంక్‌లు మొండి బకాయిలు, ఇతర సమస్యలను వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. బ్యాంక్ బ్యాలెన్స్ షీట్లపై ఒత్తిడి నేపథ్యంలో క్లీనప్ ప్రక్రి



యను బ్యాంకులు వేగవంతం చేయగా, వీటికి మరి కొంత సమయం పట్టే అవకాశముందని, ఇది పూర్తయితే ఆర్థిక వ్యవస్థ మరింతగా మెరుగ్గా ఉండనుందని ఉపాధ్యాయ్ అన్నారు.

4జి వోల్ట్ సేవల కోసం నోకియాతో బిఎస్ఎన్ఎల్ ఒప్పందం

న్యూఢిల్లీ: 4జి వోల్ట్(వాయిస్ ఓవర్ ఎల్‌టిఇ) సేవలను ప్రారంభించేందుకు నోకియాతో ప్రభుత్వరంగ టెలికామ్ సంస్థ బిఎస్ఎన్ఎల్ ఒప్పందం చేసుకుంది. ఈశాన్య, దక్షిణ భారతీయ ప్రాంతాల్లో వోల్ట్ సేవలను ప్రారంభించేందుకు బిఎస్ఎల్ఎల్ ప్రయత్నిస్తోంది. దీని భాగంగానే ఇరు సంస్థలు నెట్‌వర్క్ ఆధునీకరణ ఒప్పందం చేసుకున్నాయని అధికారులు తెలిపారు. నోకియా భారత్‌లోని 10 టెలికాం సర్కిళ్లలో తన టెక్నాలజీని వినియోగిస్తోంది. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, గోవా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి.



అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలను వినియోగించుకొని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందజేస్తుందని సంస్థ ఛైర్మన్, ఎండి అనుపమ్ శ్రీవాస్తవ తెలిపారు. నోకియాకు చెందిన సింగిల్ రేడియో యాక్సెస్ నెట్‌వర్క్‌ను వినియోగించుకొని 2జి, 3జి, 4జి వినియోగదారులకు చౌకగా సేవలను అందిస్తామని ఆయన చెప్పారు. అలాగే విఒఎల్‌టిఇ టెక్నాలజీని వినియోగించుకొని 4జి వినియోగదారులకు హెచ్‌డి క్వాలిటీ వాయిస్ సేవలను అందజేస్తుంది. 2017లో నోకియా, బిఎస్ఎన్ఎల్‌లు మరో ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని ప్రకారం భారత్‌లో 5జి సేవలకు అవసరమైన టెక్నాలజీని అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని ఆయన వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం భారతీ ఎయిర్‌టెల్, హువాయి కంపెనీలు కలిసి 5జి నెట్‌వర్క్ సేవలను ట్రయల్ చేపట్టాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ పరీక్షలు నిర్వహించాయి.

10,550 మార్క్‌ను దాటిన నిఫ్టీ



ముంబై : వరుసగా రెండో సెషన్ దేశీయ ఈక్విటీ మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయంగా సానుకూలం అంశాలు, కొన్ని షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సోమవారం సెన్సెక్స్ మరో 300 పాయింట్లు లాభపడింది. డిసెంబర్ ముగింపునాటి త్రైమాసికంలో జిడిపి, అలాగే ద్రవ్యలోటు, ఉత్పత్తిరంగ డేటా వంటి కీలక స్థూల ఆర్థిక గణాంకాల విడుదలకు ముందు దేశీయ ఇన్వెస్టర్లు సానుకూల దృక్పథంతో ఉన్నారు. ఫిబ్రవరి 5 నుంచి రెండు సూచీలు అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. నిఫ్టీ 50 సూచీలో 38 లాభపడగా, మిగతా 12 స్టాక్స్ నష్టపోయాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి లాభాల్లోనే ఉన్న సూచీలు.. మిడ్ సెషన్ సమయానికి మరింతగా లాభాలను పెంచుకున్నాయి. ఐటి, టెక్నాలజీ, హెల్త్ కేర్ మినహా ఇవాళ అన్ని రంగాలకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆటో మొబైల్, క్యాపిటల్ గూడ్స్ రంగాల్లో కొనుగోళ్లు జోరుగా సాగాయి. 304 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ 34,446 దగ్గర ముగిసింది. 92 పాయింట్లు లాభపడిన నిఫ్టీ 10583 వద్ద స్థిరపడింది. మార్కెట్ మూడు వారాల గరిష్టానికి చేరుకుంది.

4 శాతం పైగా పెరిగిన మారుతి

ఐటీ, టెక్నాలజీ, హెల్త్‌కేర్, ఎఫ్ఎంసిజి రంగాలు మాత్రమే నష్టపోయాయి. ఆటోమొబైల్ 600 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 350 పాయింట్లకు పైగా పెరిగింది. ఇవాల్టి ట్రేడింగ్లో స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లకు కూడా కొనుగోళ్ల మద్దతు లభించడం హైలైట్‌గా చెప్పుకోవాలి. నిఫ్టీలో మారుతి సుజుకి 4 శాతం పైగా పెరిగి అత్యధికంగా లాభపడింది. టాటా మోటార్స్, ఎల్ అండ్ టి, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యుపిఎల్ షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మరోవైపు సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టిసిఎస్, విప్రో షేర్లు నష్టపోయాయి.

నీరవ్ విదేశీ ఆస్తుల వివరాలివ్వండి

ముంబై కోర్టును ఆశ్రయించిన ఇడి

ముంబై: రూ.11 వేల కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసం కుంభకోణంపై విచారణ చేపడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) నీరవ్ మోడీ విదేశీ వ్యాపారాలు, ఆస్తుల వివరాలను అందించాలని సోమవారం ముంబై కోర్టును కోరింది. నీరవ్ విదేశీ వ్యాపారాల సమాచారం కోసం ఎల్ఆర్ఎస్(లెటర్స్ రోగేటరీ) జారీ కోసం ఇడి విజ్ఞప్తి చేసింది. రికవరీ




కోసం మనీ లాండరింగ్ నియంత్రణ చట్టం కింద ఎల్ఆర్ జారీ దరఖాస్తు.. హాంకాంగ్, అమెరికా, యుఎఇ, దక్షిణాఫ్రికా, సింగపూర్‌లో నీరవ్ కంపెనీల సమాచారం కావాలని, విచారణలో భాగంగా ఇది ఎంతో అవసరమని కోర్టుకు ఇడి విన్నవించింది. లెటర్స్ రోగేటరీ జారీ కోసం పిఎంఎల్ఎ కోర్టును ఇడి ఆశ్రయించింది. స్పెషల్ ప్రాసిక్యూటర్ హితెన్ వెనెగాంకర్ వాదనలను జడ్జి ఎంఎస్ అజ్మి విన్నారు. డైమండ్ ఆర్ యుఎస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్, ఫైర్‌స్టార్ డైమండ్ సహా నీరవ్ మోడీ స్థాపించిన వివిధ కంపెనీల వివరాలను ఇడి కోరింది. ఈ కంపెనీలను డైమండ్ తయారీ, వాటిని పాలిష్ చేసి, నగలుగా తయారు చేసి విక్రయించేందుకు గాను నీరవ్ ఈ సంస్థలను స్థాపించినట్టు ఇడి పేర్కొంది. అయితే వాటి వివరాలను అందజేయాలని కోర్టును కోరుతోంది. ఈ కంపెనీలను నీరవ్ మోడీ, ఫైర్‌స్టార్ పేరిట ఏర్పాటు చేసినట్టు ఇడి పేర్కొంది. ఈ విధంగా నీరవ్ మోడీ తన వ్యాపారాన్ని వివిధ దేశాలకు విస్తరించారు. హాంకాంగ్, అమెరికా, బ్రిటన్, యుఎఇ, దక్షిణాఫ్రికా, సింగపూర్ వంటి దేశాల్లో వ్యాపారాలను విస్తరించారు. వీటి కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి నీరవ్ సంస్థలకు అనుకూలంగా ఎల్ఒయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్)ను అక్రమంగా జారీ చేయించుకోవడం ద్వారా భారీగా నిధులను పొందారు. వీటికి సంబంధించి బ్యాంక్ రికార్డుల్లో ఎల్ఒయు ఇచ్చినట్టుగా లేదని, అక్రమంగా వీటిని పొందారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టుకు వివరించింది.

తొలి రోజు హెచ్‌జి ఇన్‌ఫ్రా 11 శాతం సబ్‌స్క్రైబ్

న్యూఢిల్లీ: హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) తొలి రోజు 11 శాతం సబ్‌స్క్రైబ్ అయింది. ఎన్ఎస్ఇ గణాంకాల ప్రకారం.. తొలి రోజు సోమవారం సంస్థ 13,50,360 షేర్లకు బిడ్‌లను అందుకుంది. మొత్తం షేర్లు 1,21,37,070 షేర్లకు గాను 11 శాతం సబ్‌స్క్రైబ్ అయ్యాయని కంపెనీ వెల్లడించింది. సంస్థాగతయేత ఇన్వెస్టర్లు 4 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లు 20 శాతం సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు.

నిధుల సమీకరణలో మరిన్ని ఐపిఒలు

ఇంకా మరికొన్ని సంస్థలు ఐపిఒకు వస్తున్నాయి. పబ్లిక్ ఆఫర్లకు వస్తున్న కంపెనీల్లో హిందూస్తాన్ ఏరోనాటిక్స్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, బార్బెక్యూనేషన్ హాస్పటాలిటీ, ఫ్లెమింగో ట్రావెల్ రిటైల్ వంటి సంస్థలు ఉన్నాయి. ప్రస్తుతం ఐపిఒకు వస్తున్న కంపెనీలు మరో ముఖ్యవిషయాన్ని కూడా పరిగణలోకి తీసుకున్నాయి. ఈ ఐపిఒల మొత్తం విలువ రూ.25వేల కోట్లకు పైగా ఉంటుందని తెలుస్తోంది. మూలధనం పెంచుకోవడానికి, వ్యాపార విస్తరణకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు ఆ కంపెనీలు సెబీకి తెలిపినట్టు సమాచారం.. ప్రస్తుతం ఉన్న షేర్ హోల్డర్లకు లిక్విడిటీ పెరిగే విధంగా వాటాలను స్టాక్ మార్కెట్లలో నమోదు చేయడం, అలాగే బ్రాండ్ విలువను మరింత పెంచుకునేందుకు ఈ పబ్లిక్ ఆఫర్‌కు వస్తున్నట్టు తెలుస్తోంది. ఐపిఒల్లో ప్రభుత్వ రంగ కంపెనీలు కూడా ఉన్నాయి. ఇప్పటికే బార్బెక్యూ నేషన్ హాస్పటాలిటీస్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఐఆర్ఇడిఎ వంటి సంస్థలకు ఇప్పటికే సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మిగిలిన 20 కంపెనీలకు సంబంధించి కొన్ని అనుమతులు రావాల్సి ఉంది. అనుమతుల కోసం ఎదురు చూస్తున్న కంపెనీల్లో ఆర్ఐటిఇఎస్, మిథాని, బంధన్ బ్యాంక్, ఇండోస్టార్, నజారా టెక్నాలజీస్, రూత్ మొబైల్ వంటి సంస్థలు ఉన్నాయి. ఇప్పటికే సెకండరీ మార్కెట్‌లో వీటికి అత్యధిక విలువ లభించడంతో ఐపిఒకు మొగ్గు చూపుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే న్యూజెన్ టెక్నాలజీస్, అంబర్ ఎంటర్ ప్రైజెస్ ఇండియాలు మార్కెట్‌లోకి వచ్చాయి. 2017లో మొత్తం 36 కంపెనీలు రూ.67వేల కోట్లను సమీకరించాయి. ఈ ఏడాదిలోనూ ఇంకా ఐపిఒలు వచ్చే అవకాశం ఉంది.



టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
మారుతి సుజుకి	9,055.00	8,750.05	9,005.35	8,698.80	306.55	3.52
టాటామోటార్స్	373.50	362.00	372.05	360.20	11.85	3.29
లార్సెన్	1,347.70	1,306.00	1,344.25	1,301.70	42.55	3.27
యాక్సిస్ బ్యాంకు	554.40	539.00	552.30	536.65	15.65	2.92
ఇండస్‌ఇండ్‌బ్యాంకు	1,700.00	1,648.00	1,691.30	1,643.50	47.80	2.91
యుపిఎల్	725.80	706.00	720.50	700.55	19.95	2.85
జీఎంటర్‌టైన్	587.30	569.00	585.45	569.95	15.50	2.72
బజాజ్ ఫైనాన్స్	1,679.80	1,636.50	1,674.95	1,633.40	41.55	2.54
ఎంఅడ్ఎం	737.00	719.25	735.40	718.65	16.75	2.33
ఐఒసి	381.80	370.10	376.70	368.40	8.30	2.25

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
సన్‌ఫార్మా	571.90	553.35	555.95	569.65	13.70	2.40
ఇన్ఫోసిస్	1,155.05	1,134.35	1,138.60	1,155.65	17.05	1.48
టెక్ మహీంద్ర	627.45	611.05	612.45	621.45	9.00	1.45
టిసిఎస్	3,089.95	3,021.20	3,031.70	3,075.80	44.10	1.43
విప్రో	295.70	290.40	291.60	295.00	3.40	1.15
హెచ్‌సిఎల్ టెక్	965.10	943.05	946.05	955.60	9.55	1.00
సిప్లa	598.30	588.75	590.10	595.65	5.55	0.93
ఐటిసి	269.50	266.00	266.55	269.05	2.50	0.93
ఎస్‌బిఐ	280.00	273.85	274.45	276.05	1.60	0.58
భారతి ఎయిర్‌టెల్	430.00	420.85	423.15	425.55	2.40	0.56

మాజీ సెక్రెటరీ సుబ్రమణియన్ కన్నుమూత



న్యూఢిల్లీ : కేంద్ర మాజీ కేబినెట్ కార్యదర్శి టిఎస్ఆర్ సుబ్రమణియన్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతి చెందినట్లు ఐఎఎస్‌ల సంఘం ప్రకటించింది. అనారోగ్యంతో బాధపడుతున్న కేబినెట్ మాజీ సెక్రెటరీ కన్నుమూసినట్లు తెలిపారు. దేశం అత్యుత్తమ అధికారిని కోల్పోయిందని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియచేస్తున్నట్లు, విధి నిర్వహణలో ఆయన సంవిధానాన్ని మార్గదర్శకాలను అధికార యంత్రాంగం విధిగా పాటిస్తుందని సంఘం తెలిపింది.వృత్తిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ, ఎప్పటికప్పుడు విలువైన ఆలోచనల సంయమనానికి దిగుతూ ఆయన పదవీకాలంలో సమున్నత ప్రమాణాలను పాటించారని ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. సుబ్రమణియన్ వివిధ కమిటీలకు అధ్యక్షత వహించారు. నూతన విద్యా విధానాల అమలుకు కృషి చేశారు. సోమవారం సాయంత్రం న్యూఢిల్లీలోని లోధీ రోడ్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. కేబినెట్ మాజీ సెక్రెటరీ టిఎస్ఆర్ సుబ్రమణియన్ మృతి పట్ల ప్రధాని మోడీ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ఆయన ఎప్పటికప్పుడు సముచిత రీతిలో స్పందించారని, ఆయన తమ రచనలతో కూడా ప్రఖ్యాతి వహించారని ప్రధాని ప్రశంసించారు. 79 సంవత్సరాల సుబ్రమణియన్ సోమవారం ఇక్కడ మృతి చెందారు. ఆయన 1996 మార్చి నుంచి 1998 వరకూ పదవీ బాధ్యతల్లో ఉన్నారు.

గుజరాత్‌లో లారీ, జీపు ఢీకొని 8 మంది మృతి

అహ్మదాబాద్: గుజరాత్‌లో సబర్‌కాంత జిల్లాలోని విజయనగర తాలూకాలోని కుండ్ల గ్రామంలో సోమవారం వేగంగా వస్తున్న లారీ, జీపును ఢీకొంది.దాంతో ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. అనే క మంది గాయాలపాలయ్యారని పోలీసులు చెప్పారు.ఆలుగడ్డల పొలంలో పనిచేయడానికి 31 మంది వ్యవసాయ కూలీలను ఖేద్‌బ్రహ్మ నుంచి ఈదర్‌కు జీపులో తీసుకువెళుతున్నప్పుడు వ్యతిరేక దిశలో వేగంగా వచ్చిన లారీ ఢీ కొంది.ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. ఖేద్‌బ్రహ్మ, హిమ్మత్‌నగర్‌లలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మరి ఐదుగురు చనిపోయారని పోలీసు అధికారి చెప్పారు.చనిపోయిన ఎనిమి ది మంది నవభాగ గ్రామానికి చెందినవారు.కాగా లారీ డ్రైవరు అక్కడి నుంచి పారిపోయాడు. అతడి కోసంగాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

తిరుపూర్‌లో రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి



కోయంబత్తూర్: తిరుపూర్ జిల్లాలోని కంకేయం వద్ద తమ కారు బోల్తా కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. సోమవారం మధ్నాహ్నం పళని ఆలయాన్ని ఆ కుటుంబ సభ్యులు దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటనకు గురయ్యారని పోలీసులు తెలిపారు. తిట్టుపారైకు సమీపించగానే కారు డ్రైవరు కంట్రోల్ తప్పడంతో కారు బోల్తా కొట్టింది. ఆ కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు నలుగురు అక్కడికక్కడే చనిపోయారని కూడా పోలీసులు తెలిపారు. దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు.

ఓ గవర్నర్ లైంగిక వేధింపులా? తెలియదే

న్యూఢిల్లీ : దక్షిణాది రాష్ట్రాల గవర్నర్ ఒకరు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే వార్తలపై కేంద్ర హోం మంత్రిత్వశాఖ స్పందించింది. గవర్నర్ ఒకరు మహిళా సిబ్బందిని లైంగికంగా వేధిస్తున్నట్లు తమకు ఏ విధమైన ఫిర్యాదు అందలేదని మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ విధంగా జరుగుతున్నట్లు ఫిర్యాదు అందలేదని, ఈ పరిణామం గురించి తమకు తెలియదని మంత్రిత్వశాఖ ప్రతినిధి సోమవారం ఒక ప్రకటన వెలువరించారు. లైంగికంగా తమను గవర్నర్ వేధిస్తున్నట్లు, లైంగిక కోర్కెలు తీర్చాలని కోరుతున్నట్లు రాజ్‌భవనలోని ఉద్యోగినులు పేర్కొంటున్నట్లు పత్రికలలో వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ గవర్నర్ ఏ రాష్ట్ర గవర్నర్ అనేది స్పష్టం కాలేదు. ఉద్యోగినుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఆ గవర్నర్‌పై భద్రతా సంస్థలు పరిశీలన జరుపుతున్నట్లు కూడా మీడియా తెలిపింది. గత ఏడాదే లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి మేఘాలయా గవర్నర్ వి షణ్ముగనాథన్ పదవికి రాజీనామా చేశారు. ఈ గవర్నర్ రాజ్‌భవన్‌ను చివరికి యువతుల క్లబ్‌గా మార్చారని, గౌరవప్రదమైన పదవికి మచ్చ తెస్తున్నారని రాజ్‌భవన్‌కు చెందిన వంద మంది సిబ్బంది అప్పటి రాష్ట్రపతికి, ప్రధానికి లేఖలు రాశారు. జోక్యం చేసుకోవాలని కోరారు. గవర్నర్ తన ఇష్టారాజ్యంగా కొందరు యువతులను రాజ్‌భవనకు రప్పించుకుంటున్నాడని, పలువురు నేరుగా పడకగది వరకూ వెళ్లుతున్నారని పలు అక్రమాలు జరుగుతున్నాయని తీవ్రస్థాయిలో పేర్కొంటూ ఉద్యోగులు లేఖలు రాశారు. దీనితో ఆ రాష్ట్ర గవర్నర్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు ఇదే తరహాలో దక్షిణాది గవర్నర్ ఒకరు వ్యవహరిస్తున్నారనే వార్త సంచలనానికి దారితీసింది.

జార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

రాంచీ: జార్ఖండ్‌లోని పలము జిల్లాలో సోమవారం భద్రతా దళాలకు, నక్సల్స్‌కు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులతో సహా నలుగురు నక్సలైట్లు మృతి చెందారు. ఈ ఘటన లాలాఘాటి నౌదిహ ప్రాంతంలో ఉదయం 8.30 గంటలకు జరిగింది. సిఆర్‌పిఎఫ్ 134వ బెటాలియన్ బృందం మావోయిస్టుల గాలింపును చేపట్టినప్పుడు ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని అధికారులు తెలిపారు. నలుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని స్థానిక నక్సల్ గ్రూప్ సబ్‌జోనల్ కమాండర్ రాకేశ్ భుయియన్, కేడర్ సభ్యులు లల్లూ యాదవ్, రింకీ, రూబీలుగా గుర్తించారు. వారిపై రూ. 5 లక్షల రివార్డు ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్(ఎస్ఎల్ఆర్), ఐదు మ్యాగజైన్లు,219 తూటాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఆప్ ఎంఎల్‌ఎల రహస్య పత్రాలను కోర్టుకు సమర్పించిన ఇసి

న్యూఢిల్లీ: లాభదాయక పదవులు నిర్వహిస్తున్నారన్న కారణంగా అనర్హత ఏటుపడిన 20 మంది ఆప్ ఎంఎల్‌ఎల విచారణలో కొత్త మలుపు చోటుచేసుకుంది. భారత ఎన్నికల సంఘం(ఇసి) ఢిల్లీ హైకోర్టులో వారికి సంబంధించిన రహస్యపత్రాలను సమర్పించింది. వాటిని ఎంఎల్‌ఎలకు ఇవ్వరాదని తెలిపింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, చందర్ శేనఖర్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అమిత్ శర్మ వాదిస్తూ కొన్ని రహస్యపత్రాలను, వ్యక్తిగత నోటింగ్‌లు ఉన్న పత్రాలను సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన ఆ రహస్య పత్రాలను సీల్డ్ కవరులో కోర్టుకు సమర్పించారు. ఎన్నికల సంఘం సిఫార్సులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపాక అనర్హత వేటు పడిన 20 మంది ఆప్ ఎంఎల్‌ఎలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల సంఘం,ఇతర పక్షాల వాదనలు సోమవారం ముగింపునకు రాలేదు. మంగళవారం మళ్లీ వాదనలు కొనసాగనున్నా యి. వారిపై కేంద్రం అనర్హత ప్రకటనపై జనవరి 24న స్టే ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. అయితే వారి ఖాళీల్లో ఎన్నికలు నిర్వహించే తేదీలు ప్రకటించకుండా ఎన్నికల సంఘాన్ని కోర్టు నిరోధించింది. 20 మంది ఆప్ ఎ ంఎల్‌ఎల అనర్హత సిఫార్సులను జనవరి 19న ఎన్నికల సంఘం చేసింది. ఆ మరునాడే రాష్ట్రపతి దానిని ఆమోదించారు.

రైళ్ళలో బెర్త్‌ల రిజర్వేషన్లలో మహిళలకే పెద్ద పీట

న్యూఢిల్లీ : రైళ్ళలో మహిళల కోసం నిర్దేశించిన బెర్తులు ఖాళీగా ఉంటే, వాటిని ఇతరులకు కేటాయించడంలో మొదటి ప్రాధాన్యం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న మహిళలకు,ఆ తర్వాతి ప్రాధాన్యం వయో వృద్ధులకు ఇవ్వాలని రైల్వే శాఖ నిర్ణయించింది. వెయిటింగ్ లిస్ట్‌లో మహిళలు, వృద్ధులు లేకపోతే, ఈ ఖాళీ బెర్తులను ఇతర మహిళలు, సీనియర్ సిటిజెన్లకు ఇచ్చే అధికారం టికెట్ చెకింగ్ సిబ్బందికి ఉంటుందని రైల్వే బోర్డు పేర్కొంది. మహిళల కోటాలో బెర్తులను బుక్ చేసుకోవడానికి రిజర్వేషన్ చార్ట్ ప్రిపేర్ అయ్యే వరకు అవకాశం ఉంది. ఈ కోటాలో కేటాయించిన బెర్తులన్నీ భర్తీ కాకుండా, కొన్ని మిగిలిపోతే, ఆ మిగిలిపోయిన బెర్తులను వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులకు స్త్రీ, పురుష భేదం లేకుండా కేటాయిస్తున్నారు. ఈ విధానాన్ని మార్చుతూ మహిళల కోటాలో ఖాళీ బెర్తులను మొదట మహిళలకు, ఆ తర్వాత వయో వృద్ధులకు కేటాయించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను ఈ నెల 15న రైల్వే బోర్డు జారీ చేసింది.

ఎల్‌ఒసి వెంబడి వేలాది ఉగ్రవాదులు

లెఫ్టినెంట్ జనరల్ భట్ వెల్లడి ... తిప్పికొట్టేందుకు చర్యలు



శ్రీనగర్ : నియంత్రణ రేఖ దాటి భారత్‌లో చొరబడేందుకు ఉగ్రవాదులు భారీ సంఖ్యలో వేచి ఉన్నారని వెల్లడైంది. ఈ చొరబాటు యత్నాలపై తమకు నిర్దిష్ట సమాచారం అందిందని శ్రీనగర్‌లోని చినార్ సైనికదళాల విభాగం ప్రధానాధికారి లెఫ్టినెంట్ జనరల్ ఎకె భట్ తెలిపారు. కశ్మీర్‌లో కల్లోలం సృష్టించేందుకు, కాల్పుల విరమణను ఉల్లంఘించి అశాంతిని నెలకొల్పేందుకు కుట్ర జరుగుతోందని ఈ అధికారి వెల్లడించారు. ఎల్‌ఒసికి ఆవల పాకిస్థాన్ భూభాగంలో పలువురు ఉగ్రవాదులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ సారి తక్కువ మంచుపడుతూ ఉండటంతో అదును చూసుకుని టెర్రరిస్టులు చొరబడే ప్రమాదం ఉందని భట్ చెప్పారు. వీటిపై తమకు నిర్దిష్ట సమాచారం అందడంతో నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, పాకిస్థాన్ వైపు నుంచి భద్రతా బలగాలు కాల్పులు జరిపినప్పుడల్లా ఉగ్రవాదుల చొరబాట్లు జరుగుతూ ఉంటాయని, ఇప్పటి పరిణామాలతో దీనిని గుర్తించామని భట్ వివరించారు. జమ్మూ కశ్మీర్ లైట్ ఇన్‌ఫెంట్రీ సెంటర్‌లో జరిగిన కవాతు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కుప్వారా, తంగ్‌ధార్ ప్రాంతా ల్లో జరుగుతున్న కాల్పులు చొరబాట్లకు సంకేతం అన్నారు. ఎల్‌ఒసి వెంబడి దాదాపు 3040 మంది వరకూ ఉగ్రవాదులు బృందాలుగా చీలిపోయి, సరిహద్దులు దాటి వచ్చేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. లెపా వ్యాలీ నుంచి మండల్ ప్రాంతానికి వచ్చేందుకు సమయం కోసం చూస్తున్నట్లు నిఘా సమాచారం అందిందని తెలిపారు. ఈ ప్రాంతం రామ్‌పూర్‌లోని 161బ్రిగేడ్‌కు సమీపంలోనే ఉండటంతో భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పాకిస్థాన్ తరచూ కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడుతోందని, ఈ కవ్వింపు చర్యలకు తమ దళాలు తగు రీతిలో సమాధానం ఇస్తున్నాయని సైనికాధికారి వెల్లడించారు. రాష్ట్రంలో శనివారం వేర్వేరు చోట్ల మిలిటెంట్లు ఇద్దరు పోలీసులను చంపివేసిన ఘటనపై లెఫ్టినెంట్ జనరల్ స్పందించారు. కొన్ని చెదరుమదురు ఘటనలకు దిగి మిలిటెంట్లు సంచలనాలకు పాల్పడాలనుకుంటున్నట్లుగా భావించాల్సి వస్తోందన్నారు. స్థానిక యువత ఉగ్రవాదం వైపు మళ్లడం గురించి విలేకరులు ప్రశ్నించారు. ఇది సరైన పద్ధతి కాదని యువతరం భద్రతా బలగాలలో చేరాలని, దేశాన్ని బలపరిచే ఇతర వృత్తులలో కూడా చేరవచ్చునని స్పష్టం చేశారు.

లోక్‌పాల్‌పై ఎందుకీ జాప్యం ?

- అవినీతిపై ఏమిటీ మౌనం
- ప్రధాని మోడీకి రాహుల్ ప్రశ్నలు ..



రామదుర్గ (కర్నాటక) : అవినీతిని అరికట్టేందుకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోడీని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. అవినీతి ఆటకట్టుకు ఉద్దేశించిన లోక్‌పాల్ నియామకంలో జాప్యం ఎందుకు జరుగుతోందని నిలదీశారు.ప్రధాని మోడీ దేశంలోని అత్యంత సంపన్నుల కొమ్ముకాస్తున్నారని, వారి అవినీతికి వంతపాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకలో సోమవారం కొన్ని సభలలో రాహుల్ ప్రసంగించారు.పిఎన్‌బి ఇతర బ్యాంకులలో సాగిన మోసాలపై ప్రధాని ఎందుకు స్పందించడం లేదని, ఈ మౌనం అర్థం ఏమిటని రాహుల్ ప్రశ్నించారు.స్వరాష్ట్రం గుజరాత్‌లో మోడీ లోకాయుక్తను తీసుకురాలేదని, ఇక దేశానికి ప్రధాని అయి నాలుగేళ్లు అవుతోన్న ఇప్పటికీ లోక్‌పాల్ నియామకం జరగలేదని విమర్శించారు. దేశానికి చౌకీదారును అని ప్రకటించుకున్న మోడీ ఇప్పటివరకూ కుంభకోణాలను ఎందుకు పసికట్టడంలేదని ప్రశ్నించారు. బిజెపి అధ్యక్షులు అమిత్ షా కుమారుడు జయ్ షా కంపెనీ టర్నోవర్ పెరిగిందని దీనికి ఏం చెపుతారని అన్నారు. బిజెపికి చెందిన మాజీ సిఎం యడ్యూరప్ప, నలుగురు మాజీ మంత్రులు బిజెపి అధికారం సమయంలో అవినీతికి పాల్పడి జైలుపాలయ్యారని రాహుల్ చెప్పారు. కర్నాటకలోని ఉత్తర ప్రాంతంలో మూడు రోజుల పర్యటన రెండో దశలో రాహుల్ సభలు జరిగాయి. ప్రసంగాలు దంచడానికి మిమ్మల్ని ప్రజలు ప్రధానిగా చేశారని అనుకుంటున్నారా? పని చేయని ప్రసంగాలెందుకు? మాటలు కాదు చేతలు ముఖ్యం అని పేర్కొన్నారు. నీరవ్ మోడీ కంపెనీ దోచుకున్న దాదాపు రూ 22వేల కోట్లు దేశ రైతులు, కార్మికులవని పేదలవని, అయితే ఇప్పటికీ ఈ దోపిడిపై ఈ చౌకీదారు కిమ్మనడం లేదని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.గబ్బర్ సింగ్ టాక్స్ (జిఎస్‌టి)ను తీసుకువచ్చిన ప్రధాని సామాన్యుల జేబుల్లోని దంతా దోచుకున్నారని, లక్షలాది వ్యాపార సంస్థలు మూతపడ్డాయని,లక్షలాది మంది ఇక్కట్లకు గురయ్యారని తెలిపారు.

రాహుల్ గాంధీపై ధ్వజమెత్తిన అమిత్ షా



కలబురగి(కర్నాటక): పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) కుంభకోణంలో ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించడంపై బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా సోమవారం ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వం మాదిరిగా ఏ ఇతర ప్రభుత్వం మోసాలకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోలేదన్నారు. కర్నాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వం మూడు డిలతో నడుస్తోందన్నారు. ‘ఆ మూడు డిలు ఒకటి దోఖా(మోసం), రెండోది దాదాగిరి(గూండాయిజం),మూడోది డైనస్టిక్ పొలిటిక్స్(వంశ రాజకీయాలు)’అని పేర్కొన్నారు. పిఎన్‌బి కుంభకోణంలో ఇడి, సిబిఐ తగిన చర్యలు చేపట్టాయన్నారు. ఉత్తర కర్నాటకలోని బాగల్‌కోట్, విజపురా జిల్లాల్లో బహిరంగ ర్యాలీలలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ అవినీతిపై ప్రధాని మోడీపై విమర్శలు చేశారు. దేశానికి కాపాలాదారుగా(వాచ్‌మెన్) ఉంటానన్న మోడీ పిఎన్‌బి కుంభకోణంపై ‘మౌనం’గా ఉన్నారని రాహుల్ విమర్శించడంపై అమిత్ షా ప్రతిస్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. ‘ఇప్పటికే ఇడి అక్రమ నగదు చలామణి నివారణ కింద చర్యలు చేపట్టింది. దీనికి ముందు ఈ నెల ఆరంభంలో సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది’ అని అమిత్ షా అన్నారు. ‘సిద్ధరామయ్య ప్రభుత్వం, అవినీతి పర్యాయపదాలుగా మారాయి’ అని ఆయన ఆరోపించారు. ఆధ్యాత్మిక హోదా కింద సిద్ధరామయ్య సమూహాన్ని చీల్చే కుటిల రాజకీయాలు చేస్తోందన్నారు. ఒకవేళ కర్నాటకలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే లింగాయత్‌లకు ఇచ్చే ప్రత్యేక ఆధ్యాత్మిక హోదా ప్రతిపాదనను రద్దు చేస్తామన్నారు. కర్నాటకలో లింగాయత్‌లు/వీరశైవులది ప్రభావమంతమైన పెద్ద సమూహం.వారు ప్రత్యేక మత హోదాను కోరుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నవారు కాంగ్రెస ఎంపీ మల్లికార్జున ఖర్గే నియోజకవర్గానికి వెళ్ళి చూస్తే అర్థమవుతుందన్నారు. కర్నాటకలో ఏ ప్రాంతం కూడా ఖర్గే నియోజకవర్గం కలబురగీ అంత వెనుకబడిలేదన్నారు. అక్కడ వంశరాజకీయాలు కొనసాగుతున్నాయని, మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే రాష్ట్ర మంత్రిగా ఉన్నారన్నారు.‘ఎన్నికల్లో బిజెపి గెలిస్తే, బిజెపి ప్రభుత్వం ఏర్పడితే చేసే మొదటి పని స్థానిక చక్కెర మిల్లులను తిరిగి తెరుస్తాం’ అని అమిత్ షా చెప్పారు.

చంద్రుడిపై ఇళ్ల నిర్మాణానికి ఇస్రో ప్రణాళికలు



బెంగళూరు : చంద్రుడిపై ఇళ్లు నిర్మించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. చంద్రుడిపై ఇగ్లూ తరహాలో నిర్మించనున్న ఈ కట్టడాలను ‘లూనార్ హెబిటేట్స్’గా పిలవనున్నారు. ఇగ్లూలను నిర్మించేందుకు రోబోలు, త్రిడి ప్రింటర్లను చంద్రుడిపైకి పంపనున్నారు. ఇవి చంద్రుడిపై మట్టి, ఇతర ముడి పదార్థాలను అక్కడే సేకరించి ఇగ్లూలను నిర్మిస్తాయి. ఈ ప్రాజెక్టు కోసం ఇస్రో ఇప్పటికే ఐదు ఇగ్లూ నమూనాలను సిద్ధం చేసింది. చంద్రుడిపై ఇస్రో నిర్మించనున్న ఇగ్లూలు గడ్డకట్టే అంటార్కిటికాలోని భారత అవుట్ పోస్టును పోలి ఉంటాయని ఇస్రో శాటిలైట్ సెంటర్ (ఇసాక్) డైరెక్టర్ ఎం.అన్నాదురై తెలిపారు. చంద్రుడిపై శాశ్వత నిర్మాణాలు చేపట్టడం ద్వారా చాలా దేశాలు స్పేస్ స్టేషన్‌కు స్వస్తి చెప్పేందుకు సిద్ధమవుతున్నట్టు ఆయన తెలిపారు. ఇస్రో కూడా అందులో భాగస్వామ్యం కానుందని వివరించారు. చంద్రుడిపైకి వెళ్లే వ్యోమగాములు కొన్ని గంటలపాటు ఇగ్లూల్లో గడుపుతారని, వారు క్షేమంగా ఉండే బాధ్యతను ఇస్రో చూసుకుంటుందని అన్నాదురై పేర్కొన్నారు.

ముంబైలోనే ప్రపంచంలోని అత్యధిక జీతాలు



న్యూఢిల్లీ : ముంబై మహానగరం వలసదారులకు ఇచ్చే జీతాల మొత్తంలో ప్రత్యేకతను నిలబెట్టుకుంది. హెచ్‌ఎస్‌బిసి ఎక్స్‌పాట్ ఎక్స్‌ప్లోరర్ సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. వలసదారులకు జీతాలివ్వడంలో ముంబైకి నెంబర్ వన్ స్థానం దక్కింది. అంతర్జాతీయ సగటు వార్షిక జీతం రూ.64 లక్షలు కాగా, ముంబైలో పని చేసే వలసదారులు ఏడాదికి సగటున రూ.1.40 కోట్లు పొందుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల్లో పనిచేస్తున్న 27,587 మంది వలసదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ముంబై తర్వాత స్థానంలో శాన్‌ఫ్రాన్సిస్కో నిలిచింది. గోల్డెన్ సిటీ అనే పేరున్న ఈ నగరంలో ఉద్యోగాలు చేసే విదేశీయులకు సగటు వార్షిక జీతం రూ.1.34 కోట్లు అందుతున్నట్లు వెల్లడైంది. ప్రపంచం మొత్తం మీద 31 నగరాల్లో వలసదారులు పొందుతున్న సగటు వార్షిక జీతం రూ.64.75 లక్షలని ఈ నివేదిక తెలిపింది. ఎడిన్‌బరోలో పని చేస్తున్న విదేశీయులు అతి తక్కువ జీతం పొందుతున్నారు. వీరి సగటు వార్షిక జీతం రూ.36.42 లక్షలు మాత్రమే. ఇదిలావుండగా, విదేశీయులకు ఉద్యోగాల కల్పనలో ముంబైతో సహా ఆసియాలోని నగరాలు బ్రిటన్, అమెరికాల్లోని నగరాల కన్నా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది.

ఢిల్లీ పోలీసు చీఫ్‌ను కలిసిన ఆప్ నాయకులు

మంత్రిపై దాడిచేసినవారిపై చర్యతీసుకోవాలని డిమాండ్

న్యూఢిల్లీ: మంత్రి ఇమ్రాన్ హుస్సేన్, ఢిల్లీ డయలాగ్ కమిషన్ చైర్మన్ ఆశిశ్ ఖేతాన్‌పై దాడి చేసినవారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆప్ నాయకుల బృందం సోమవారం డిమాండ్ చేసింది. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అమూల్య పాట్నాయక్‌ను కలుసుకుని వారీ డిమాండ్ చేశారు. ప్రతినిధుల బృందంలో ఆప్ నాయకుడు అశుతోష్, పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఉన్నారు. ఢిల్లీ సచివాలయంలో ఫిబ్రవరి 20న జరిగిన ఆ దాడి ఘటనకు సంబంధించిన ‘విడియో సాక్ష్యం’ను పాట్నాయక్‌కు అందించినట్లు కూడా వారు చెప్పారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇంటివద్ద ఫిబ్రవరి 19—20 తేదీల మధ్య రాత్రి ఢిల్లీ ప్రధాన కార్యదర్శి అంశు ప్రకాశ్‌పై జరిగిన దాడిలో పోలీసులు వెంటనే ప్రతిస్పందించి ఆప్ ఎంఎల్‌ఎలు ప్రకాశ్ జర్వాల్, అమానతుల్లా ఖాన్‌పై చర్యలు తీసుకున్నారు. ‘ఎలాంటి సాక్ష్యం సమర్పించకుండానే ఆప్ ఎంఎల్‌ఎలను అరెస్టు చేశారు. ఢిల్లీ మంత్రి ఇమ్రాన్ హుస్సేన్, కెబినెట్ ర్యాంకును అనుభవిస్తున్న డిడిఎ వైస్ చైర్మన్ ఆశిశ్ ఖేతాన్‌లపై ప్రాణహానీ దాడులు జరిగినా ఏంచేశారు?’ అని అశుతోష్ ప్రశ్నించారు. ఢిల్లీ ప్రధాన కార్యదర్శి అంశు ప్రకాశ్ పై జరిగిన దాడికి సంబంధించిన సిసిటివి ఫుటేజ్‌లు సేకరించేందుకు ఢిల్లీ పోలీస్ బృందం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇంటికి వెళ్లింది. పోలీసుల చర్యలను ఆప్ తీవ్రంగా ఖండించింది. ‘అరవింద్ కేజ్రీవాల్‌ను తక్కువ చేసే, అవమాన చర్య’ అని అభివర్ణించింది. ‘రెండు రకాల చట్టాలు ఉండవు. పోలీసులు స్వేచ్ఛగా, న్యాయంగా వ్యవహరించి హుస్సేన్, ఖేతాన్‌లపై దాడులు చేసినవారిని అరెస్టు చేయాలి’ అని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ చెప్పారు. ‘కేజ్రీవాల్ ఇంటి వద్ద జరిగిన దాడిలో మా ఎంఎల్‌ఎలను అరెస్టు చేసిన విధంగానే, ఆప్ ఎంఎల్‌ఎలపై దాడిచేసిన వారి విషయంలో కూడా పోలీసులు తగినవిధంగా ప్రతిస్పందించాలి’ అని ఆయన అన్నారు.

ఉన్నతాధికారులతో సమావేశాలన్నీ ఇక ప్రత్యక్ష ప్రసారం

ఢిల్లీ సిఎస్‌పై ఎంఎల్‌ఎల దాడి కేసు నేపథ్యంలో కేజ్రీవాల్ సంచలన నిర్ణయం



న్యూఢిల్లీ : కేజ్రీవాల్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఉన్నతాధికారులతో జరిగే సమావేశాలన్నీ ప్రత్యక్ష ప్రసారం చేయాలని యోచిస్తున్నట్టు ఢిల్లీ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అన్షుప్రకాశ్‌పై అధికార ఆమాద్మీ పార్టీ ఎమ్మెల్యేలు దాడి చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ అంతర్గత వ్యవహారా లు, పనితీరులో పూర్తిస్థాయి పారదర్శకతను తీసుకొచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇకమీదట అధికారులు ప్రభుత్వంపై ఎలాంటి ఆరోపణ లు చేయకుండా చె క్ పెట్టేందుకు ఇదే విరుగుడుగా కేజ్రీవాల్ భావిస్తున్నట్టు కనిపిస్తోంది. ఢిల్లీ ప్రభుత్వానికి చెం దిన అధికారిక వెబ్‌సైట్లో సమావేశాలన్నీ ప్రత్యక్ష ప్రసారం చేసే అవకాశాలున్నాయి. ముందు ముందు ప్రభుత్వానికి చెందిన అన్ని ఫైళ్లను కూడా ఆన్‌లైన్లో పెట్టనున్నట్టు చెబుతున్నారు. ‘‘ఇకపై ప్రభుత్వ ఫైళ్లన్నటినీ ఆన్‌లైన్‌లో పెట్టాలని యోచిస్తున్నాం. తద్వారా ఆయా ఫైళ్లపై ఎవరు సంతకాలు చేశారు, ఎవరు చేయలేదు, తర్వాత సంతకం చేయాల్సిన వాళ్లు ఎవరు అన్నది ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసే అవకాశం ఉంటుంది. తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఎవరు అభ్యంతరం చెప్పారు, ఎవరు సంతకాలు పెట్టారన్నది కూడా ప్రజలు తెలుసుకోగలుగుతారు...’ అని సదరు నేత పేర్కొన్నారు. వచ్చేనెలలో ఢిల్లీ ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఒకవేళ ప్రత్యక్ష ప్రసార నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదిస్తే.. అందుకు కావాల్సిన నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయించాల్సి ఉంటుంది.

ముఖ్యమంత్రి అల్లుడిపై బ్యాంకు మోసం కేసు

న్యూఢిల్లీ : పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ అల్లుడు గుర్పాల్ సింగ్‌పై సిబిఐ కేసు నమోదు చేసింది. ఉత్తర ప్రదేశ్‌లోని సింభౌలీ సుగర్స్ లిమిటెడ్‌కు గుర్పాల్ సింగ్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా చేస్తున్నారు. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌కు రూ.109 కోట్ల మేరకు నష్టం కలిగించినందుకు నమోదైన ఈ కేసులో మొత్తం13 మంది నిందితులు. ఈ సుగర్ మిల్లు ప్రైవేటు రంగంలో ఏర్పాటైంది. ఈసంస్థ సిఎండి, సిఎఫ్ఓ, సిఇఓ, డైరెక్టర్లు,గుర్తు తెలియని బ్యాంకు అధికారు లపై ఆరోపణలు నమోదయ్యాయి. కెప్టెన్ అమరీందర్ సింగ్ కుమార్తె జై ఇందర్ కౌర్‌ను గుర్పాల్ సింగ్ వివాహం చేసుకున్నారు. ఆయన ఎనిమిది కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు.ఈ కేసులో నిందితులు నేరపూరిత కుట్ర, మోసం, అవినీతి వంటి నేరాలకు పాల్పడినట్లు ఎఫ్ఐఆర్ పేర్కొం ది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ, హాపూర్, నోయిడాలలో ఎనిమిది చోట్ల సీబీఐ సోదాలు నిర్వహించింది. డైరెక్టర్ల నివాసాలు, ఫ్యాక్టరీ, కార్పొరేట్ ఆఫీస్, రిజిస్టర్డ్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో సోదాలు చేసింది.ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం 2011లో ఈ కంపెనీకి ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ రూ.148.60 కోట్ల రుణం మంజూరు చేసింది. భారతీయ రిజర్వు బ్యాంకు పథకం క్రింద చెరకు రైతులకు లబ్ధి చేకూర్చేందుకు దీనిని మంజూరు చేసింది.అయితే ఈ సొమ్మును కంపెనీ తన స్వార్థ ప్రయోజనాల కోసం మళ్ళించింది.ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదుతో ఈ నెల 22న సిబిఐ కేసు నమోదు చేసింది.

అమెరికాను ముంచెత్తుతున్న వరదలు

వాషింగ్టన్ : అమెరికాలోని వేర్వేరు రాష్ట్రాల్లో తుపాను బీభత్సం సృష్టిస్తోంది. ఈ తుపాను ధాటికి ఇప్పటివరకు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పెనుగాలుల కారణంగా భారీగా ఆస్తినష్టం సంభవించింది. మిషిగన్, కెంటకి, ఆర్కాన్సాస్ తదితర రాష్ట్రాల్లో జోరు వానలు, సుడిగాలులు విరుచుకుపడ్డాయి. మిషిగన్, కెంటకిలోని అనేక ప్రాంతాల్లో వరదలు ముంచెత్తగా ముగ్గురు వ్యక్తులు నీట మునిగి మరణించారు. కెంటకిలోని అడైర్‌వీల్ సహా ఆర్కాన్సాస్‌లో గంటకు 193 కి.మీ వేగంతో వీచిన పెనుగాలుల కారణంగా ఇల్లు ధ్వంసమైంది. సుడిగాలుల తీవ్రతకు అనేక చోట్ల ఆస్తి నష్టం జరిగింది.



పరీక్షల నిర్వహణ గడువు మార్చి 15 వరకు పొడిగింపు

మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణలో భాషాపండితుల కోర్సుల్లో చేరే అభ్యర్థులకు శిక్షణ 9 నెలలకు బదులు రెండేళ్లు ఉండేలా చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ వాదన హైకోర్టులో వీగిపోయింది. తెలుగు, ఉర్దూ, హిందీ భాషలకు మాత్రమే తొమ్మిది నెలల శిక్షణ కోర్సులున్నాయని, మిగిలిన భాషలకు రెండేళ్ల శిక్షణ కోర్సులని ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. దీనిని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. నేషనల్ కౌన్సెల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ రూల్స్ ప్రకారం తొమ్మిది నెలలే శిక్షణ కోర్సు వ్యవధి అని బెంచ్ స్పష్టం చేసింది. విద్యా ప్రమాణాలు పెంపు కోసం రెండేళ్లు చేయాలన్న ప్రయత్నం బాగానే ఉన్నా నేషనల్ కౌన్సిల్ రూల్స్ అందుకు విరుద్ధంగా ఉన్నాయని బెంచ్ పేర్కొంది. వీటీపీ శిక్షణా తరగతుల కళాశాల కేసులో గతంలో సింగిల్ జడ్జి.. భాషా పండితుల శిక్షణా కోర్సులకు ఆరు వారాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై అప్పీల్ వ్యాజ్యాన్ని సోమవారం బెంచ్ కొట్టేయడంతో పరీక్షల గడువు పెంపునకు సమయం పెంచాలని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోరారు. దాంతో పరీక్షల నిర్వహణ గడువు మార్చి 15 వరకూ ఇస్తూ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

పోలీస్ స్టేషన్‌పై గ్రెనేడ్ విసిరిన తీవ్రవాదులు

కస్టడీలోని హిజ్బుల్ తీవ్రవాది మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ పుల్వామా జిల్లాలోని పోలీస్ స్టేషన్ నుంచి హిజ్బుల్ ముజాహిదీన్ తీవ్రవాది ముస్తాఖ్ అహ్మద్ చోపన్‌ను విడిపించేందుకు అతడి సహచర తీవ్రవాదులు ప్రయత్నించారు.ఈ సందర్భంగా వారు పోలీస్ స్టేషన్‌పై విసిరిన బాంబులో చోపన్ మృతి చెందాడు. బురఖా ధరించి ట్రాల్ పోలీస్ స్టేషన్ నుంచి ముస్తాఖ్ అహ్మద్ చోపన్ ప్రయత్నించాడు. అయితే తీవ్రవాదులు జరిపిన దాడిలో అతడు మృతి చెందాడు. కానిస్టేబుల్ మెరాజ్ దీన్‌కు గాయాలయ్యాయని పోలీస్ ప్రతినిధి తెలిపారు. పారిపోడానికి ప్రయత్నించిన చోపన్ పోలీస్ స్టేషన్ ప్రధాన గేటు వద్దక సమీపించగానే తీవ్రవాదులు గ్రెనేడ్ విసిరారు. అతడిని తప్పించే కుట్రలో భాగంగా పోలీసు సిబ్బంది దృష్టి మళ్లించడానికి హిజ్బుల్ తీవ్రవాదులు గ్రెనేడ్ విసిరినప్పటికీ అది అతడు నిలుచున్న పోలీస్ స్టేషన్ ప్రధాన గేటు వద్ద పేలింది. దాంతో అతడు చనిపోయాడు. సిఆర్‌పిసిలోని 176వ సెక్షన్ కింద మెజిస్టీరియల్ విచారణను చేపట్టినట్లు ఆ ప్రతినిధి చెప్పారు. సోపోర్ ప్రాంతంలోని బారాముల్లా జిల్లాలో చోపాన్‌ను అరెస్టు చేశారు. అయితే ఇటీవల అతడిని తీవ్రవాద కేసులో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 'ట్రాల్ పోలీస్ స్టేషన్ నుంచి తీవ్రవాది ముస్తాఖ్ అహ్మద్ చోపన్ పారిపోయేందుకు ప్రయత్నించినప్పుడు సెంట్రీ అడ్డుకున్నప్పుడు సహచర తీవ్రవాదులు విసిరిన గ్రెనేడ్‌లో అతడు మరణించాడు' అని డిజిపి ఎస్.పి. వైద్ చెప్పారు. ఒక రోజులో ఇది మూడో దాడి. శ్రీనగర్‌లోని సౌరా ప్రాంతంలో, బడ్‌గావ్ జిల్లాకు చెందిన చరారే షరీఫ్ ప్రాంతంలో సోమవారం తీవ్రవాదులు జరిపిన వేర్వేరు దాడుల్లో ఇద్దరు పోలీస్ అధికారులు చనిపోయారు.

భూసేకరణ వివాదంపై 6న సుప్రీం ధర్మాసనం విచారణ

బెంచ్‌ల వేర్వేరు ఉత్తర్వులపై దృష్టి

న్యూఢిల్లీ: భూసేకరణపై ఇటీవల సుప్రీంకోర్టు వేర్వేరు బెంచీల న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో తలెత్తిన వివాదంపై మార్చి 6న ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతుంది. సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ ఈ నెల 8న ఇచ్చిన తీర్పును ఈ నెల 21న మరో ముగ్గురు జడ్జీల బెంచ్ నిలిపివేయడంతో ఈ అంశంపై వివాదం రేగింది. నిర్దేశించిన ఐదేళ్లలోగా నష్ట పరిహారాన్ని తీసుకోలేదన్న కారణంపై భూమి సేకరణను రద్దు చేయడం కుదరదని ఈ నెల 8 తీర్పు పేర్కొంది. ఈ అంశంలో న్యాయ వ్యవస్థ క్రమశిక్షణాలోపం బయటపడిందని ఈ నెల 21న తీర్పులో మరో బెంచ్ అభిప్రాయపడింది.

ఆ కేటగిరీని పరిగణలోకి తీసుకోవాల్సిందే

మన తెలంగాణ/ హైదరాబాద్: వక్ఫ్‌బోర్డ్ పాలక మండలి నియామక సమయంలో ఎమ్మెల్సీ/ఎమ్మెల్యే కేటగిరీ కింద ఎంత మంది ఉండాలో తర్వాత విచారిస్తామని, అయితే ఆ కేటగిరీని పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ముస్లిం ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముత్తవల్లీ, బార్ కౌన్సిల్ సభ్యుడు.. నాలుగు కేటగిరీలుగా ఎన్నికలు జరిపాక పాలకమండలి ఏర్పాటు చేయాలి. కానీ సర్కార్ ముత్తవల్లి ఎమ్మెల్యే కేటగిరిలకు మాత్రమే ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ గుంటూరు శాసనసభ్యుడు ముస్తఫా షేక్ హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ జడ్జీలు వేరువేరుగా ఇచ్చిన ఉత్తర్వులపై ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్ వ్యాజ్యాల్ని సోమవారం బెంచ్ విచారించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

హైకోర్టును ఆశ్రయించిన బల్దియా కమిషనర్



మన తెలంగాణ/ హైదరాబాద్: హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 9లో నిర్మాణాలు చేయరాదన్న హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొం టూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కొంచెం తక్కువగా 900 గజాల స్థలంలో లక్ష్మీ బాయి మరో ముగ్గురు నిర్మాణాలు చేస్తుంటే జీహెచ్‌ఎంసీ గత ఏడాది నోటీసులు జారీ చేసిం ది. ఈ చర్యను తప్పుపడుతూ వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన హైకోర్టు.. సదరు స్థలంలో ఏవిధమైన నిర్మాణాలు చేయరాదని మధ్యంతర ఆదేశాలిచ్చారు. అయినా లక్ష్మీ బాయి జీపీఏ హోల్డర్ రవీంద్రనాథ్ నిర్మాణాలు చేయడంపై జీహెచ్‌ఎంసీ అధికారులు ఆస్థలం వద్దకు వెళ్లి అభ్యంతరం చెప్పినా పట్టించుకోలేదు. వారిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలి.. అని కమిషనర్ కోర్టు ధిక్కార రిట్ వేశారు. దీనిపై విచారణ జరగనుంది.

టాటా సోషల్ సైన్స్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరయ్యేలా చూడాలి

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్‌లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ మంజూరు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుతున్న ఎస్‌సి,ఎస్‌టి,బిసిలకు చెందిన అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇస్తామని యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసిందని, మెరిట్ ద్వారా అడ్మిషన్ పొంది ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇప్పుడు తాము స్కాలర్‌షిప్స్ మొత్తాన్ని ఇవ్వలేమని, మొత్తం ఫీజును చెల్లిస్తేనే చదువుకునేందుకు అవకాశం కల్పిస్తామని యాజమాన్యం చెప్పడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. వెంటనే ఉన్నత విద్యా మండలి జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన ప్రతినిధి బృందంలో కుల్క చర్ల శ్రీనివాస్, జాజుల లింగం గౌడ్, కనకల శ్యామ్‌కుర్మ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



జీవితకాలం అధ్యక్షుడు కాబోతున్న జి జిన్‌పింగ్



రెండు దఫాల పదవీకాల పరిమితి మారుస్తూ చైనా రాజ్యాంగ సవరణ

బీజింగ్: చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ 'జీవతకాలం చక్రవర్తి'గా మారారని ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న భయాందోళనలను చైనా సోమవారం కొట్టిపారేసింది. దేశం ఆధునీకరణ చెందుతున్న ప్రస్తుత తరుణంలో స్థిరమైన నాయకత్వం అవసరమని సమర్థించింది. 1949 నుంచి అధికారంలో ఉన్న చైనా కమ్యూనిస్టు పార్టీ(సిపిసి) అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు రెండుదఫాలే పదవీకాలంలో ఉండాలన్న పరిమితిని తొలగిస్తూ రాజ్యాంగ సవరణ ప్రతిపాదనను ఆదివారం చేసింది. అంతేకాక జి జిన్‌పింగ్ జీవితకాలం అధ్యక్షుడిగా కొనసాగేందుకు అనుమతిచ్చింది. దీనిపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లు కాంగ్ ప్రతిస్పందిస్తూ మీడియా ఊహాగానాలు చేయడం మానుకోవాలన్నారు. చైనా రాజ్యాంగం 1954 నుంచి కొద్దికొద్దిగా పరిణామం చెందుతూ వచ్చిందన్నారు. జి జిన్‌పింగ్ తన మొదటి పదవీ కాలంలో మిలిటరీ ఆధునీకరణ, దక్షిణ చైనా సముద్రంలో చైనా నావికా శక్తి విస్తరణ, శ్రీలంక, జిబోతి, పాకిస్తాన్‌లోని గ్వదర్‌లలో నావికా సరకు రవాణా స్థావరాలను ఏర్పాటు చేసుకోవడంపై ప్రపంచ దేశాలు భయాందోళనలు వ్యక్తం చేశారు. గత అక్టోబరులో జి జిన్‌పింగ్ ఐదేళ్ల తన రెండో పదవీకాలాన్ని ఆరంభించారు. ఈ కాలంలో ఆయన చైనా పరివర్తనపై దృష్టిని సారించారు. ప్రస్తుతం చైనా ప్రపంచంలో రెండో ఆర్థిక శక్తిగా ఉంది. త్వరలో ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సైనిక, పర్యావరణ రంగాల్లో ప్రబల శక్తి కానుంది. 2013లో బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్(బిఆర్‌ఐ)ని జిన్‌పింగ్ ఆరంభించారు. అందులో చైనా, పాకిస్థాన్ ఆర్థిక నడవ(సిపిఇసి) కూడా ఉంది. అది ఆక్రమిత కశ్మీర్ గుండా పోనుంది. 'పదవీకాలం ముగిసినప్పటికీ జి జిన్‌పింగ్ అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం ఉంది. బహుశా అది జీవితకాలం ఉండవచ్చేమో' అని సిపిసికి చెందిన సెంట్రల్ పార్టీ స్కూల్‌కు అనుబంధంగా ఉన్న 'స్టడీ టైమ్స్ న్యూస్‌పేపర్' మాజీ ఎడిటర్ డెంగ్ యువెన్ హాంకాంగ్‌కు చెందిన 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్'కు తెలిపారు. చైనా అధ్యక్షుడిగా, సిపిసి ప్రధాన కార్యదర్శిగా జిన్‌పింగ్ రెండో దఫా పదవీకాలం గతేడాదే ప్రారంభమైంది. 2022లో ఆ పదవుల నుంచి దిగిపోవాల్సి ఉంది. జిన్‌పింగ్‌కు ముందు చైనా అధ్యక్షులుగా,పార్టీ ప్రధాన కార్యదర్శులుగా పనిచేసిన జియాంగ్ జెమిన్(1993–2003), హు జింటావో(2003–2013) రాజ్యాంగంలోని కాల పరిమితి నిబంధనల కారణంగానే పదవుల నుంచి దిగిపోయారు.

సుప్రీం మార్గదర్శకాలను పాటించని జడ్జీలు



మోసం కేసులో బెంచ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశమంతటా చాలా మంది మెజిస్ట్రేట్లు అనేక కేసులలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను విచారణల్లో పాటించడం లేదు. ఈ విషయాన్ని స్వయంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇది దురదృష్టకరమని పేర్కొంది. న్యాయం చేయడం ఒక్కటే కాకుండా, పలానా కేసులో న్యాయం జరిగిందన్న భావన కల్పించడం కూడా ముఖ్యమన్న సూక్తి గురించి సుప్రీంకోర్టు గుర్తు చేసింది. మెజిస్ట్రేట్లు కేసుల విచారణలో స్వతంత్రంగా పరిశీలన జరపడం లేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎన్‌వి రమణ, ఎస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. ఈ విషయం సుప్రీంకోర్టు ముందుకు వచ్చిన కేసుల విషయంలో యదార్థమని వారన్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఒక ఉత్తర్వును పక్కనపెడుతూ బెంచ్ ఈ వ్యాఖ్య చేసింది. ఐపిసి, ఎస్‌సి/ ఎస్‌టి చట్టం కింద అనేక నిబంధనల కింద ఒక వ్యక్తి వేసిన మోసం, పోర్జరీ కేసును దిగువ కోర్టుకు బెంచ్ అప్పగిస్తూ అలా పేర్కొంది.

నేటి నుంచి జోర్డాన్ రాజు పర్యటన



న్యూఢిల్లీ: జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 మంగళవారం నుంచి జరపనున్న మూడు రోజుల పర్యటనలో ఇస్లామిక్ వారసత్వ సంపదపై ప్రత్యేక ప్రసంగం చేస్తారు. నేరుగా ప్రవక్త మొహమ్మద్ వంశంలో 41వ తరానికి చెందిన అబ్దుల్లా టెర్రరిజం, తీవ్రవాదంపై ప్రపంచ పోరాటంలో చురుకుగా పాల్గొంటున్న వ్యక్తి. సంఘర్షణలతో కూడిన మధ్య ప్రాచ్యంలో జోర్డాన్‌ను సుస్థిరతకు, సామరస్యానికి మారు పేరుగా భారత్ భావిస్తోంది. అనేక కీలక రంగాలలో సహకారం పెంపుపై భారత, జోర్డాన్‌లు రాజు పర్యటనలో దృష్టి పెడతాయి. పాలస్తీనా సమస్య చర్చలలో ప్రముఖ స్థానం ఆక్రమించవచ్చు. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతా సహకార సంబంధాల పెంపునకు ప్రాతిపదిక చర్చలలో తయారవుతుంది. గురువారం నాడు ఇస్లామిక్ వారసత్వ సంపదపై ఇక్కడి విజ్ఞాన్ భవన్‌లో అబ్దుల్లా చేసే ప్రత్యేక ప్రసంగాన్ని వినడానికి ప్రధాని మోడీ, తదితర ముఖ్యులు హాజరవుతారు.

తృణమూల్‌కి రాజీనామా చేసిన బైచుంగ్ భూటియా

కోల్‌కతా: భారత మాజీ ఫుట్‌బాలర్ బైచుంగ్ భూటియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ట్విటర్ ద్వారా వెల్లడించారు.'ఈరోజు నేను ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటిస్తున్నాను.అంతేకాదు, ఇక మీదట ఏ రాజకీయ పార్టీలోనూ చేరను'అంటూ ట్వీట్ చేశారు. 1995 నుంచి2011వరకు జాతీయ ఫుట్‌బాల్ భారత టీంతో కలిసి ఆడిన ఆయన 2011లో ఫుట్‌బాల్ క్రీడకు గుడ్ బై చెప్పారు. 2013లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు.2014లోక్‌సభ ఎన్నికల్లో డార్జిలింగ్ నుంచి పోటీ చేసి,పరాజయం పొందారు.

పిడబ్ల్యుడి కుంభకోణం

ఎసిబి స్థాయి నివేదికను కోరిన హైకోర్టు



న్యూఢిల్లీ: రోడ్లు, మురుగునీటి కాలువలకు సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపుల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఇతరులు అవకతవకలకు పాల్పడ్డారన్న ఫిర్యాదుపై దర్యాప్తు స్థాయి నివేదిక(స్టేటస్ రిపోర్ట్)ను దాఖలు చేయమని అవినీతి నిరోధక శాఖ(ఎసిబి)ని ఢిల్లీ హైకోర్టు సోమవారం ఆదేశించింది. దర్యాప్తును ఎసిబి నుంచి సిబిఐకు బదిలీ చేయాలన్న వినతిని విచారించిన న్యాయమూర్తి ఎస్.పి.గర్గ్ తదుపరి విచారణను ఏప్రిల్ 19కి వాయిదా వేశారు. వినతిని రోడ్స్ యాంటీ కరప్షన్ ఆర్గనైజేషన్ అనే ఎన్‌జిఒ వ్యవస్థాపకుడు రాహుల్ శర్మ దాఖలు చేశారు. ఆయన తన వినతిలో ఈ విషయంలో ఆ రాష్ట్రం కావాలని నిర్లక్ష్యంగా వహిస్తోందని, దర్యాప్తులో ఎసిబి అనుసరిస్తున్న తీరు కూడా అక్రమంగా ఉందని పేర్కొన్నారు. 'ప్రస్తుత కేసులో సిఎం అరవింద్ కేజ్రీవాల్ పాత్ర, శిక్షార్హమైన నేరం గురించి శర్మ ఫిర్యాదులో పేర్కొన్నప్పటికీ ఆ రాష్ట్రం కావాలనే ఎఫ్‌ఐఆర్‌లో కేజ్రీవాల్ పేరును తొలగించి శిక్షా స్మృతి అంశాలను ఉల్లంఘించింది' అని న్యాయవాది కిస్లే పాండే ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. కేజ్రీవాల్‌పై, ఆయన బావమరిది, నిర్మాణ సంస్థ యజమాని, ప్రభుత్వ ఉద్యోగి సురేందర్ బన్సల్ ఢిల్లీలోని రోడ్లు, మురుగునీటి కాలువలకు సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడ్డారని, వారిపై ఎఫ్‌ఐఆర్‌ను దాఖలు చేసేలా పోలీసులకు ఆదేశాలివ్వాలని కోరుతూ శర్మ పెట్టుకున్న ఫిర్యాదు విచారణ కోర్టులో పెండింగ్‌లో ఉంది. బన్సల్ గత ఏడాది మే నెలలో చనిపోయారు. ఫిర్యాదు పెండింగ్‌లో ఉన్న సమయంలోనే.. 2017 మే 8న కాంట్రాక్టుల కేటాయింపులో జరిగిన అక్రమాలకు సంబంధించి ఎసిబి స్వయంగా మూడు ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేసింది. కజిన్‌తో కలసి తన కారులో వెళుతుండగా మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారని, తనకు ప్రాణ హానీ ముప్పు ఉందని చేసిన ఫిర్యాదును పరిశీలించాల్సిందిగా ఎసిబికి మెజిస్టీరియల్ కోర్టు ఇదివరలో ఆదేశించింది. ఢిల్లీ రోడ్లు, మురుగునీటి కాలువల ప్రాజెక్టుల్లో లోతైన అవినీతి ఉందని శర్మ తన ఫిర్యాదులో ఆరోపించారు. కొన్న వస్తువులు దస్తావేజులన్నీ నకిలీవి, సృష్టించినవని పేర్కొన్నారు. ఈ అక్రమాల కారణంగా ప్రభుత్వ కోశాగారానికి రూ. 10 కోట్ల నష్టం సంభవించిందని అన్నారు.

అధికోత్పత్తితోనే ఆర్థిక ప్రగతి

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మన తెలంగాణ/న్యూఢిల్లీ: దేశంలో కార్మికులు ఎక్కువ పనిచేసి, అధికంగా ఉత్పత్తి చేస్తే, దాని ద్వారా ఉత్త్పి పెరిగి ఆదాయం ఎక్కువగా వస్తుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రధాని శ్రామ్ పురస్కారాల కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలలో నైపుణ్యంతో పాటు, నిజాయితీగా పనిచేసే కార్మికులకు, కార్మికశక్తి కోసం వారి అభివృద్ధి కోసం పనిచేసిన 338 మంది కార్మికులకు ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రధాని శ్రామ్ అవార్డులను ప్రదానం చేసారు. ఇందులో 232 మంది పబ్లిక్ సెక్టార్ సంస్థల నుండి అవార్డులు పొందగా, 106గురు ప్రైవేట్ సెక్టార్ సంస్థల నుండి అవార్డులు పొందారు. తెలంగాణా నుంచి అవార్డులు అందుకున్నవారిలో బిహెచ్‌ఈఎల్ సంస్థ కార్మికులు జి.గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, రాజేందర్ ప్రసాద్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవార్డులు పొందిన వారిని అభినందించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నదని తెలిపారు. మన ఆర్థిక వ్యవస్థ చక్రాలు నడుపుటకు గడియారంలా మీలాంటి కార్మికులు లక్షలాది మంది పనిచేస్తున్నారని అవార్డులు అందుకున్న వారని ఉపరాష్ట్రపతి అభినందించారు. భారత దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుందంటే, దానికి ప్రధాన కారణం శ్రామిక శక్తే అని కొనియాడారు. దేశంలో కార్మిక శక్తి స్థాయిని మెరుగుపరచడం, నాణ్యమైన శిక్షణకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. మన దేశంలో శ్రామిక శక్తి ఉత్పాదకతను మెరుగుపరచడం ప్రధాన సవాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు, కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్, కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ సెక్రటరీ సత్యవతిలు పాల్గొన్నారు.

రైతులకు రెండు లక్షల రుణమాఫీ

- ఉచిత పంటల బీమా పథకం అమలు
- రైతులకు ప్రత్యేక మద్దతు ధర ఇస్తాం
- మూడు వేల నిరుద్యోగభృతి అందచేస్తాం
- బస్సుయాత్రలో కెప్టెన్ ఎన్నికల హామీల జల్లు



మన తెలంగాణ/రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: దళితుల సంక్షేమంపై కెసిఆర్‌కు చిత్తుశుద్ధి ఉంటే వచ్చే బడ్జెట్‌కు మూడు ఎకరాల భూమి కొనుగోలు చేయడానికి నిధులు కేటాయించాలని పిసి సి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. చేవెళ్ళలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్ర ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి ఆంధ్రా కాంట్రాకర్ల కమిషన్‌ల కోసం ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. దళితుడికి మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇవ్వలేని పక్షంలో ప్రతి దళితుడి ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాము లక్షలాదిగా ఇందిరమ్మ ఇళ్ల ను నిర్మిస్తే వాటిని అవహేళన చేసిన కెసిఆర్ తెలంగాణలో ఎన్ని డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మిం చి ప్రజలకు ఇచ్చారో బహిర్గతం చేయాలన్నారు. మైనార్టీలు, ఆదివాసి గిరిజనులకు రిజర్వేషన్‌ల పేరు తో మోసం చేస్తున్నారని విమ ర్శించారు. మిషన్‌ల పేరుతో నాలుగు కోట్ల ప్రజల ఖజానాను నలుగురు కుటుంబ సభ్యులు దోచుకుతింటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి సమాధి కట్టి ప్రజల హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. రైతుల మద్దతు ధర కోసం ఉద్యమించిన, అక్రమ మైనింగ్‌పై దళితులు ప్రశ్నించిన కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఎకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడంతో పాటు పంటల బీమా పథకం ప్రవేశపెట్టి ప్రీమియం సైతం ప్రభుత్వం కడుతుందన్నారు. రైతులకు మద్దతు ధర అందచేస్తామని వరికి రెండు వేయిలు, పత్తికి ఆరు వేలు, మిర్చి, పసుపు పదివేలకు తగ్గకుండా మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల రుణమాఫీ చేయడంతో పాటు పది లక్షల వరకు తిరిగి రుణాలు అందచేస్తామన్నారు. అభయహస్తం పథకం కింద వేయి రూపాయల పింఛన్ అందచేయడంతో పాటు ప్ర తి ఇంట్లో అర్హులైన అందరికి పింఛన్ అందచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు క్యామ మల్లేష్, మాజీ మంత్రులు సబితారెడ్డి, సుదర్శన్ రెడ్డి,డి.కె. అరు ణ, గీతారెడ్డి, చిన్నారెడ్డి, శ్రీదర్‌బాబు, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, మహేశ్వర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవారినిచేర్చుకుంటాం : సీనియర్‌లను గౌరవిస్తాం; రాష్ట్ర ఇంచార్జి కుంతియా

కాంగ్రెస్ పార్టీలో చేరడానికి రాష్ట్రంలో అన్ని పార్టీల నుంచి యువకులు ముందుకు వస్తున్నారని వారిని సాదరంగా పార్టీలోకి అహ్వానిస్తా మన్నారు. భవిష్యత్‌లో తెలంగాణలో రెండు వర్గా లు మాత్రమే ఉంటాయని అవినీతి, కమిషన్‌లు పదవుల కోసం వెళ్లేవారు కెసిఆర్ వర్గంలో ఉంటా రని, రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే వారంతా కాంగ్రెస్ పార్టీలో వచ్చి చేరతారన్నారు. మూఢ నమ్మకాలతో సంవత్సర కాలం పాటు సచి వాలయానికి రాని ఘనత తెలంగాణ సిఎం కెసి ఆర్‌కు దక్కు తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ కుంతియా అన్నారు.

కాళేశ్వరంలో కర్ణాటక మీడియా బృందం

మన తెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పనులను కర్ణాటక మీడియా అకాడమీ బృందం మంగళవారం పరిశీలించనుంది. ఈ మేరకు రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మీడియా అకాడమీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నిర్మిస్తున్న నీటి పారుదల ప్రాజెక్టులు గురించి తెలుసుకోవడానికి రెండు రోజుల పాటు కర్ణాటక బృందం పర్యటిస్తుందన్నారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరి నేరుగా కోమటిబండలోని మిషన్ భగీరథ పనులు పరిశీలించి, అనంతరం సుందిళ్ల జరుగుతున్న కాళేశ్వరం పనుల గురించి తెలుసుకుంటారు. ఆ తర్వాత కన్నెపల్లి పంపుహౌజ్, రామడుగు సర్జికల్ పూల్ సందర్శిస్తారు. అనంతరం బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని టి హబ్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కుల పంపిణీలో పాల్గొంటారని అల్లం నారాయణ వివరించారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనమండలి ఛైర్మన్ స్వామి గౌడ్, ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఐటి శాఖ మంత్రి కె.తారక రామారావు, నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి టి.పద్మారావు తదితరులు పాల్గొంటారు.

జిమ్నాస్టిక్ కోచ్‌కు ఆర్థిక సహాయం



మన తెలంగాణ/ హైదరాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న శాట్స్ జిమ్నాస్టిక్స్ కోచ్ ఎస్.బ్రిజ్ కిషోర్‌కు శాట్స్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల కజకిస్థాన్‌లో జరిగిన జిమ్నాస్టిక్స్ పోటీలకు హాజరైన బ్రిజ్ కిషోర్ అక్కడే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో అర్ధాంతరంగా స్వదేశానికి చేరుకున్న బ్రిజ్ కిషోర్ హైదరాబాద్‌లోని ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్రాస్టోఎంట్రోలజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జిమ్నాస్టిక్ కోచ్‌కు ప్రభుత్వం తరపున తక్షణ సహాయంగా రూ.రెండు లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు శాట్స్ ఎండి ఈ సహాయాన్ని అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును శాట్స్ చైర్మన్ సోమవారం కోచ్ బ్రిజ్ కిషోర్‌కు అందజేశారు. ఆసుపత్రికి వెళ్లిన చైర్మన్ కోచ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కోచ్ చికిత్సకు అయ్యే అన్ని ఖర్చులను శాట్స్ భరిస్తుందని హామీ ఇచ్చారు.



ఉత్తమ బాక్సర్‌గా వికాస్ క్రిషన్

సోఫియా (బల్గేరియా): ఇక్కడ జరిగిన స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ వికాస్ క్రిషన్ 75 కిలోల మిడిల్ వెయిట్ విభాగంలో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించాడు. అసాధారణ ప్రతిభతో పసిడి పతకం సొంతం చేసుకున్న వికాస్ బెస్ట్ బాక్సర్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో ప్రతిష్టాత్మకమైన స్ట్రాండ్‌జా బాక్సింగ్ పోటీల్లో ఉత్తమ బాక్సర్ అవార్డును సొంతం చేసుకున్న తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించాడు. ఫైనల్ సమరం వికాస్ స్టార్ బాక్సర్ ట్రో ఇస్లే (అమెరికా)ను ఓడించి పసిడి పతకం దక్కించుకున్నాడు. ఈ పతకం తర్వాత వికాస్‌కు బెస్ట్ బాక్సర్ అవార్డు దక్కింది. ప్రపంచ చాంపియన్‌షిప్ బాక్సింగ్‌లో కాంస్య పతకం గెలిచిన ఇస్లేతో జరిగిన పోరులో వికాస్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. చూడచక్కని పంచ్‌లతో ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. వికాస్ ధాటికి ఇస్లే ఎదురు నిలువలేక పోయాడు. ఇంతకుముందు 48 కిలోల విభాగంలో అమిత్ పంగల్ కూడా స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. మహిళల విభాగంలో స్టార్ బాక్సర్ మేరీకోమ్ రజతంతో సరిపెట్టుకుంది. ఈ పోటీల్లో భారత బాక్సర్లు 11 పతకాలతో సత్తా చాటారు. పురుషుల విభాగంలో ఐదు, మహిళల విభాగంలో ఆరు పతకాలు భారత్‌కు లభించాయి. రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఆరు కాంస్య పతకాలు భారత్ ఖాతాలోకి వచ్చాయి.

శశిధర్‌కు టైటిల్

మన తెలంగాణ/ హైదరాబాద్: విశాఖలో జరిగిన ఇండియన్ మాస్టర్స్ (వెటరన్) బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణకు చెందిన సి.ఎమ్.శశిధర్ టైటిల్ గెలుచుకున్నాడు. 40 ప్లస్ విభాగంలో జరిగిన ఫైనల్లో శశిధర్ 21–4, 21–2తో పంజాబ్ ఆటగాడు సలీమ్ మహ్మద్‌ను ఓడించాడు. ఏకపక్షంగా సాగిన పోరులో శశిధర్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన శశిధర్ 18 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో దేశ వ్యాప్తంగా ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఇదిలావుండగా ఈ టోర్నమెంట్‌లో ప్రారంభం నుంచే శశిధర్ దూకుడైన ఆటతో ప్రత్యర్థులను హడలెత్తించాడు. రెండో రౌండ్‌లో ఒడిశా ఆటగాడు మొహంతిపై, మూడో రౌండ్‌లో అస్సాం ఆటగాడు చౌదరిపై విజయం సాధించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో తమిళనాడు ఆటగాడు సెంథిల్ వేలన్‌పై, క్వార్టర్ ఫైనల్లో ఉత్తరాఖండ్ ఆటగాడు లలిత్ యాదవ్‌పై విజయం సాధించాడు. సెమీఫైనల్లో కర్ణాటక ఆటగాడు అనిల్ ప్రధాన్‌పై 21–9, 21–8తో విజయం సాధించి టైటిల్ వేటకు చేరుకున్నాడు.



పంజాబ్ పగ్గాలు అశ్విన్‌కు



న్యూఢిల్లీ: రానున్న ఐపిఎల్ సీజన్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఫ్రాంచైజీ సారథ్య బాధ్యతలను స్టార్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్‌కు అప్పగించారు. ఈ విషయాన్ని కింగ్స్ ఎలెవన్ యాజమాన్యం సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది జరిగిన ఐపిఎల్ వేలం పాటలో పంజాబ్ 7.60 కోట్ల రూపాయలను వెచ్చించి అశ్విన్‌ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. కిందటి సీజన్‌లో పంజాబ్‌కు సారథ్యం వహించిన మాక్స్‌వెల్ ఈసారి జట్టుకు దూరమయ్యాడు. దీంతో సీనియర్ క్రికెటర్‌గా గుర్తింపు పొందిన అశ్విన్ కెప్టెన్సీ ఇచ్చేందుకు యాజమాన్యం ముందుకు వచ్చింది. అశ్విన్ ఓ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. టీమిండియాలో కీలక బౌలర్‌గా ఉన్న అశ్విన్ కొంత కాలంగా వన్డేలు, టి–20లకు దూరంగా ఉండాల్సి వస్తోంది. విశ్రాంతి పేరుతో అశ్విన్‌తో సహా మరో స్టార్ రవిచంద్రన్ అశ్విన్‌ను సెలెక్టర్లు వన్డేలు, టి–20లకు దూరంగా ఉంచుతున్నారు. కాగా, ప్రపంచంలోని అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడిగా, కీలక సమయంలో అద్భుత బ్యాటింగ్‌తో చెలరేగే సత్తా కలిగిన బ్యాట్స్‌మన్‌గా అశ్విన్ పేరు తెచ్చుకున్నాడు. అతని ప్రతిభను గుర్తించిన కింగ్స్ ఎలెవన్ యాజమాన్యం అతన్ని పెద్ద మొత్తాన్ని చెల్లించి సొంతం చేసుకుంది. తాజాగా అశ్విన్‌పై మరింత నమ్మకాన్ని ఉంచుతూ సారథ్య బాధ్యతలను కూడా అప్పగించేందుకు ముందుకు వచ్చింది. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబరచాలనే ఉద్దేశంతో పంజాబ్ ఉంది.

సవాలుకు సిద్ధం..

కెప్టెన్సీ బాధ్యతలను నిర్వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అశ్విన్ స్పష్టం చేశాడు. జట్టు యాజమాన్యం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతానని హామీ ఇచ్చాడు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి జట్టును విజయపథంలో నడిపించడమే తన ముందున్న ఏకైక లక్ష్యమన్నాడు. కెప్టెన్సీని స్వీకరించేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని తెలిపాడు. ఈ సవాలును స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. తన సారథ్యంలో జట్టు మెరుగైన ఫలితాలు సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. ఐపిఎల్ వంటి ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్‌లో ఓ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండడం కొత్త అనుభూతిని ఇస్తుందన్నాడు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు సర్వం ఒడ్డుతానని స్పష్టం చేశాడు. కెప్టెన్సీ అప్పగించేందుకు ముందుకు వచ్చిన ఫ్రాంచైజీ యాజమాన్యానికి అశ్విన్ కృతజ్ఞతలు తెలిపాడు. ఇది తనకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు వివరించాడు. బౌలర్‌గా, బ్యాట్స్‌మన్‌గా, కెప్టెన్‌గా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని అశ్విన్ హామీ ఇచ్చాడు.

అది దిద్దుకోలేని పొరపాటు: గంగూలీ



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా దిగ్గజం గ్రెగ్ చాపల్‌ను పట్టుబడి కోచ్‌గా నియమించుకోవడం తన కెరీర్‌లో చేసిన అతి పెద్ద పొరపాటని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వ్యాఖ్యానించాడు. ఈ పొరపాటును ఎన్నడూ సరిదిద్దుకోలేక పోయానని పేర్కొన్నాడు. గంగూలీ, చాపల్‌ల మధ్య జరిగిన వివాదం ప్రపంచ క్రికెట్‌లో పెను ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ తతంగం ముగిసి ఏళ్లు గడుస్తున్నా దానికి సంబంధించి వివాదాలు ఇప్పటికీ వార్తల్లో నానుతూనే ఉన్నాయి. తాజాగా తన ఆత్మకథ ఏ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్ అనే పుస్తకంలో చాపల్‌తో ఉన్న తన బద్ధ శతృత్వాన్ని గంగూలీ మరోసారి వెల్లగక్కాడు. ఏరికోరి చాపల్‌ను కోచ్‌గా నియమించుకోవడం తాను చేసిన పొరపాట్లలో అతి పెద్దదని అభిప్రాయపడ్డాడు. చాపల్‌పై తాను ఎంతో నమ్మకాన్ని ఉంచానని, అయితే అతను మాత్రం ఆ నమ్మకాన్ని వమ్ము చేశాడన్నాడు. అంతేగాక తనపైనే కక్షకట్టి జట్టులో స్థానం లేకుండా చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించాడు. చాపల్‌ను కోచ్‌గా నియమించుకున్నందుకు తనకు తగిన శాస్తి జరిగిందన్నాడు. చాపల్ కోచ్ పదవిని అడ్డు పెట్టుకొని తీసుకున్న నిర్ణయాలు జట్టుపై తీవ్ర ప్రభావాన్నే చూపిందన్నాడు. అప్పటి వరకు ప్రపంచ క్రికెట్‌లో బలమైన జట్టుగా ఉన్న భారత్ బలహీనంగా మారేందుకు చాపల్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలే కారణమన్నాడు. అతను నియంతలా వ్యవహరిస్తూ అర్థంపర్థం లేని నిర్ణయాలు తీసుకునేవాడని, ఎవరైన ప్రశ్నిస్తే జట్టులో నుంచి ఉద్వాసన పలికేవాడని గంగూలీ వాపోయాడు. చాపల్ వల్ల తనతో పాటు సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్ తదితరులు ఎన్నో చేదు అనుభవాలను చవి చూడాల్సి వచ్చిందన్నాడు. చాపల్‌ను కోచ్‌గా నియమించుకున్నందుకు తనకు మంచి బహుమతే లభించిందని వ్యాఖ్యానించాడు. కెరీర్‌లో ఎన్నడూ ఎదుర్కొనన్ని ఇబ్బందులను చాపల్ కోచ్‌గా ఉన్నప్పుడూ తాను చవిచూశానన్నాడు. అతని తీరుతో తాను ఎన్నో నిదుర లేని రాత్రుళ్లు గడపాల్సి వచ్చిందన్నాడు. చాపల్ కోచ్ బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల్లోనే తన కెప్టెన్సీ పోయిన విషయాన్ని గంగూలీ ఈ సందర్భంగా ప్రస్తవించాడు. అదే ఏడాది ఎటువంటి కారణం లేకుండానే తనను ఆటగాడిగా కూడా జట్టులో నుంచి తప్పించాడన్నాడు. అంతేగాక, తన మానసిక స్థితి బాగాలేదంటూ బిసిసిఐకి చాపల్ లేఖ రాయడం తనను మరింత బాధించిందన్నాడు. ఇలా ఎన్నో విషయాలను గంగూలీ తన పుస్తకంలో పొందుపరిచాడు.

లంక టూర్‌కు పాక్ మహిళా జట్టు



కరాచీ: పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు వచ్చే నెలలో శ్రీలంకలో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా పాకిస్థాన్ ఆతిథ్య శ్రీలంక జట్టుతో మూడు వన్డేలు, మరో మూడు ట్వంటీ–20 మ్యాచ్‌లలో తలపడుతుంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు మార్చి 20న తెరలేస్తోంది. ఇరు జట్లు మూడు వన్డేల్లో తలపడుతాయి. మూడు వన్డేలు కూడా దంబుల్లాలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. మరోవైపు మూడు మ్యాచ్‌ల టి–20 సిరీస్‌కు కొలంబో నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. మూడు మ్యాచ్‌లు కూడా కొలంబోలోనే నిర్వహిస్తారు. మార్చి 28న తొలి టి–20 మ్యాచ్ జరుగుతుంది. ఇదిలావుండగా ఇరు జట్ల మధ్య చివరి పోరు కిందటి ఏడాది జరిగింది. ఇంగ్లాండ్ వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో చివరి సారిగా పాకిస్థాన్ జట్టు శ్రీలంకతో తలపడింది. ఆ తర్వాత ఇరు జట్ల మధ్య ఓ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి. ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరగడం ఇదే ప్రథమం. ఇదిలావుండగా ఐసిసి ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ సిరీస్ జరుగనుంది. మరోవైపు మార్చి ఆరు నుంచి భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్ల మధ్య ముక్కోణపు ట్వంటీ–20 టోర్నమెంట్ జరుగనున్న విషయం తెలిసిందే.

ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత గుడ్‌బై



- **దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ మోర్నీ మోర్కెల్**

దర్బన్: ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తానని దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. సోమవారం మీడియా సమావేశంలో మోర్కెల్ ఈ విషయాన్ని వెల్లడించాడు. వరుస గాయాల నేపథ్యంలో ఫిట్‌నెస్‌ను కాపాడుకోలేక పోతున్నానని, అంతేగాక కుటుంబానికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు వివరించాడు. వచ్చే 2019 ప్రపంచకప్ వరకు కొనసాగాలని భావించినా పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో ఆస్ట్రేలియా సిరీస్ ముగిసిన వెంటనే అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించినట్టు తెలిపాడు. అన్ని ఆలోచించే రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నానని 33 ఏళ్ల మోర్కెల్ పేర్కొన్నాడు. కొంతకాలంగా తాను ఆశించిన స్థాయిలో రాణించలేక పోతున్నానని, గాయాలు కూడా తనకు ప్రతికూలంగా మారాయన్నాడు. అంతేగాక యువ ఫాస్ట్ బౌలర్ల నుంచి తనకు గట్టి పోటీ నెలకొందన్నాడు. తనకంటే వారే మెరుగైన బౌలింగ్‌ను కనబరుస్తున్నారని, ఈ పరిస్థితుల్లో తప్పుకొని వారికి అవకాశం ఇవ్వడమే ఉత్తమమన్నాడు. ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ముగిసిన వెంటనే క్రికెట్‌కు గుడ్‌బై చెబుతానని స్పష్టం చేశాడు. ఇదే తన తుది నిర్ణయమని, ఇందులో మరో ఆలోచనకు తావులేదన్నాడు. ఎడతెరిపి లేని క్రికెట్‌తో ఇప్పటికే చాలా ఏళ్లు కుటుంబానికి దూరంగా ఉండాల్సి వచ్చిందన్నాడు. వివాహం తర్వాత కుటుంబానికి తగినంత సమయం కెటాయించలేక పోతున్నాననే బాధ తనను వెంటాడుతుందన్నాడు. ఈ పరిస్థితుల్లో చాలా ఆలోచించే అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించానని తెలిపాడు.



తనకు క్రికెట్ కంటే ప్రస్తుతం కుటుంబానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నాడు. క్రికెట్‌కు సుదీర్ఘ కాలం సేవలు అందించానన్నాడు. ఇకపై కుటుంబానికే అధిక సమయం కేటాయిస్తానని వివరించాడు. అంతేగాక, యువ బౌలర్ల రాకతో తమ ఫాస్ట్ బౌలింగ్ విభాగం పటిష్టంగా మారిందన్నాడు. ఎన్‌గిడి, ఫెలుక్‌వాయో, రబడా తదితరులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని తెలిపాడు. ఈ పరిస్థితుల్లో వారికి మరింత అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నాడు. గతంతో పోల్చితే తన బౌలింగ్‌లో నిలకడగా లోపించిందనేది వాస్తవమన్నాడు. దీన్ని గుర్తించే తాను ఈ నిర్ణయం తీసుకునేందుకు ముందుకు వచ్చానన్నాడు. రిటైర్మెంట్ అనేది బాధ కలిగించే అంశమే అయినా పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడూ తప్పుకోవడమే మంచిదని మోర్కెల్ పేర్కొన్నాడు. ఇదిలావుండగా మోర్కెల్ తన నిర్ణయాన్ని మార్చుకుంటాడనే నమ్మకంతో దక్షిణాఫ్రికా కోచ్ ఒటిస్ గిబ్సన్ ఉన్నాడు. అయితే రిటైర్మెంట్ అంశం మోర్కెల్ వ్యక్తిగత అంశమని, దీనిపై తాము ఒత్తిడి తీసుకో రాలేమని పేర్కొన్నాడు. కాగా, మోర్కెల్ ఇప్పటి వరకు 117 వన్డేల్లో సౌతాఫ్రికాకు ప్రాతినిథ్యం వహించాడు. ఇందులో 25.32 సగటుతో 188 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు 83 టెస్టుల్లో బరిలోకి దిగిన మోర్కెల్ 294 వికెట్లను తన ఖాతాలో జమచేసుకున్నాడు. ట్వంటీ–20లలో కూడా 47 వికెట్లను సొంతం చేసుకున్నాడు. 2006 డిసెంబర్‌లో మోర్కెల్ తన తొలి టెస్టును ఆడాడు. 2017లో వన్డే కెరీర్‌కు శ్రీకారం చుట్టాడు.



మరిన్ని టైటిల్స్ సాధిస్తా

న్యూఢిల్లీ: రానున్న రోజుల్లో మరిన్ని టైటిల్స్ గెలుచుకోవడమే తన ముందున్న ఏకైక లక్ష్యమని భారత బ్యాడ్మింటన్ స్టార్, తెలుగుతేజం పారుపల్లి కశ్యప్ పేర్కొన్నాడు. ఇటీవల జరిగిన ఆస్ట్రియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ట్రోఫీని గెలుచుకోవడం ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందన్నాడు. ఒకప్పుడూ అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో నిలకడైన విజయాలు సాధించిన తాను కొంతకాలంగా పేలవమైన ఫాంతో సతమతమవుతున్నానని చెప్పాడి. అయితే కిందటి ఏడాది చివర్లో తన ఆట ఒక్కసారిగా గాడిలో పడిందన్నాడు. అప్పటి నుంచి రోజురోజుకు ఆటను మెరుగు పరుచుకుంటూ పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపాడు. సీనియర్ ఆటగాడిగా భారత్‌కు టైటిల్స్ అందించడం తన ముందున్న ప్రధాన లక్ష్యమన్నాడు. దీని కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్టు వివరించాడు. క్లిష్ట సమయంలో కోచ్ గోపీచంద్ అందించిన సహకారం ఎన్నటికీ మరచి పోలేనన్నాడు. గోపీచంద్‌తో పాటు సహాయక సిబ్బంది, సహచర ఆటగాళ్లు తనలో ధైర్యాన్ని నూరి పోశారన్నాడు. వారిచ్చిన ప్రోత్సాహంతోనే మళ్లీ బ్యాడ్మింటన్‌లో మెరుగ్గా రాణించ గలుగుతున్నానని కశ్యప్ స్పష్టం చేశాడు. కాగా, పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో టాప్–30లోకి రావడమే తన ప్రథమ లక్ష్యమన్నాడు. ప్రస్తుతం 44వ ర్యాంక్‌లో ఉండడంతో ప్రతిష్టాత్మకమైన కామన్‌వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించలేక పోయానని కశ్యప్ పేర్కొన్నాడు. ఇదిలావుండగా తాను లేకున్నా భారత్ ఈ క్రీడల్లో పతకాల పంట పండిస్తుందనే నమ్మకం తనకుందన్నాడు. శ్రీకాంత్, ప్రణయ్, సింధు, సైనా తదితరులు ఈ పోటీల్లో భారత్‌కు పతకాలు అందించడం ఖాయమన్నాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.